వాసెబుల్
గత వారం రోజుల్లో విశేషాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-4-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 67 పేజీలు: 10+4 వెల: 6.50



చంద్రుని ఆవలివైపు ఏం ఉంది?

నవ్‌జ్యోత్ సిద్ధూ భార్య కొత్తపార్టీ

5


రెండు రోజుల్లో

# 2322 పోస్టుల భర్తీ

రెండేళ్లలో 10,327 మెడికల్ నియామకాలు చేశాం: ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహా




మంగళవారం హైదరాబాద్‌లో మెడికల్ నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి దామోదర

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 7:** వైద్య, ఆరోగ్యశాఖలో గడిచిన రెండేళ్లలోనే 10,327 ఉద్యోగాలు భర్తీ చేశామని, రెండ్రోజుల్లో మరో 2322 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి అవుతుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెష లిస్ట్) పోస్టులకు ఎంపికైన డాక్టర్లకు మంత్రి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు. కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్లందరికీ హృదయపూర్వక అభినందనలు.. ఇది మీ జీవితంలో మర్చిపోలేని ఒక అద్భు తమైన రోజు.. ఓ వైపు వరల్డ్ హెల్త్ డే.. మరోవైపు ఉద్యోగ నియామక పత్రాలు అందుకోవడం చాలా అరుదుగా జరిగే విషయం. 692 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) డాక్టర్లకు, 174 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేస్తున్నానన్నారు. >>2




## గడువు ముగియడంతో కత్తులు దూసిన ట్రంప్

గజగజ వణికిన ఖర్గ్‌దీవి.. ప్రతీకార దాడులు ముమ్మరం చేసిన ఇరాన్

నాతోపాటు ఇరాన్ ప్రజలంతా ప్రాణత్యాగానికి సిద్ధమే: ప్రెసిడెంట్ పెజెష్కియాన్

అట్టుడుకుతున్న పశ్చిమాసియా

# ప్రతిక్షణం అగ్నిగోళం

ఇరాన్‌పై భూతల, వైమానిక, నావికా దళాలతో దాడులు జరుపుతున్న అమెరికా-ఇజ్రాయెల్ దళాలు

**టెహ్రాన్ /టెల్అవీవ్ / వాషింగ్టన్, ఏప్రిల్ 7:** మధ్యప్రాచ్యం మరోసారి బాంబులు క్షిపణులతో అట్టుడికిపోతోంది. ఇరాన్‌తమతో ఒప్పందానికి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఇచ్చిన గడువు ముగియడంతో ఇక కాల్పులు ప్రారంభిస్తామని ట్రంప్ చేసిన హెచ్చరికలు ఇరాన్‌లో ఉద్రిక్తతలను >>2

# లెటర్ వార్



## చర్చలకా? నాకేం పని!

అభివృద్ధి, అవినీతిలో మీ రాష్ట్రం ఎక్కడో తెలుసు

ప్రజలే తీర్పు ఇచ్చే రోజు వస్తుంది..

కేరళంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల అవినీతి కూడా అందరికీ తెలుసు

రేవంత్ విమర్శలకు ఘాటుగా బదులిచ్చిన కేరళం సిఎం విజయన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 7:** కేరళ అసెంబ్లీ ఎన్నికల వేడి పెరుగుతున్న కొద్దీ, రాజకీయ మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై కేరళ ముఖ్యమంత్రి, ఎల్‌డీఎఫ్ నేత పినరయి విజయన్ సుదీర్ఘమైన, ఘాటైన సమాధానం ఇచ్చారు. తనతో చర్చకు రావాలన్న సిఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై పినరయి విజయన్ మంగళవారం స్పందించారు. రేవంత్‌రెడ్డితో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, రేవంత్ ప్రభుత్వ పనితీరుపై తెలంగాణ ప్రజలే తీర్పు ఇవ్వాలని విజయన్ తెలిపారు.రాజకీయ విభేదాలు సహజమే అయినా, వ్యక్తిగత దూషణలతో కూడిన వ్యాఖ్యలను తాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ జవాబుదారీతనం ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలప్పుడు మాత్రమే కాదని, నిరంతర ప్రక్రియ అని, >>2



## ఆ బంగారం ఏమైంది?

శబరిమల కేసు ఇప్పటికీ అపరిష్కృతమే

గత కాంగ్రెస్ ప్రభుత్వాల వల్లే కేరళం అభివృద్ధి

మీ డాష్ కామెంట్‌కు నేను ర్యాష్ కామెంట్ చేయను

విజయన్‌కు సిఎం రేవంత్ కౌంటర్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్7:** కేరళం రాష్ట్రం ఇప్పటివరకు సాధించిన విజయాలన్నీ గతంలోని యూడీఎఫ్ ప్రభుత్వాల పనితీరు ఫలితమేననే విషయాన్నిగుర్తించాలని కేరళం ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌కు రాసిన లేఖలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్డీఎఫ్ వరుసగా రెండు సార్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వాల హయాంలో ఏం జరిగిందో కేరళం ప్రజలకు తెలియజేయాలని సీఎం డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదని కేరళం ముఖ్యమంత్రి విజయన్ రాసిన లేఖకు సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ప్రత్యుత్తరం రాశారు. కేరళం ప్రభుత్వ పనితీరుపై తాను గౌరవంగా, హుందాగా స్పందించాలని అనుకున్నానని, కానీ, మీ ప్రతిస్పందనలో మాత్రం మీరు అభ్యంతరకరమైన భాషను ఉపయోగించారని విజయన్‌ను ఉద్దేశించి సీఎం పేర్కొన్నారు. ప్రత్యర్థుల >>2

పోలీసు జులుంతో

# ప్రజాస్వామ్యం ఖూనీ

రైతులకు ఆసరాగా వెళ్తే అరెస్టులు చేస్తారా: కెటిఆర్ ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్7:** బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఇతర నేతల అరెస్టులపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న మాజీ మంత్రి హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, పార్టీ నేతలు మహేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి,మెతుకు ఆనంద్, ఇతర నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాడ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుండి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలీ పేదల భూముల పైన పడిందని ఆరోపించారు. రైతు >>2





## త్వరలో తులం బంగారం

ఎన్నికల హామీ అమలుకు ప్రభుత్వం సిద్ధం

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మహిళలకు తులం బంగారం పథకంపై తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కళ్యాణలక్ష్మి, షాదీముబార్ పథకాల్లో భాగంగా మహిళలకు తులం బంగారం అందిస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆరు గ్యారెంటీల్లో >>2

ఉత్తరం వైపు రీజినల్ రింగ్‌రోడ్‌కు

# వేగంగా భూసేకరణ



సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో కొలిక్కి వచ్చిన భూ సేకరణ

భూముల కోసం రైతులను బుజ్జగిస్తున్న అధికారులు

**హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** రీజినల్ రింగ్‌రోడ్‌ఉత్తర దిశవైపు భూసేకరణ కోసం సంగారెడ్డి,మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికార యంత్రాంగం వేగం పెంచింది. సంగారెడ్డి జిల్లాలో శివంపేట,వెండికోలు,లింగంపల్లి, వెంకటకిష్టాపూర్ కోర్సోలు, గ్రామాలతో పాటు, సిద్దిపేట జిల్లాలోనిజగదేవ్ పూర్, మర్కూక్ మండలాలు, భువనగిరి మండలం మినహా మిగిలిన అన్ని మండలాల్లో భూ సేకరణ కొలిక్కి వచ్చింది. త్రిపులార్ పరిధిలోని జిల్లా కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్ రెవెన్యూ ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతులకు నచ్చజెప్పి భూములు ఇప్పించే పనిలో ఉన్నారు.ఉత్తర భాగంలో సంగారెడ్డి,మెదక్ సిద్దపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల మీదుగా సుమారు 164 కిమీ మేర ట్రిపుల్ ఆర్ వెళ్లనుంది. భూముల సేకరణ కోసం ఆయా జిల్లాలో వేగం పెంచడమే కాకుండా సెలవురోజుల్లో కూడా రైతులతో సమావేశాలు నిర్వహించి ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.సంగారెడ్డి జిల్లాలో శివంపేట, వెండికోలు,లింగంపల్లి, వెంకటకిష్టాపూర్ కోర్సోలులో ఏప్రిల్3న శుక్రవారం సమావేశం నిర్వహించి 298.23 ఎకరాల భూములు కోల్పోతున్న 581 మంది రైతులకు నోటిసులు జారీచేసి నచ్చచెప్పారు. . సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో మార్చి 16న జగదేవ్‌పూర్, మర్కూక్ మండలాల పరిధిలోని చెబర్తి, అలిరాజ్‌పేట, పీర్లపల్లి, ఇటిక్యాల గ్రామాల రైతులతో ఆర్బిటరేషన్ ప్రక్రియ గురించి నిర్వహించి రైతులను ఒప్పించడానికి కలెక్టర్ కూడా ప్రత్యక్షంగా భూ నిర్వాసితులతో సమావేశమైనారు. యాదాద్రి జిల్లాలోని భువనగిరి మండలం రాయగిరి, చౌటుప్పల్లో జంక్షన్లు రానున్నాయి. ఇందుకోసం 2,588 ఎకరాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లిలో ప్రారంభయ్యే రీజినల్‌రింగ్‌రోడ్ యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా వెళ్తుంది.యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల భూ సేకరణ క్రతువు దాదాపు పది >>2




## 15 లోగా రెండో విడత రైతు భరోసా

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** రెండో విడత రైతు భరోసా నిధుల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసింది. ఈ నెల 15 లోపు రెండో విడత రైతు భరోసా నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. రెండో విడత యాసంగి రైతు భరోసా విడుదలలో భాగంగా 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.6వేల చొప్పున జమ చేయనుంది. తొలి విడతలో జమ చేసిన 6 వేల >>2

## కెసిఆర్‌లా విజయన్‌నూ మార్చేస్తారు

విజయన్‌కు మోడీనే గాడ్‌ఫాదర్, అందుకే కేసులు, అరెస్టులు లేవు

ఆయన తెలంగాణకు వచ్చి మేం చేస్తున్నవి పరిశీలించుకోవచ్చు

కేరళం ఎన్నికల ప్రచారంలో సిఎం రేవంత్ 2

సాయిల్ హెల్త్

# వలంటీర్లుగా రైతులు

30 వేల మంది యువ రైతులకు శిక్షణ

- వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మట్టి నమూనా పరీక్షల ఆధారంగా ఎరువులను శాస్త్రీయంగా వాడాలని అన్నదాతలకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రతీ వారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు అధికంగా పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా యూరియా యాప్‌పై రైతుల అభిప్రాయా లను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించుకుని సిఫార్సుల మేరకు నేల స్వభావానికి అనుగుణంగా శాస్త్రీయంగా ఎరువులు వినియోగించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నదని వివరించారు. ఈ ప్రణాళికలో భాగంగా భూసార పరీక్షల అనంతరం రైతులకు అందించే నేల ఆరోగ్య కార్డులో పొందుపరిచిన వివరాలను సులభంగా అర్థమయ్యేలా వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల మంది యువ రైతులను వలంటీర్లుగా ఎంపిక చేసి శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో ఇద్దరు నుండి ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, వాటి ఫలితాల అర్థం చేసుకోవడం, పంటలకు అనుగుణంగా ఎరువుల వినియోగం వంటి అంశాలపై వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ అందచేస్తున్నామని, రాష్ట్రంలోని రైతు విజ్ఞాన కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, పరిశోధనా కేంద్రాల్లో రోజుకు సుమారు వెయ్యి మందికి శిక్షణ అందిస్తూ, నెలరోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.



వార్త ఎక్స్‌ప్రెస్

# మరుగుతున్న నూనెలు

రూ. 30 పెరిగిన సన్‌ఫ్లవర్

పామాయిల్ రూ. 20 పెంపు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మధ్యప్రాచ్యంలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం కేవలం భౌగోళిక రాజకీయాలకే పరిమితం కాకుండా సామాన్యుడి గృహ బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది. గత కొద్ది రోజులుగా వంట నూనె ధరలు అమాంతం పెరగడమే ఇందుకు నిదర్శనం. యుద్ధం కారణంగా వంట నూనెల ధరలు అమాంతం పెరగనున్నాయన్న భయాందోళనతో రాష్ట్రంలోని ప్రధాన సూపర్ మార్కెట్లు, కిరాణా దుకాణాల వద్ద వంట నూనెల కొనుగోలు కోసమే జనం క్యూ కడుతున్నారు. యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే సరఫరా నిలిచిపోతుందనే ప్రచారంతో వినియోగదారులు ఒక్కసారిగా దుకాణాలకు తరలివస్తున్నారు. భవిష్యత్తులో ధరలు ఇంకా పెరుగుతాయనే భయంతో ప్రస్తుతం ఉన్న పాత గరిష్ట రిటైల్ ధర వద్దే నూనె ప్యాకెట్లను భారీగా నిల్వ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో కొద్ది రోజులుగా వంట నూనె ధరలు గత పది రోజుల్లోనే గణనీయంగా పెరిగాయి. సాధారణ రోజుల్లో మార్కెట్‌లో సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో నూనె రూ.150గా ఉండగా ఇప్పుడు అది రూ.180కి చేరింది. కొద్దిరోజుల్లోనే కిలోపై రూ.20 మేర పెరిగింది. కేవలం సన్‌ఫ్లవర్ ఆయిల్ మాత్రమే కాకుండా పేద మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండే పామాయిల్ ధరలు కూడా లీటరుకు రూ.15 నుండి రూ.20 వరకు >>2



మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్ శుక్లాతో భేటీ అయిన హైకోర్టు సిజె అపరేష్ కుమార్ సింగ్

# గవర్నర్‌తో హైకోర్టు సిజె భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్7:** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మంగళవారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం వారు కొద్ది సేపు భేటి అయ్యారు. అంతకు ముందు గవర్నర్‌ను డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయం అకాడమిక్ , అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన గవర్నర్‌కు వివరించారు. ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఈఎఫ్‌ఎల్‌యూ) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్. నాగరాజు మంగళవారం లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌ను శివ ప్రతాప్ శుక్లా ను మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయం విద్యా కార్యక్రమాలు, అభివృద్ధి చర్యలపై ఆయన గవర్నర్‌కు వివరించారు.తెలంగాణ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి గవర్నర్‌ను కలసి ఆహార భద్రత, కమిషన్ కార్యకలాపాలపై చర్చించారు. డీఎండీఈ డైరెక్టర్ రియర్ అడ్మిరల్ అశ్వని కుమార్ టికూ అధికారులతో కలిసి గవర్నర్‌ను కలిశారు. సంస్థ కార్యకలాపాలను వివరించారు.ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌ఐసీసీఐ) అధ్యక్షుడు రవి కుమార్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## రెండు రోజుల్లో 2322 పోస్టుల భర్తీ

>> అనస్థీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ వంటి కీలక విభాగాల్లో ఈ నియామకాలు జరగడం ఎంతో ప్రాధాన్యత కలిగిన విషయమన్నారు. మీ అందరి రాకతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించగలుగుతామని, రాష్ట్రంలో ఎక్కడా డాక్టర్లు, సిబ్బంది కొరత లేకుండా చేసి, ప్రజలకు సమయానికి, నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రాధాన్యమన్నారు. డిసెంబర్ 2023లో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి ప్రభుత్వ హాస్పిటళ్లలో వేల సంఖ్యలో డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించే లక్ష్యంతో వెంట, వెంటనే ఉద్యోగాల నియామకాలు చేపట్టామని, డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, తదితర పోస్టులన్నీ భర్తీ చేస్తూ వస్తున్నామన్నారు. ఈ రెండేళ్లలో ఏకంగా 10,327 పోస్టులను భర్తీ చేశామని, మరో రెండు రోజుల్లో 2,322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల నియామకాన్ని పూర్తి చేయబోతున్నామన్నారు. ఇంకా 6,512 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, అందులో 1,000 స్పెషలిస్ట్ డాక్టర్లు, 475 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 2,322 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మాసిస్టులు, ఇతర సిబ్బంది పోస్టులున్నాయన్నారు. రిక్రూట్‌మెంట్ మాత్రమే కాకుండా.. హాస్పిటల్స్‌కి అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎక్విప్‌మెంట్, డ్రగ్స్, డయాగ్నస్టిక్స్ అన్నీ సమకూరుస్తున్నామన్నారు. నియామక పత్రాలు అందుకుంటున్న డాక్టర్లు సేవా భావంతో పనిచేయాలని, ప్రతి రోగిని మానవత్వంతో చూడాలన్నారు.

## వేగంగా భూసేకరణ

>> అంకానికి చేరుకుంది. 19.19 కి.మీ.కు 540 ఎకరాలు సేకరించి అవార్డు కూడా పాస్ చేశారు. మల్లాపూర్లో పెండింగ్లో ఉంది. 290 ఎకరాలు సేకరించి 674 మంది రైతులకు రూ.57 కోట్లు చెల్లించారు. మిగిలిన వారికి పరిహారం చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు గౌస్‌నగర్, ఎర్రంబల్లిలో 484 ఎకరాల సేకరణ జరగాల్సి ఉంది. కోర్టు కేసుతో ఆగింది. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చినా రైతులు అభ్యంతరం చెప్పడంతో ఆగింది. ప్రస్తుతం కేసారం, పెంచికలపహాడ్లో సర్వే పూర్తయ్యింది. అవార్డు కూడా పాస్ చేశారు. రాయగిరి మినహా మిగిలిన మండలాల్లో సర్వే కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఎక్కడా రైతులకు డబ్బులు చెల్లించలేదు.వలిగొండ, చౌటుప్పల్ పరిధిలో 25.47 కిమీ రహదారి కోసం భూసేకరణ వేగంగా సాగుతోంది. ఈ రెండు మండలాల్లో 983 మంది రైతుల నుంచి 784 ఎకరాలు సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటికే 118 ఎకరాలకు అవార్డు పాస్ చేసి 361 మంది రైతులకు రూ.64 కోట్లు చెల్లించారు.సుమారు 2,588 మంది రైతుల నుంచి సుమారు రెండు వేల ఎకరాలు సేకరించాలని ఎన్హెచ్ఎఐ అధికారులు అభ్యర్థన ఇచ్చారు. 1289 ఎకరాలకు రూ.532 కోట్ల పరిహారం చెల్లించేందుకు అవార్డు పాస్ చేశారు. ఇప్పటి వరకు 409 ఎకరాలకు 1035 మంది రైతులకు రూ.121.46 కోట్ల పరిహారం వారి ఖాతాల్లో జమ చేశారు.పరిహారం తీసుకున్న తుర్కపల్లి, యాదగిరిగుట్ట, వలిగొండ మండలాలకు చెందిన రైతులు పరిహారం పెంపునకు దరఖాస్తు చేసుకోగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి నిర్వాసితులతో సంప్రదింపులు జరుపుతున్నారు. రైతులతో చర్చించి తనకున్న పరిధి మేరకు పరిహారం పెంచుతూ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు సిఫార్సు చేస్తున్నామనీ చెబుతూ రైతులను ఒప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం కింద రూ.15,627 కోట్ల అంచనా వ్యయంతో సంగారెడ్డి నుంచి నర్సాపూర్‌తూప్రాన్ గజ్వేల్ యాదగిరిగుట్టచౌటుప్పల్ వరకు సుమారు 160 కిలోమీటర్ల మేర హ్యామ్ విధానంలో ఆరు లేన్ల రహదారిని ఐదు ప్యాకేజీల్లో నిర్మించాలని నిర్ణయించారు.రహదారి నిర్మాణంలో భూసేకరణ పెద్ద సమస్యలా మారింది. ఉత్తరభాగంలో 1918.50 హెక్టార్లు సేకరించగా 1597.62 హెక్టార్లకు అవార్డు కూడా అయింది. అత్యంత కీలకమైన ఈ ప్రక్రియ ఎటూతేలకపోవడం వల్లే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ప్రధాన కారణమని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఉత్తర భాగం రహదారి నిర్మాణానికి 1933.2 హెక్టార్ల భూమి అవసరం కాగా, 46.3 హెక్టార్లు మాత్రమే ఎన్‌హెచ్‌ఏఐ ఆధీనంలోకి వచ్చింది. సేకరించాల్సిన భూములకు 3ఏ నోటిఫికేషన్ (ప్రాథమిక నోటిఫికేషన్) జారీ చేసినా, నష్టపరిహారం చెల్లించి భూముల స్వాధీనానికి ఉద్దేశించిన 3హెచ్ నోటిఫికేషన్ మాత్రం ఇప్పటివరకు 4శాతం మాత్రమే పూర్తికావడం గమనార్హం. పార్లమెంటరీ కమిటీ దేశంలో ప్రాజెక్టులు నిలిచిపోకుండా భూసేకరణ పూర్తి అయిన తరువాతనే చేపట్టాలని ఎక్కడా 100 శాతం భూసేకరణ పూర్తికాకుండా ప్రాజెక్టులు చేపట్టరాదని సూచించింది. ప్రాజెక్టులు మధ్య లో నిలిచిపోవడం వల్ల పెట్టిన పెట్టుబడి వృథా కావడమే కాకుండా అంచనా వ్యయం భారీగా పెరుగుతుందని, దీనివల్ల కొత్త తలనొప్పులు తలెత్తుతాయని తేల్చింది.

ట్రిపుల్ ఆర్ పనులు చేపట్టే విషయంలో ఎన్‌హెచ్‌ఏఐ తొందర పడటంలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఉత్తర దిశ త్రిపులార్ ఎకరా 50 లక్షలు కనిష్ఠంగా ధర ఉండటంతో భూ నిర్వాసిత రైతులు మార్కెట్ ధరకు అనుకూలంగా పరిహారం కోరుతున్నారు కానీ ప్రభుత్వం నష్టపరిహారం పెంచే పరిస్థితిలో లేదు. దీనితో కొన్ని చోట్ల ఎంత నచ్చచెప్పినా రైతుల నుంచి భూ బదలాయింపుకు ప్రతిబంధకం ఏర్పడుతోంది.ఎన్‌హెచ్‌ఏఐ సైతం దేశవ్యాప్తంగా ఒకే విధానాన్ని అనుసరిస్తున్నందున ట్రిపుల్ ఆర్ కోసం నిబంధనలను మార్చుకునే అవకా శం లేదు. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు ఇప్పట్లో ముందుకు సాగే అవకాశం లేదని అధికారవర్గాలు స్పష్టంచేస్తున్నాయి.

## రెండో విడత రైతు భరోసా

>> రూపాయలను మినహాయించి మిగతా మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అర్హులైన రైతులందరికీ రెండో విడత రైతు భరోసా నిధులు జమ చేయడం కోసం దాదాపు రూ. 2,700 కోట్లను సమకూర్చుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయంలో ఆలస్యం చేయొద్దని ఆయన ఆదేశించినట్లు తెలిసింది.

ఇక ఈ నెలలోనే చివరి వారంలో మూడో విడత ఏప్రిల్ నెలాఖరులోగా మూడో విడత నిధులు జమ చేయనున్నట్లు సమాచారం. దీంతో యాసంగి సీజన్ రైతు భరోసా కోసం మొత్తం రూ. 9,000 కోట్ల ఆర్థిక సహాయం పంపిణీ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

అయిదు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులందరికీ వారం రోజుల్లోగా రెండో విడత రైతు భరోసా నిధులు జమ అవుతాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## త్వరలో తులం బంగారం

>> భాగంగా ఈ హామీ ప్రకటించింది. ఈ క్రమంలో ప్రభుత్వం ఈ పథకం అమలు విషయంలో స్పష్టత ఇచ్చిఇంది. త్వరలోనే పథకం అమలు త్వరలోనే తులం బంగారం పథకాన్ని అమలు చేయనున్నట్లు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని, త్వరలో కళ్యాణలక్ష్మి ్మతో పాటు తులం బంగారం పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అయిదేళ్ల పదవీకాలంలోపు ప్రతీ హామీని అమలు చేస్తామని తెలిపారు. అధికారంలోకి రాగానే మెజార్టీ హామీలను నెరవేర్చామని, మిగతావి కూడా త్వరలోనే అమలవుతాయన్నారు. పథకాలన్నీ అమలు చేశాకే ప్రజల వద్దకు వెళ్తామని స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే కళ్యాణ లక్ష్మి ్మ పథకంలో ఇచ్చే నగదుతోపాటు తులం బంగారం కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే హస్తం పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా కూడా ఈ పథకంపై ఎలాంటి ప్రకటన లేదు. దీంతో విపక్షాలు, ప్రజలు తులం బంగారం పథకం ఎప్పుడు అమలు చేస్తారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో తులం బంగారం పథకంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది.

## వారం - వర్జ్యం

08-04-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
షష్ఠి రా.7.01
మూల పూర్తి
వర్జ్యం : లేదు
దు.ఉ.11.44-మ.12.34
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. సంతాన విద్యా విషయంలో స్థిరమైన నిర్ణయం తీసుకుంటారు.

**వృషభం:** మీ ఆధ్వర్యంలో నడిచే సంస్థలకు కొన్ని అవార్డులు రావచ్చు. ఆరోగ్యపరంగా కొన్ని జాగ్రత్తలు అవసరం.

**మిథునం:** వృత్తి, ఉద్యోగాల పరంగా మీ వ్యక్తిగత రహస్య సమాచారం ఇతరులకు చేరుతుంది. మీ నిర్లక్ష్యం వలనే జరుగుతుంది.

**కర్కాటకం :** మీవైరి వర్గానికి కొమ్ముకాస్తున్న వారు బలహీనులవడం మీకు ఆయా చితవరంగా మారుతుంది. వాహనసౌఖ్యం.

**సింహం:** ఆర్థిక పురోభివృద్ధి, పొదుపు మొదలగు అంశాలు నామ మాత్రంగా ఉంటాయి. నూతన విద్యావకాశాలు కలవు.

**కన్య :** మహోన్నతమైన వనులు సాధించుకోవడానికి ముఖ్యవ్యక్తుల సహకారం అవసరం లేదని నిరూపిస్తారు.

**తుల :** అప్రయత్నంగా పనులు చేస్తారు. ఇంటిలో శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. వస్త్రలాభం.

**వృశ్చికం:** స్థిరాస్తి తగాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. కొత్త పెట్టుబడులకు తగిన సాయం అందుతుంది.

**ధనుస్సు:** పరిశ్రమలు, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి. శత్రువులు సమస్యలు సృష్టించినా అధిగమిస్తారు.

**మకరం:** కాంట్రాక్టులు లభిస్తాయి. విదేశాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఋణాలు తీరుస్తారు.

**కుంభం:** కార్యాలయంలో ఉన్నతాధికారులు మీ సేవలను పరిజ్ఞానంను వినియోగించుకుని లాభపడతారు.

**మీనం :** ఊహించని రీతిలో అవకాశాలు దగ్గరకు వస్తాయి. సద్వినియోగం చేసుకోండి. ప్రయాణాలు లభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# చర్చలకా? నాకేం పని!

>> తమ ప్రగతి నివేదికలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేశారు.

కేరళ సామాజిక సూచికల ఘనతను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని విజయన్ ఆరోపించారు. చారిత్రక వాస్తవాలను గుర్తుచేస్తూ.. 'స్వాతంత్రం వచ్చిన మొదటి దశాబ్దంలోనే భూస్వామ్య వ్యవస్థకు ముగింపు పలికేందుకు తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం భూసంబంధాల బిల్లును తీసుకొచ్చింది. కానీ, అప్పుడు కేంద్రంలో ఉన్న మీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసి మా ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసింది. 1993 నాటి 73, 74వ రాజ్యాంగ సవరణలకు దశాబ్దాల ముందే మా ప్రభుత్వం వికేంద్రీకృత పాలనకు బీజం వేసింది. 1980లలో అక్షరాస్యత ఉద్యమానికి, 1996లో ప్రజా ప్రణాళికా ప్రచారానికి నాంది పలికింది కూడా ఎల్‌డీఎఫ్ ప్రభుత్వమే అని వివరించారు.

జాతీయ సూచీలను ఉటంకిస్తూ తెలంగాణతో కేరళను పోల్చారు. 'నీతి ఆయోగ్ ప్రకారం, దేశంలో అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రం కేరళ. అదే సమయంలో, అత్యధిక అవినీతి గల రాష్ట్రాల జాబితాలో తెలంగాణ 6వ స్థానంలో ఉంది' అని చెప్పారు. జాతీయ సుస్థిరాభివృద్ధి సూచీలో మేము 79 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంటే, మీరు 6వ స్థానంలో ఉన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సంస్కరణల్లో కూడా కేరళ నంబర్ వన్ స్థానంలో నిలిచింది అని విజయన్ పేర్కొన్నారు. తాము నవ కేరళ మిషన్ల ద్వారా కొలవదగిన ఫలితాలు సాధిస్తున్నామని, ఆర్ద్రం మిషన్ కింద 670 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునిక కుటుంబ ఆరోగ్య కేంద్రాలుగా మార్చామని తెలిపారు. 13,000 ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతీకరించామని, 45,000 తరగతి గదులను హైటెక్ సౌకర్యాలతో తీర్చిదిద్దామని వివరించారు.

మౌలిక సదుపాయాలు, పేదరిక నిర్మూలన, గత కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ రహదారుల విస్తరణ, గెయిల్ పైప్‌లైన్, ఎడమన్‌కొచ్చి పవర్ హైవే వంటి కీలక ప్రాజెక్టులను గాలికొదిలేస్తే, తమ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వమే వాటిని పునరుద్ధరించి పూర్తి చేసిందని విజయన్ తెలిపారు. కొచ్చి మెట్రో, విళింజం అంతర్జాతీయ ఓడరేవు ప్రాజెక్టులు ఆలస్యం కావడానికి గత కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాలే కారణమని ఆరోపించారు. 2025 నవంబర్ 1 నాటికి దేశంలోనే తీవ్ర పేదరికం లేని ఏకైక రాష్ట్రంగా కేరళ నిలిచిందని, ఎక్స్‌ట్రీమ్ పావర్టీ ఎరాడికేషన్ ప్రాజెక్ట్ (ఇపీఈపీ) ద్వారా 64,006 కుటుంబాలను ఆదుకున్నామని ప్రకటించారు. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం బీజేపీని విమర్శించడం లేదన్న రేవంత్ ఆరోపణలను విజయన్ తిప్పికొట్టారు. 'రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో ఆర్టికల్ 131, 32 కింద న్యాయపోరాటం చేస్తున్నది కేరళ ప్రభుత్వమే. 16వ ఆర్థిక సంఘం విషయంలో బీజేపీయేతర రాష్ట్రాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు మేమే ప్రయత్నిస్తున్నాం. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే కేంద్ర ప్రభుత్వ చర్యలను మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. బలమైన వైఖరిని ప్రదర్శించడానికి హుందాతనాన్ని దాటి మాట్లాడాల్సిన అవసరం లేదు. మేము వెనుకకు వెళ్ళం, కేవలం ముందుకు మాత్రమే సాగుతాం. అందరికీ ఆదర్శంగా నిలిచే నవ కేరళను నిర్మించి తీరుతాం అని పినరయి విజయన్ తన సుదీర్ఘ ప్రకటనలో స్పష్టం చేశారు.

# ఆ బంగారం ఏమైంది?

>> తొందరపాటు వ్యాఖ్యలపై తానెప్పుడూ ఆవేశపూరితంగా స్పందించనని సీఎం తెలియజేశారు. మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను అంటూ వ్యాఖ్యానించిన ఆయన, మీరు మా రాష్ట్రానికి వచ్చినప్పుడు అతిథికి ఇవ్వాల్సిన పూర్తి గౌరవం ఇస్తానని స్పష్టం చేశారు. ఈ మేరకు, ఇదే నా చివరి స్పందన అంటూ రేవంత్ రెడ్డి తన లేఖను ఎక్స్ లో పంచుకున్నారు. తెలంగాణ ప్రస్తుత పనితీరుపై తీర్పు ఇవ్వడానికి పినరయి విజయన్ 2023-24 నాటి నీతి అయోగ్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచీని ఉటంకించడంపై రేవంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సమయంలో తెలంగాణలో అధికారంలో ఉన్నది ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కాదని, అది పదేళ్ల బీఆర్ఎస్‌బీజేపీ పదేళ్ల దుష్పరిపాలన చివరి దశ అని విజయన్‌కు సీఎం తెలియజేశారు. తెలంగాణలో తమ ప్రజా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకున్నందున ఈ కాలంలో తమ పనితీరు ఆధారంగా తమని అంచనా వేయాలని కేరళం ముఖ్యమంత్రి విజయన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. 2024-25లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా నమోదైందని, ఇది 10.7శాతం వృద్ధి రేటుతో జాతీయ సగటు 9.9శాతం కంటే ఎక్కువని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.87 లక్షలకు చేరుకుందని, ఈ గణాంకాల ఆధారంగా తెలంగాణ భారతదేశంలోనే ముందు స్థానంలో నిలిచిందని సీఎం స్పష్టం చేశారు. ఆర్‌బీఐ హ్యాండ్‌బుక్ 2024-25 గణాంకాల ప్రకారం కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళం రాష్ట్రాలను తెలంగాణ అధిగమించిదన్నారు. 2025, చివరి నాటికి తీవ్ర పేదరికాన్ని (ఎక్స్‌ట్రీమ్ పావర్టీ) పూర్తిగా నిర్మూలించిన మొదటి రాష్ట్రంగా కేరళం నిలవనుందని మీరు ట్వీట్ చేశారని కేరళం ముఖ్యమంత్రి విజయన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇది 2026, ఏప్రిల్ నెల, కానీ మీరు రాసిన లేఖలో 64,006 కుటుంబాలు ఇప్పటికీ పథకాలను పొందుతున్నాయని పేర్కొన్నందున మీరు పేదరికాన్ని నిర్మూలించారా అని సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. 2025, నవంబర్ 1వ తేదీ నాటి మీ ప్రకటన ఎందుకు ఆచరణలోకి రాలేదని విజయన్ ను సీఎం ప్రశ్నించారు. నీతి ఆయోగ్ కరప్షన్ ర్యాంకింగ్‌లను తాను గౌరవిస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అదే సమయంలో విజయన్ చెప్పినట్లు కేరళం ప్రభుత్వం స్వచ్ఛమైనదైతే బంగారు స్మగ్లింగ్ వ్యవహారంలో మీ కార్యాలయంలోని ఉన్నతాధికారులు, కీలకమైన వ్యక్తులకి సంబంధాలున్నాయని డాక్యుమెంట్లతో సహా నిరూపించబడిన ఆ కేసు ఎందుకు అపరిష్కృతంగా మిగిలిపోయిందని విజయన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శబరిమల అయ్యప్ప ఆలయం నుంచి 4.5 కిలోల బంగారం అక్రమ తరలింపు ఆరోపణలకు ఎందుకు జవాబు చెప్పడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తమ ప్రజా ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతతో ముందుకు వెళుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్‌లోని జాతీయ పారిశ్రామిక కారిడార్ వంటివి నిర్మించి ఒక దశాబ్దంలోనే రూ.1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా తాము ముందుకు వెళుతున్నట్లు సీఎం స్పష్టం చేశారు. అలాగే కేరళంలో రాబోయే కొద్ది రోజుల్లో ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం నవ కేరళం దార్శనికతను అమలు చేస్తుందని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేరళం ప్రజలు త్వరలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకుంటారని, జరగాల్సినది కూడా అదేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



మంగళవారం కేరళంలోని కోవలం ప్రచారంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

# కెసిఆర్‌లా విజయన్‌నూ మార్చేస్తారు

### విజయన్‌కు మోడీనే గాడ్‌ఫాదర్, అందుకే కేసులు, అరెస్టులు లేవు

### కేరళం ఎన్నికల ప్రచారంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 7:** కేరళంలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష ్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రచారం జోరుగా సాగిస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కీలక పాత్ర పోషించిన రేవంత్ రెడ్డిని, ఈసారి కేరళంలో 'స్టార్ క్యాంపెయినర్'గా నియమించారు. రేవంత్ రెడ్డి కేరళంలో విస్తృతంగా పర్యటిస్తూ, పలు బహిరంగ సభలు, రోడ్ షోలలో పాల్గొని పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం రేవంత్ రెడ్డి ఏఎన్ఐతో మాట్లాడుతూ పినరయి విజయన్ తనకు రాసిన లేఖలో 2014- 2023 మధ్య విషయాలను ప్రస్తావించారు. ఆ సమయంలో పినరయి విజయన్ సన్నిహిత మిత్రుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ఆయన లేఖలో పేర్కొన్నట్లుగా తప్పుల కారణంగానే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను మార్చేశారని, ఇప్పుడు కేరళంలో కూడా పినరయి విజయన్‌ను ప్రజలు మార్చేస్తారని అన్నారు. విజయన్‌పై శబరిమల బంగారం చోరీ, బంగారం స్మగ్లింగ్ కేసులున్నాయని, అయితే పినరయికి మోదీనే గాడ్‌ఫాదర్ కావడంతో, ఈ కేసులన్నింటి నుంచి విజయన్‌ను రక్షి స్తున్నారని పేర్కొన్నారు. దేశం కోసం తమ జీవితాలను, ఆస్తులను త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని రకరకాల కేసులతో వేధిస్తున్నారని, కేజ్రీవాల్ సహా అనేక మంది నేతలను ఈడీ కేసులతో వేధించి అరెస్టు చేసిన వాళ్లు ఎందుకు విజయన్ జోలికి రావడం లేదని ప్రశ్నించారు. నరేంద్ర మోదీ.. విజయన్ మధ్య ఉన్న అవగాహనతోనే కేసులు, అరెస్టులు లేవని పేర్కొన్నారు. కేరళం ప్రజలు ఈ విషయాలను గమనిస్తున్నారని, సరైన నిర్ణయం తీసుకుంటారు. విజయన్ మార్పు అవసరం స్పష్టమవుతుందని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తర్వాత కేరళంలోని కోవలం ప్రాంతంలో యూడీఎఫ్ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపాల్గొన్నారు. 'కేరళంలో పంచాయతీరాజ్ వ్యవస్థ విజయం సాధించింది.. దానిని మేం అభినందిస్తున్నాం. కేరళంలో పంచాయతీరాజ్ వ్యవస్థ ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీలది, ఎక్కడైనా మంచి జరిగితే మేం అభినందిస్తాం' అని పేర్కొన్నారు. పినరయి విజయన్ హయాంలోని వైఫల్యాలను ఎత్తి చూపాను, పినరాయి విజయన్ హయాం ముగిసిందన్నారు. 120 నెలల విజయన్ పాలన కాలం వైఫల్యానికి ప్రతీకగా నిలిచింది, పినరయి విజయన్ వైదొలిగే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. మూడింట రెండొంతుల మెజారిటీతో మేం గెలవబోతున్నాం.. ఊమెన్‌చాందీ తరహా పాలన అందిస్తామని భరోసా ఇచ్చారు. కేరళంలో సరైన అవకాశాలు లేకపోవడంతో యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారు. యువత వలస వెళ్లడంతో కేరళంలో వృద్ధులు, చిన్నపిల్లలే కనిపిస్తున్నారు, ఇది దురదృష్టకరం అని పేర్కొన్నారు. విద్యావంతులు, నైపుణ్యం ఉన్న యువత విదేశాలకు వెళ్లడం సరికాదు, వాళ్లు ఇక్కడకు వచ్చి ఉపాధి పొందేలా చేస్తాం అని చెప్పారు. తెలంగాణలో మాదిరే అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన మెరుగుపర్చడం వంటివి కేరళంలో అమలు చేస్తాం అని చెప్పారు. పినరయి విజయన్‌తో పాటు కేరళం కమ్యూనిస్టు మహిళా నాయకులను నేను తెలంగాణకు ఆహ్వానిస్తున్నా.. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు మేం చేస్తాం అని చెప్పారు. తెలంగాణలోని ఏ మూలకైనా వెళ్లి మేం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించవచ్చు, ఈ విషయంలో నేను విజయన్‌కు సవాల్ విసురుతున్నా అని చెప్పారు.

## మరుగుతున్న నూనెలు

>> పెరిగాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా హోటల్ యజమానులు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు 15 కేజీల టిన్‌లను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుండటంతో రిటైల్ మార్కెట్‌లో సామాన్యులకు వంట నూనెలు దొరకడం కష్టంగా మారింది.

భారతదేశం తన వంట నూనెల అవసరాల కోసం అత్యధికంగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. అదే సమయంలో దేశం వినియోగించే ముడి చమురులో దాదాపు 60 శాతం విదేశాల నుంచే వస్తుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఏ చిన్న ఉద్రిక్తత తలెత్తినా అది నేరుగా మన దేశీయంగా నిత్యావసరాల ధరలపై ప్రభావం చూపుతుంది. మధ్యప్రాచ్యంలో యుద్ధం కారణంగా చమురు రవాణా చేసే నౌకలు ప్రయాణించే మార్గాలు ప్రమాదకరంగామారాయి.దీంతో సరుకు చేరడానికి పట్టే సమయం పెరగడమే కాకుండా ఖర్చులు కూడా రెట్టింపు అవుతున్నాయి. ఇదే జరిగితే రాబోయే రెండు మూడు నెలల్లో గృహ ఖర్చులు భారీగా పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిత్యావసరాలధరలను అదుపులో ఉంచేందుకు భారత ప్రభుత్వం అంతర్జాతీయ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. అయినప్పటికీ మార్కెట్‌లో ధరల సెగ మాత్రం సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

## ప్రజాస్వామ్యం ఖూనీ

>> భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారంటీలు 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని, కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బిఆర్ఎస్ నాయకులకు కొత్త కాదు అని, ఉద్యమ కాలం నుండే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని అన్నారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా, బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

## రైళ్లకు దూరంగా ఉండాలి

### ఇరాన్ పౌరులకు హెచ్చరిక

**టెల్‌అవీవ్, ఏప్రిల్ 7:** ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం ఇంకా తీవ్రమవుతోంది. ఇరాన్‌పై మర్ని భీకర దాడులకు ఇరు దేశాలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రజలకు ఇజ్రాయెల్ ఒక హెచ్చరిక జారీ చేసింది. రైల్వే వ్యవస్థలకు, రైళ్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. ముఖ్యంగా 12 గంటలపాటు రైళ్లలో ప్రయాణించకపోవడమే మంచిదని సూచించింది. స్థానిక కాలమానం ప్రకారం ఇప్పటి నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఇరాన్‌లోని ఏ రైళ్లలో అయినా ప్రయాణించడం మానేయండి అని ప్రజలను హెచ్చరిస్తూ ఎక్స్‌లో ఇజ్రాయెల్ మిలిటరీ ఒక ప్రకటన జారీ చేసింది. వారి భద్రత కోసమే ఈ వార్నింగ్ ఇస్తున్నట్లు తెలిపింది. రైళ్లలో లేదా రైల్వే లైన్ల సమీపంలో ఉంటే ప్రాణాలకు ముప్పు తప్పదని హెచ్చరించింది.

# ప్రతిక్షణం అగ్నిగోళం

>> మరింతపెంచాయి. ఇంధన కేంద్రాలు, విద్యుత్ కేంద్రాలు, వంతెనలను పేల్చివేస్తామన్న ట్రంప్ హెచ్చరికలను బేఖాతరుచేస్తూ ఇరాన్ ప్రజలు వేలాదిగా ఇళ్లనుంచి బయటకు వచ్చి విద్యుత్,ఇంధన కేంద్రాలవద్ద మానవ హారాలుగా ఏర్పడ్డారు. వందలాదిమంది వంతెనలపైకి కూడా చేరుకుని తమ దేశభక్తిని చాటుకున్నారు. ఇరాన్ జాతీయ జెండాలను చేతపట్టుకుని కొందరు, అతిపెద్ద జాతీయ పతాకంతో విద్యుత్, ఇంధన కేంద్రాలవద్ద వేలాదిగా ప్రజలు మానవహారంగా ఏర్పడి రక్షణకవచంగా నిలిచి ఉన్న విడియోలు వైరల్ అయ్యాయి. ఈ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్న అమెరికా ఇజ్రాయెల్‌లు మాత్రం తమ దాడులు ఆపడంలేదు. ఇజ్రాయెల్ ఇప్పటికి ఇరాన్‌పై దాడులుచేస్తూనే ఉంది. అలాగే ఇరాన్ చమురు కేంద్రంగా భావిస్తు్న ఖర్గ్ దీవిపై మరోసారి అమెరికా దాడులు చేసింది.నావికాదళాలతో ఖర్గ్‌దీవిని స్వాధీనంచేసుకోవాలన్న వ్యూహంతో అమెరికా ముందుకు పోతోంది. ఇరాన్‌కు చెందిన 50 టార్గెట్లపై దాడులుచేసినట్లు చెపుతోంది. ఇజ్రాయెల్‌కూడా ఇరాన్‌రైల్వేలు, కీలక మౌలికవనరుల వ్యవస్థలపై దాడులుచేసినట్లు చెపుతోంది.ప్రత్యేకించి పెట్రోకెమికల్ ప్లాంట్లే లక్ష్యంగా దాడులుచేస్తోంది. ఇరాన్‌కు గడువు ముగిసిన తరుణంలోనే పశ్చిమాసియా సముద్రజలాల్లో ఉంచిన అమెరికా అతిపెద్దనౌక అబ్రహాంలింకన్‌నుంచి యుద్ధవిమానాలు ఇరాన్‌వైపు తరలివెళ్లడం చూస్తుంటే ఇక ఇరాన్‌ను తీవ్రస్థాయిలోనే దెబ్బతీసేందుకు ఇజ్రాయెల్, అమెరికాలు కంకణం కట్టుకున్నట్లు తెలుస్తోంది. ట్రంప్‌తన సోషల్‌మీడియా ట్రూత్‌పోస్టులో 47 ఏళ్లుగా సాగిన నియంతృత్వం, ఏకపక్ష పాలన అంతం కానునన్నదని, 47ఏళ్ల అవినీతి, దోపిడీరాజ్యం అంతం కావడం ఖాయమన్న పోస్టుపై ఇరాన్ కూడా అంతే ధీటుగా స్పందించింది. ఆనాటి మొత్తం నాగరికత ఈరోజు రాత్రితో అంతం అవుతుందని పోస్టులో పేర్కొనడంపై ఇరాన్ ఘాటుంగా స్పందించింది. అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా తనతోపాటు ఇరాన్ ప్రజలు సైతం ప్రాణత్యాగాలకు సిద్ధమేనని, దేశం కోసం తామంతా ఒక్కటిగా ఉన్నట్లు ప్రకటించారు. ఎలాంటి చర్యలకు పాల్పడినా అమెరికా, ఇజ్రాయెల్‌లకు అంతే ధీటుగా స్పందన ఉంటుందని హెచ్చరించారు. ఇదిలా ఉంటే గల్ఫ్‌ఆఫ్ ఓమన్‌లో కీలకంగా ఉన్న ఎర్రసముద్రంలోని బాబ్ అల్‌మండెబ్ జలసంధిని మూసివేస్తామని హౌతీలు హెచ్చరించడంతో ఇపుడు హర్మూజ్‌తోపాటు రెండోజలసంధికూడా మూతపడుతుండటంతోప్రపంచ దేశాలకు చమురురవాణాలో తీవ్ర ఆటంకాలు ఎదురవుతాయన్న ఆందోళన మొదలయింది.

మరోవైపు హర్మూజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌కు తీవ్రస్థాయిలో నాశనం తప్పదని ట్రంప్ చేసిన హెచ్చరికలను కూడా ఇరాన్ ఖాతరుచేయలేదు. శతృదేశాలుమినహా ఇతర దేశాలన్నింటికీ ప్రస్తుతం హర్మూజ్‌నుంచి నౌకలు వెళుతున్నాయని గుర్తుచేసింది. తెరిచే ఉన్న హర్మూజ్‌పై ఎందుకింత ట్రంప్‌నకు ఆరాటం కేవలం తమ చమురుకేంద్రాలు స్వాధీనంకోసమేనని,యురేనియం నిల్వలు అక్రమంగా స్వాధీనంచేసుకోడానికేనని ప్రత్యారోపణలుచేసింది. అలాగే ఇరాన్‌సైతం గల్ఫ్‌దేశాలపై తన దాడులను ఎక్కడా ఆపిన దాఖలాలులేవు.మంగళవారం కూడా ఎయిర్‌పోర్టులు, చమురుశుద్ధికేంద్రాలు, గ్యాస్ రిఫైనరీలపై దాడులుచేసినట్లు ప్రకటించింది. అలాగే అమెరికాతో కొనసాగించతలపెట్టిన అన్ని చర్చలను, సంప్రదింపుల నిర్ణయాలనుకూడా ఉపసంహరించుకుంటున్నట్లుప్రకటించిన ఇరాన్ తనవంతు రక్షణకవచాల ఏర్పాటులో తలమునకలయింది. 48గంటలపాటు రైళ్లలోప్రయాణించవద్దంటూ ఇజ్రాయెల్‌చేసిన హెచ్చరికలను బట్టి ఇక రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టులే లక్ష్యంగా దాడులుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడి అయింది.

## ఏసిటిఒ, డిటిఒలకు గెజిటెడ్ హోదా

### 20 యేళ్ల నిరీక్షణకు తెర

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** వాణిజ్య పన్నులశాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్స్(ఏసీటీవోలు), జీఎస్టీ విభాగంలోని డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్లకు రాష్ట్ర ప్రభుత్వం గెజిటెడ్ హోదా కల్పించింది. ఈ మేరకు దీనికి సంబంధిం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 20 ఏండ్ల ఉద్యోగుల నిరీక్షణకు తెరపడింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న మొత్తం 537 మంది ఏసీటీవోలు గెజిటెడ్ అధికారులుగా గుర్తింపు పొందారు.

ఈ గెజిటెడ్ హోదా కోసం 2017 ఫిబ్రవరి నుండి అధికారులు నిరంతర పోరాటం కొనసాగిస్తున్నారు. రెండు పీఆర్‌సీలు, ఆర్థిక శాఖ, ఉన్నతాధికారుల స్థాయిలో అనేక చర్చలు జరగడంతో ఎట్టకేలకు ఈ నిర్ణయం సాధ్యమైందని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తెలిపారు. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాల్లో సంబరాలు చెలరేగాయి. ఉద్యోగులు టపాకాయలు కాల్చుతూ, స్వీట్లు పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ద్వారా ఏసీటీవోల సేవలకు మరింత గౌరవం లభించడంతో పాటు, శాఖలో ఉన్నత స్థాయి బాధ్యతలు నిర్వర్తించడానికి మార్గం సుగమమవుతుందని ఉద్యోగులు అభిప్రాయపడ్డారు.

## మొయినాబాద్ నిందితుల మూడో దఫా

### కస్టడీపై తీర్పు నేటికి వాయిదా

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్‌లోని రోహిత్ రెడ్డి ఫాం హౌస్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో అరెస్టయిన ముగ్గురు నిందితుల మూడవ దఫా కస్టడీ పిటిషన్‌పై రాజేంద్రనగర్ కోర్టు తీర్పును బుధవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో అరెస్టయిన రోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ రియల్టర్ నమిత్ శర్మలు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు డిస్మిస్ చేసింది.

మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో ముగ్గురు నిందితులను మూడవసారి ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని చేవెళ్ల పోలీసులు కోరడం తెలిసిందే. అయితే డిఫెన్స్ న్యాయవాది దీనిని వ్యతిరేకించి తన క్లయింట్లకు వెంటనే బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించడం విదితమే. దీనిపై సోమవారమే వాదనలు ముగియగా మంగళవారం తీర్పు వెలువడాల్సి వుంది. అయితే మంగళవారం సాయంత్రం నిందితుల కస్టడీ పిటిషన్‌పై తీర్పును బుధవారానికి వాయిదా వేసిన కోర్టు ఇదే సమయంలో నిందితుల తరపున దాఖలైన బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ ముగ్గురు మూడు వారాలుగా చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్నారు. ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో ముగ్గురు నిందితులను రెండు దఫాలు మూడేసి రోజుల పాటు పోలీసు విచారించడం తెలిసిందే. రెండు దఫాల విచారణలో ముగ్గురు పెద్దగా సమాచారం వెల్లడించక పోవడంతో మూడదఫా కస్టడీ విచారణకు పోలీసులు కోర్టును ఆశ్రయించారు.

## బిఆర్ఎస్‌లో కరివేపాకు హారీశ్‌రావు

### రైతులు రెచ్చగొట్టే ప్రయత్నం తగదు: ప్రభుత్వ విప్ విజయరమణారావు

**హైదరాబాద్,ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌లో హరీష్‌రావు పాత్ర కేవలం కరివేపాకు లాంటిదనికెటిఆర్ రాష్ట్రంలో లేనప్పుడు ఎక్కువ ఫెర్ఫార్మెన్స్ చూపించాలని హరీష్ రావు తెగ ఆరాటపడుతున్నాడనీ ప్రభుత్వ విప్ విజయరమణారావు ఎద్దేవా చేశారు. మంగళవారం సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ పార్టీని బాగా నడుపుతున్నానని చూపించడానికి రోజుకో డ్రామా తయారు చేస్తున్నాడని విమర్శించారు. కెటిఆర్ కంటే తానే బాగా పనిచేస్తానని పార్టీ కేడర్ కు చూపించడానికి హరీష్ రావు తాపత్రయపడుతున్నాడని ఎకసెక్కాలు చేశారు. "హరీష్ రావు నువ్వెంత ఫెర్ఫార్మెన్స్ చూపించినా ఉపయోగం లేదు. బిఆర్ఎస్ లో నువ్వు పూజకు పనికి రాని పువ్వు,కూరలో కరివేపాకు లాంటోడివి నిన్ను వాడుకుని వదిలేస్తారు తప్ప ప్రయోజనం లేదని హరీష్‌రావుకు హితవు చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలు రాకుండా హరీష్ రావు అండ్ కంపెనీ కుట్రలు చేస్తోందనీ ఆయన ఆరోపించారు. గత పదేళ్లలో పరిశ్రమల కోసం అనేక చోట్ల కెసిఆర్ ప్రభుత్వం కూడా భూసేకరణ చేపట్టిందని గుర్తుచేశారు. పరిశ్రమలు వస్తే స్థానికులు ఉపాధి , ఉద్యోగ అవకాశాలు వస్తాయని మా ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని అన్నారు. భూసేకరణలో 70 శాతానికి పైగా ప్రభుత్వ భూమే ఉంటుందనీ వివరించారు. భూములు కోల్పోతున్న రైతులకు మంచి పరిహారంతో పాటు ఉద్యోగం కూడా కల్పిస్తున్నామనీ తెలిపారు. హరీష్ రావు కు ఈ విషయాలు తెలుసు అయినా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడని ఆవేదన చెందారు.

## పవన్‌ఖేడా కోసం తెలంగాణలో అసోం పోలీసుల గాలింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ సతీమణి రిణికి భూయాన్‌పై తీవ్రమైన ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అధికా ర ప్రతినిధి పవన్ ఖేడా కోసం ఆ రాష్ట్ర పోలీసులు ఢిల్లీ సహా తెలంగాణలో గాలిస్తున్నారు. ఢిల్లీకి చెందిన ఖేడా సోమవారం నాడు రిణికి భూయాన్ పై తీవ్రంగా ఆరోపణలు చేయడం తెలిసిందే. ఆమెకు మూడు పాస్‌పోర్టులు వున్నాయని, కోట్లాది రూపాయల అక్రమాస్తులు సంపాదించారని ఖేడా ఆరోపించారు. దీనిపై రిణికి భూయాన్ అస్సాం పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు వెంటనే ఖేడాపై కేసు నమోదు చేసి ఆయన కోసం ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో లేకపోవడంతో తెలంగాణకు వచ్చారు. హైదరాబాద్‌లో ఆయన వున్నట్లు అందిన సమాచారం మేరకు అస్సాం పోలీసులు నగరంలో పలుచోట్ల గాలించినా ప్రయోజనం కలగలేదు. అయితే ఖేడా కోసం అస్సాం పోలీసులు హైదరాబాద్‌కు వచ్చిన విషయ మై ఇక్కడి పోలీసులు ఏమీ మాట్లాడడం లేదు.




## వలస కార్మికుల కోసం ఐదు కిలోల సిలిండర్ల జారీలో సడలింపులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** వలస కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోల వంటగ్యాస్ సిలిండర్లలోసడలింపులు తెచ్చింది. వలస కార్మికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పెట్రోలియం మంత్రిత్వ శాఖ 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కోరింది. పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ అన్ని రాష్ట్రాలకు లేఖ రాశారు. ఓఎంసీల సాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని నీరజ్ సూచించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ప్రపంచ దేశాల్లో గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హార్మూజ్ జలసంధి గుండా ఇరాన్ కొన్ని దేశాలను మాత్రమే అనుమతిస్తుండటంతో మిగతా దేశాలు అవస్థలు పడుతున్నాయి. భారత చమురు నౌకలను ఇరాన్ వదిలిపెడుతున్నప్పటికీ మునుపటి స్థాయిలో దేశంలో గ్యాస్ సరఫరా జరగడంలేదు. ఫలితంగా రెగ్యులర్ సిలిండర్ పొందడానికి కావాల్సిన నిబంధనలను ఇప్పుడు కచ్చితంగా అమలు చేస్తున్నారు. అయితే 5 కేజీల చోటు సిలిండర్‌కు మాత్రం కేవలం ఐడీ ప్రూఫ్ చూపిస్తే సరిపోతుంది. ఒకప్పుడు వలస కార్మికులను దృష్టిలో పెట్టుకునే ఈ సిలిండర్‌లను తీసుకొచ్చారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్‌ను తొందరగా పొందడం కష్టంగా మారింది. అందుకే కేంద్ర సర్కారు వలసకార్మికుల సౌలభ్యం కోసం 5 కేజీల సిలిండర్‌ల సరఫరాను రెట్టింపు చేసింది.

## ఆహార కల్తీపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం

### కాకా హోటల్ మొదలు బడా రెస్టారెంట్ వరకు ఆకస్మిక తనిఖీలతో విరుచుకుపడుతున్న అధికారులు

### ఆహార కల్తీని గుర్తించే చిట్కాలపై అవగాహనతో ఉండాలని ప్రజలకు పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** తెలంగాణలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉరుము లేని పిడుగులా విరుచుకుపడుతున్నారు. బడా రెస్టారెంట్లు మొదలుకొని వీధి పక్కన బండ్ల వరకు దేన్నీ వదలడం లేదు. అయితే తనిఖీల్లో చోటా కాకా హోటల్ మొదలు ఫైవ్‌స్టార్ హోటళ్లు,రెస్టారెంట్ల కిచెన్లలో అడుగుపెడితే కళ్లు బయర్లు కమ్మే వాస్తవాలు, అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. నెలల తరబడి నిల్వ ఉంచిన మాంసం, రంగులు కలిపిన పదార్థాలు, అపరిశుభ్ర వాతావరణం దర్శనమిస్తోంది. ఈ నేపథ్యంలో కాసులకు కక్కుర్తి పడి ప్రజల ఆరోగ్యాన్ని తుంగలో తొక్కేస్తున్న కల్తీ రాయుళ్లపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. గతంలో మాదిరిగా కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా కల్తీకి పాల్పడి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపే కార్యచరణకు అధికారులు పదును పెడుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం పోలీసు శాఖ నేతృత్వంలో ఎఫ్‌ఫాస్ట్ విభాగాన్ని, ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో ప్రత్యేక తనిఖీల బృంధాన్ని రంగంలోకి దించింది. రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఈ తనిఖీ బృంధాలు ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో ఇక నుంచి ప్రతి చోట హైజీన్ రేటింగ్‌ను ప్రదర్శించడం తప్పనిసరి చేసింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఎప్పటికప్పుడు అలెర్ట్ చేస్తూ కల్తీ రాయుళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది ప్రభుత్వం. అయితే ఏది కల్తీ ఆహారమో, ఏది నాణ్యతతో కూడిన ఆహారమో తెలుసుకునే విషయంలో సామాన్యుడు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇంట్లోనే చిన్న చిన్న పరీక్షలతో కల్తీ ఆహారాన్ని ఈజీగా పసిగట్టవచ్చని చెబుతున్నారు. కల్తీ పాలను గుర్తించేందుకు చుక్క పాలను నిలువుగా ఉన్న ప్లేట్ పై వేయాలని, అది తెల్లటి గీతను వదిలితే స్వచ్ఛమైనదని, నీళ్లలా పారితే కల్తీ జరిగినట్లే అర్థమని గుర్తు చేస్తున్నారు. ఇకఒక గ్లాసు నీటిలో చెంచా కారం వేయాలని, రంగు నీటిలోకి త్వరగా దిగినా, ఇసుకలాంటి పదార్థం అడుగున చేరినా అది కల్తీ కారమని గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో మెరిసిపోతున్న పండ్లను చూసి మోసపోవద్దని కాల్షియం కార్బైడ్ వాడితే పండ్లు పసుపు పచ్చగా ఉన్నా, లోపల రుచి ఉండదని, ఈ నేపథ్యంలో కల్తీ పండ్లను గుర్తించేందుకు ఒక జగ్గులో నీటిని నింపి అందులో పండ్లను వేయాలని, రసాయనాలతో పండించిన పండ్లు లోపల గాలితో నిండి ఉండి, నీటిపై తేలుతాయని చెబుతున్నారు. అంతా కల్తీ మయమైన పరిస్థితుల్లో ప్రభుత్వం తన వంతుగా తనిఖీలు చేస్తున్నా వినియోగ దారులు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు, ఆహార నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## మానవత్వానికే ఆమె 'హెడ్' కానిస్టేబుల్..


హెడ్‌కానిస్టేబుల్ రేవతి

### 9 మంది పోలీసు అధికారులకు మరణశిక్ష వేయించింది ఆమె వాంగ్మూలమే

### సాతంకుళం తండ్రి, కొడుకు లాకప్‌డెత్ కేసులో ఆమె సాక్ష్యమే కీలకం

### పోలీసుల కాకమ్మ కథలకు తెరవేసిన సాహసి

### డ్యూటీలోని బ్యూటీకి అద్దంపట్టిన లేడీ పోలీస్‌గా ప్రశంసలు

**చెన్నై, ఏప్రిల్ 7:** తను ఉద్యోగంచేస్తున్న సొంతశాఖను, సాటి ఉద్యోగుల భవితవ్యాన్ని, ఉన్నతోద్యోగుల హుంకారాలను కూడా లెక్కచేయకుండా తనలోని మానవత్వాన్ని నిద్రలేపింది. చెప్పాలంటే తెగించి నిర్భయంగా సాక్ష్యం చెప్పి 9 మంది రాక్షసులను ఉరికంబమెక్కిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రేవతి సాహసాన్ని గురించి వింటే ఆమెను అభినందించకుండా ఉండలేం.

తమిళనాడులో సాతానుకుళంలో కొవిడ్‌లో లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించారన్న మిషతో ఓ తండ్రికొడుకులను లాకప్‌లో నిర్బంధించి హింసించగా వారుచనిపోయారు. అందుకు ప్రత్యక్ష సాక్షి అదే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఆ తండ్రీ కొడుకులను హింసించడం కళ్లారాచూసింది. నిస్సహాయురాలై నిలబడింది. సాతంకుళం లాకప్‌డెత్‌కేసులో మదురై కోర్టు ఇచ్చిన సంచలన తీర్పునకు ఆమె వాంగ్మూలమే కీలకంగా మారింది. ఆ తండ్రీకొడుకులను లాకప్‌లో చిత్రహింసలు పెట్టి చంపిన కేసులో 9 మంది పోలీస్ అదికారులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పుచెప్పింది. ఈ లాకప్ మరణాలకు సాధారణంగా ప్రత్యక్ష సాక్షులుండరు. ఒకవేళ ఉన్నా వారు సాక్ష్యం చెప్పేందుకు బయటకు రాలేరు. ఇలాంటిపరిస్థితిలో ధైర్యం తెచ్చుకుని ఆనాడు పోలీస్ స్టేషన్‌లోజరిగింది, జరుగుతున్నది, పోలీసులు సాక్ష్యాలను తారుమారుచేసేప్రయత్నాలను లాకప్‌లో రక్తపు మరకలను తుడిచిన తీరును మేజిస్ట్రేట్‌కి వివరించి చెప్పింది. ఇదేఈ కేసులో అతికీలకమైన వాంగ్మూలంగా దోహదపడింది. ఈ ఘటన జరిగిన వెంటనే పోలీసులు సాక్ష్యాలనుతుడిచేసి కాకమ్మ కథలు చెపిచూసినా వారి పథకం పారలేదు. సాక్ష్యాలన మార్చేసారు. కేవలం డ్యూటీ మాత్రమేచేయాలని కాకుండా తన కళ్లముందు జరిగిన దారుణానికి స్పందించాలని ఆమె హృదయం పరితపించింది. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని రేవతి నిర్ణయించుకోవడం విశేషం. ఆమె తెగువ ఇపుడు న్యాయాన్ని నిలబెట్టిందని అంతా మనసులోనే పొగుడుతున్నారు. ఆమెమేజిస్ట్రేట్‌ముందు చెప్పిన ప్రతి విషయం కేసు దిశను అమాంతం మార్చేసింది. రేవతి కేవలం ఒక స్టేట్‌మెంట్‌కే పరిమితం కాలేదు. ఆరాత్రి జరిగిన వాస్తవాన్ని కళ్లకు కట్టినట్లు చెప్పి సాక్ష్యాలు మార్చడానికి పోలీసులు పడిన అవస్థలనుప్రత్యక్షంగాచూపింది. పోలీసులు స్టేషన్‌నుశుభ్రంచేసి సాక్ష్యాలను తుడిచివేసినా ఆమె అత్యంత చాకచక్యంగా గోడల మూలల్లో టేబుళ్లకింద మిగిలిపోయిన రక్తపు మరకలను గుర్తించి మేజిస్ట్రేట్‌కు చూపించింది. ఈ రక్తపు చుక్కలేనిందితుల నేరాన్ని శాస్త్రీయంగా నిరూపించడంలోప్రధాన భూమిక పోషించాయనిచెప్పాలి. సిసిటివి ఫుటేజిని మాయం చేసినా ఆమె జ్ఞాపకశక్తినుంచి అవేమీ మాయం కాకపోవడం చెప్పుకోదగిన అంశం. ఆమె అసాధారణ నిర్ణయమే నిందితులకు శిక్షపడేలాచేసింది. సాధారణ విషయం పోలీసుగా విధులునిర్వర్తిస్తూ పోలీసులకే వ్యతిరేకంగా శిక్షపడేలాచేసింది

## అడుగంటుతున్న జలాశయాలు

### డెడ్‌స్టోరేజీ లెవల్‌కు నీటి మట్టం

### కొద్ది రోజులుగా భారీగా పెరిగిన సాగు, తాగునీటి వినియోగం

### శ్రీశైలంలో 43 టిఎంసిలే మిగులు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా రబీ పంట కాలం చివరిదశలో ఉన్నందున జలాశయాల్లో నీటి మట్టం డెడ్ స్టోరేజీ స్థాయికి చేరువవుతుండటం రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. ఇప్పటికే కొన్ని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో చివరి దశలో ఉన్న యాసంగి పంటలకు సాగు నీటి సరఫరా కొనసాగుతుందా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఇప్పటివరకు ప్రాజెక్టుల్లో ఉన్న నిల్వల వినియోగం అధికంగా ఉండటంతో 20 రోజులుగా నీటి మట్టం వేగంగా పడిపోతోంది. వేసవి ఎండలు తీవ్రమైన నేపథ్యంలో సాగు, తాగునీటి అవసరాలు పెరగడంతో జలాశయాల్లోని నీటి నిల్వలపై ఒత్తిడి మరింత ఎక్కువవుతోంది. కొన్ని ప్రాజెక్టుల్లో కనిష్ట స్థాయికి నీరు చేరుకోవడంతో డెడ్ స్టోరేజి పరిస్థితి నెలకొందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో అంతరాష్ట్ర జల వినియోగంపై వివాదాలు ముదురుతూ ఏపీ నీటి విని యోగంపైనా ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. గత ఏడాది మాదిరిగా ఈ సారి కూడా వానాకాలం ఆలస్యమైనా లేదా తక్కువ వర్షపాతం నమోదైతే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందన్న హెచ్చరికలను నీటిపారుదల నిపుణులు చేస్తున్నారు.

రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. కీలక ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రధాన ప్రాజెక్టుల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నది. శ్రీశైలం ప్రాజెక్టులో 215.81 టిఎంసిల సామర్థ్యానికిగాను ప్రస్తుతం కేవలం 43.75 టిఎంసిలు, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 312.05 టిఎంసిల సామర్థ్యానికి కేవలం 176.06 టిఎంసిలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 80.50 టిఎంసిల సామర్థ్యానికి కేవలం 28.85 టిఎంసిలు, నిజాంసాగర్‌లో 17.80 టిఎంసిల సామర్థ్యానికి 9.54 టిఎంసిలు, సింగూర్లో 29.91 టిఎంసిల సామర్థ్యానికి 7.46 టిఎంసిలు, జూరాల ప్రాజెక్టులో 9.66 టిఎంసిల సామర్థ్యానికి కేవలం 4.71 టిఎంసిలు నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. పరిస్థితి ఇలానే కొనసాగితే రాష్ట్రంలో సాగు, తాగు నీటికి తీవ్ర సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని నీటిపారుదల నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణ కూతురుగా చెబుతున్నా! ఎల్డీఎఫ్‌కు ఓటు వేయండి

### 6 గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

### కేరళ ప్రజలకు విజ్ఞప్తి.. కల్వకుంట్ల కవిత వీడియో విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 7:** ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని విశ్వసించవద్దని, పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కూటమిని గెలిపించాలంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేరళ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె ఒక వీడియోను విడుదల చేశారు. 'జై తెలంగాణ, జై కేరళ' అంటూ ప్రారంభించారు. 'తెలంగాణ కూతురిగా కేరళ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను' అంటూ వీడియోను విడుదల చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళలో కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేశారని, ఇచ్చిన హామీలు అమలు చేశామని నమ్మించే ప్రయత్నం చేశారని అన్నారు. ఎన్నికల సమయంలో వారు ఆరు గ్యారెంటీలు ఇచ్చారని, కానీ కేవలం సగం గ్యారెంటీ ఉచిత బస్సు ను మాత్రమే అమలు చేశారని పేర్కొన్నారు. తాను తెలంగాణ బిడ్డనని, త్వరలో రాజకీయ పార్టీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో కేరళ ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. ఆడపడుచులకు నెలకు రూ.2,500, యువతకు ఉద్యోగాలు, రైతులకు బోనస్, పెన్షన్ పెంపు వంటి హామీలు ఇచ్చి కూడా వాటిని అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారిందని ఆరోపించారు. అవినీతి ద్వారా తెలంగాణ నుంచి వచ్చిన సొమ్మును కాంగ్రెస్ కేరళలో ఖర్చు చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎల్డీఎఫ్‌కు ఓటు వేయాలని కోరారు.

## రూ.200 కోట్లు కోల్పోయిన గిరిజనం

### పర్యవేక్షణ లేక గాడితప్పిన సంక్షేమ శాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** గిరిజన సంక్షేమ శాఖలో పాలన గాడితప్పింది. ఈ శాఖలో నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యాలు దెబ్బతింటున్నాయనే విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. అంతేకాకుండా, నిధులు కూడా వృధా అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం దాదాపు రూ.200 కోట్ల భారీ మొత్తాన్ని కోల్పోయింది. రాష్ట్రంలోని 1.3 లక్షల మంది గిరిజన విద్యార్థులకు 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన పెండింగ్ ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వును జారీ చేసింది. ఈ పథకంలో భాగంగా కేంద్రం తన వాటాను 75 శాతం చొప్పున రూ.205.84 కోట్లను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తన మిగిలిన 25 శాతం వాటా రూ.68.61 కోట్లను విడుదల చేయడంలో విఫలమైంది. నిధులను వాస్తవంగా విడుదల చేయాల్సి ఉండగా, కేవలం ఉత్తర్వును మాత్రమే జారీ చేసి చేతులు దులుపుకొందనే ఆరోపణలు ఉన్నాయి.

## తమిళనాడులో తెలంగాణ సిఎం, డిప్యూటీ సిఎం స్టార్ క్యాంపెయినర్లు

### ఎన్నికల కమిషన్ సెక్రటరీకి ముకుల్‌వాస్నిక్ లేఖ

### 12 నియోజకవర్గాలకు సీనియర్ పరిశీలకుడిగా ఉత్తమ్‌నియామకం

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో స్టార్ కంపెయినర్లుగా తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నాయకులను నియమిస్తూ భారత ఎన్నికల కమిషన్ సెక్రటరీకి ఎఐసిసి జనరల్ సెక్రటరీ ముకుల్‌వాస్నిక్ లేఖ అందజేశారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, కెసివేణుగోపాల్, ప్రియాంక గాంధీలతోపాటు 40 మందిని తమిళనాడు లో స్టార్ కంపెయినర్లుగా ఎంపిక చేసి జట్టును కాంగ్రెస్ రూపొందించింది. తమిళనాడు ఎన్నికలు ఈ నెల 23న జరగనున్నాయి. తెలంగాణ నుంచిస్టార్ కంపెయినర్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల పేర్లను ఎన్నికల కమీషన్‌కు అందజేసింది. అలాగే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తమిళనాడుపై అదనపు బాధ్యతలు ఎఐసిసి ఇచ్చింది. తమిళనాడు లో కాంగ్రెస్ పోటీ చేస్తున్న 28 అసెంబ్లీ నియోజక వర్గాలలో పోటీ చేస్తోంది. 12 అసెంబ్లీ నియోజక వర్గాలకు సీనియర్ అబ్జర్వర్‌గా ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నియమించినది. తమిళనాడులో కాంగ్రెస్ డిఎంకెతో కలిసి పొత్తుతో పోటీ చేస్తున్నది.

## హైకోర్టులో రేవంత్‌రెడ్డి పిటిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 7:** హైకోర్టులో రేవంత్‌రెడ్డి వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలప్పుడు తనపై నమోదైన కేసులు కొట్టివేయాలని ఈ పిటిషన్లలో హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారనే ఫిర్యాదుతో రేవంత్ రెడ్డిపై ఈసీ ఆదేశాల మేరకు పోలీసులు 4 కేసులు నమోదు చేశారు. నేరేడుచర్ల, మట్టంపల్లి, పాలకీడు, హుజూర్‌నగర్ పీఎస్‌లలో ఈ కేసులు నమోద య్యాయి. ప్రజా ప్రతినిధుల కోర్టులో ఈ కేసుల విచారణ సాగుతోంది. ఈ కేసులు కొట్టి వేయాలని ఆయన పిటిషన్లు వేశారు. వీటిపై స్పందించిన ఉన్నత న్యాయస్థానం పోలీసులు, ఫిర్యాదు చేసిన ఎన్నికల అధికారులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

## టిజి సెట్-2026 ఫేజ్-1 ఫలితాలు విడుదల

### 6 నుంచి 9 తరగతి ఖాళీ సీట్ల ఫలితాలు రిలీజ్

### 6242 సీట్లకి ఎంపికైన జాబితా విడుదల

### ఈ నెల 20లోపు స్కూళ్లలో చేరాలి

### ఫలితాలు విడుదల చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ గురు కులాల్లోని 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం నిర్వహించిన టీజీ సెట్-2026 ఫలితాలను మంగళవారం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విడుదల చేశారు. రెండు గురుకులాల్లో కలిపి 6242 సీట్లకి ఎంపికైన విద్యార్థుల ఫలితాలను ప్రకటించారు. ఫలితాల విడుదలలో ఎస్సీ గురుకుల సొసైటీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి సీతా లక్ష్మీ, జాయింట్ సెక్రటరీలు బానోతు గీతా నాయక్, సక్రు నాయక్ పాల్గొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 20లోపుగా ఆయా గురుకులాల్లో చేరాలని సూచించారు. టీజీ సెట్-2026లో భాగంగా 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఫలితాలను మార్చి 24న ప్రకటించిన విషయం తెలిసిందే. 2026-27 విద్యా సంవత్సరానికి 6 నుండి 9 తరగతుల వరకు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీతో పాటు ఎస్టీ గురుకులంలోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పరిగి (బాలికలు), ఖమ్మం (బాలురు)లో 8వ తరగతి ప్రవేశాలకు సంబంధించిన ఫలితాలను విడుదల చేశారు. ఫిబ్రవరి 22న రాష్ట్రవ్యాప్తంగా 492 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 1,02,960 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫేజ్1లో 6,242 సీట్ల భర్తీకి సంబంధించిన ఫలితాలను విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 7 నుండి 20 వరకు తమకు కేటాయించిన పాఠశాలల్లో ధృవపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరుకావాలని మంత్రి అడ్లురి సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థుల అడ్మిషన్ ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళిత, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

కార్పొరేట్ స్థాయి విద్య, డిజిటల్ క్లాస్‌రూమ్స్, పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమతుల్య ఆహారం, రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు, క్రీడా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీసేలా మెంటరింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తును బలపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఎస్సీ గురుకులాల్లో ఖాళీ సీట్లకు సంబంధించి 6వ తరగతిలో 1949, 7వ తరగతిలో 1003, 8వ తరగతిలో 634 సీట్లు, 9వ తరగతిలో 1058 సీట్లు కలిపి 4644 సీట్లు ఉన్నాయి. ఎస్టీ గురుకులాల్లో 6వ తరగతిలో 621 సీట్లు, 7వ తరగతిలో 225, 8వ తరగతిలో 393 సీట్లు, 9వ తరగతిలో 373 సీట్లతో కలిసి 1612 సీట్లు అందుబాటులో ఉన్నాయి. తరగతుల వారిగా మొత్తం రెండు సొసైటీలలో 6వ తరగతిలో 2570, 7వ తరగతిలో 1228, 8వ తరగతిలో 393, 9వ తరగతిలో 373 కలిపి 6256 సీట్లు ఉండగా.. దరఖాస్తులు తరగతుల వారీగా 6వ తరగతిలో 48,552, 7వ తరగతిలో 20,936,8వ తరగతిలో 20,294, 9వ తరగతిలో 13,178 దరఖాస్తులు కలిపి 1,02,960 దరఖాస్తులు వచ్చాయి.

## తక్షణమే సాగునీరు విడుదల చేయండి

### సిఎస్‌కు మానవహక్కుల కమిషన్ ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** పంటలకు సాగునీరు విడుదల చేయకపోవడంపై తెలంగాణ మానవహక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. తక్షణమే సాగునీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సిఎస్‌కు తెలంగాణ మానవ హక్కుల కమిషన్, గౌరవ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ మధ్యంతర ఉత్తర్వులు జారి చేశారు. కేసు వివరాల్లోకి వెళితే... సంగారెడ్డి జిల్లాలోని ఘనపూర్ అనికట్ట కింద సుమారు 20,000 ఎకరాల్లో సాగుచేసిన వరి పంట కోత దశలో ఉంది. సాగు నీటి కొరత వల్ల పంట నష్టపోయే ప్రమాదం నెలకొంది. అధికారులు సాగునీటి విడుదలలో రిక్తహస్తం చూపుతుండడంతో రైతులు మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన కమిషన్ ఈ పరిస్థితి రైతుల జీవనోపాధి, గౌరవప్రద జీవనంతోపాటు ఆహార హక్కులకు (భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద) భంగం కలిగిస్తుందని కమిషన్ అభిప్రాయపడింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993లోని సెక్షన్ 18 ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తక్షణం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, సింగూర్ ప్రాజెక్టు నుండి వనదుర్గ ప్రాజెక్టు (ఘనపూర్ అనికట్ట)కు 0.30 టిఎంసిల నీటిని 12 రోజులపాటు విడుదల చేయాలని ఆదేశించింది. ఈ విషయంలో తీసుకున్న చర్యల నివేదికను ఈ నెల30 లోపు కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించింది.

వార్త

జీవితంలో ఏదీ వ్యసనంగా పరిణమించకూడదు. అదే జీవితానికి ప్రధాన సూత్రం.

- జార్జి మూల్

# అసుర చర్యకు అసలు దండన

శాంతి భద్రతలు కాపాడాల్సిన వారు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అతిగా వ్యవహరిస్తే ఏమవుతుందో తెలిస్తే మరో చోట ఇలాంటి సంఘటనలు పునరావృతం కావు. దేశ న్యాయ చరిత్రలోనే లాకప్‌డెత్‌లో ఎంతో మంది పోలీసులకు మూకుమ్మడి మరణ శిక్ష విధించిన ఉదంతం వినగానే సభ్య సమాజం నివ్వెరపోతోంది. తమిళనాడులోని తండ్రీ కుమారుల లాకప్‌డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఆ తండ్రీ కొడుకులకు ఎలాంటి నేరచరిత్ర లేదు. 'కోవిడ్' రోజుల్లో లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ సమయం తమ షాపునుతెరచి ఉంచడమే వారి నేరం. అతి స్వల్పకారణంతో తండ్రీకొడుకుల అంతిమ యాత్రకు ఏర్పాటు చేసిన పోలీసులు శిక్షార్హులే. పోలీసుల్లో అసుర మనస్తత్వం గూడుకట్టుకున్న సందర్భాల్లో పేట్రేగిపోయి 'లాకప్‌డెత్'లకు కారకులవుతారు. అందుకే దేశంలో 'లాకప్ డెత్'లు కొత్తేమీ కావు. కానీ శిక్షలు పడిన ఉదంతాలు బహు అరుదు. అలాంటి కేసుల్లో చివరాఖరికి వచ్చే తీర్పుల్లో పోలీసులకు శిక్ష పడిందంటే కేసు ప్రక్రియను నడిపించడంలో న్యాయవ్యవస్థ ప్రశంసనీయ వైఖరిని అభినందించాల్సిందే. ఈ కేసులో అదేశాఖలో పనిచేస్తూ, ఉన్నతాధికారుల ఒత్తిడిలు తట్టుకొని కూడా ఆ రోజు జరిగిందేమిటో పూస గుచ్చినట్లు వివరించిన కానిస్టేబుల్ రేవతిని అభినందించాలి. నాలుగుగోడల మధ్య అదీ పోలీసు స్టేషన్ లాకప్‌గదిలో హింసకు గురయినప్పుడే ఇలాంటి లాకప్ మరణాలు సంభవిస్తాయి. అక్కడ జరిగిన ఆకృత్యాలకు సాక్షులెవరూ ఉండరు. ఇలాంటి కేసుల్లో జనమే ఎదురు తిరిగినప్పుడు మాత్రమే అవి కేసుల వరకువెళ్తాయి. దేశంలో లాకప్‌డెత్‌లు జరిగిన సందర్భాల్లో సంబంధిత పోలీసు స్టేషన్‌లో తమంత తాముగా సుమోటో కేసులు పెట్టే పరిస్థితి ఉండదు. ఒకవేళ బయటి వారో ఆత్మీయులో ప్రాథమిక సమాచార నివేదిక ఇచ్చినా దానిని కేసు కట్టడంలో పోలీసుల్నించి ఎంత ప్రతిఘటన ఎదురౌతుందో సాక్ష్యాలను సేకరించడంలోనూ, సాక్ష్యలను సమీకరించడంలో పోలీసుల వైపు నుండి ఎలాంటి సహాయమూ లభించదు. అందుచేత 'లాకప్‌డెత్' కేసుల్లో నిరూపణ దుస్సాధ్యమవుతుంది. ఈ కేసులో హైకోర్టు పోలీసు స్టేషన్‌ను స్వాధీనపరచుకుని విచారణ ప్రారంభించినా సిబ్బంది సహకరించలేదు. వారు బెదిరించారని జడ్జి పేర్కొన్నారు. 'దోషులకు జీవిత ఖైదు భయాన్ని కల్పించదు. వారికి మరణశిక్షే సరైన శిక్ష'యని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారంటే పోలీసులు ఆ తండ్రీకొడుకులపై ఎంత అమానవీయంగా వ్యవహరించారో తెలుస్తుంది. 2020 జూన్ 19న తుత్తుకుడి జిల్లా సాతానుకుళం పోలీసులు షాపు నిర్వాహకులు తండ్రికుమారుడిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి వారిని తీవ్రంగా కొట్టి హింసించారు. ఈకేసులో 10మంది పోలీసులపై కేసు నమోదు చేసి అప్పటికప్పుడే క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకున్నారు. స్టేషన్ లాకప్ గదిలో ఉన్న షాపు యజమానులైన తండ్రి జయరాజ్, కుమారుడు బెన్నిక్స్‌లను జూన్ 22-23వరకునిరంతరం పదేపదే చేసిన దాడివల్లే 'అసాధారణ గాయాలయ్యాయి. పైగా వారిద్దరూ తమకు తామే గాయపరచుకుని తమపై నిందారోపణలు చేస్తున్నారని పోలీసులు కోర్టులో వాదించడం హాస్యాస్పదంగా ఉంది. ఈ కేసులో సుదీర్ఘమైన దర్యాప్తులు కొనసాగడానికి కారణం కేవలం ప్రజాందోళనయే. ఈకేసు బయటికి రాకుండా పోలీసుల యంత్రాంగం చేసిన ప్రయత్నాలు ఇన్నీఅన్నీ కావు. తొలుత వీరిద్దరూ మరణించడానికి కారణం పోలీసులు దారుణంగా హింసించడమేనని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అప్పట్లో ఈ కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తొలుత మద్రాసు హైకోర్టు మధురై బెంచి సుమోటోగా విచారణ చేపట్టి ఆ ఇద్దరి మరణానికి పోలీసు అధికారుల దాష్టీకమే కారణమని,పోలీసులు చేసిన ఘాతుకానికి తగిన ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. నిందిత పోలీసులు ఈ కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలను మాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నందున దర్యాప్తులో సాక్ష్యాలు తారుమారు కాకుండా ఉండేందుకు పారదర్శక దర్యాప్తు, విచారణ కోసం హైకోర్టు సిఐడికి అప్పగించగా జనంలో చులకన కాకుండా ఉండేందుకు ఆ రాష్ట్రప్రభుత్వం సిఐడి నుంచి సిబిఐకి అప్పగించింది. హత్య, అక్రమ నిర్బంధం, తప్పుడు సాక్ష్యాల సృష్టి, నేరానికి ప్రేరేపించడం వంటి అభియోగాలపై సిబిఐదర్యాప్తులో స్టేషన్ హౌస్ ఆఫీసర్, శ్రీధర్ ఆదేశాలపై పోలీసులు ఇలాంటి దురాగాతాలకు పాల్పడిందని తేలింది. నిందితులుపైగా ఎవరిలోనూ ఏకోశానా అయ్యో! పాపం అనిగానీ, చచ్చిపోతాడేమోనన్న భయంకాని వారిలో ఏర్పడకపోవడం సభ్యసమాజం విస్తుపోతోంది. ఆ రోజు రాత్రి 8గంటల నుంచి తెల్లవారుజామున 3గంటల వరకు తండ్రీకుమారుడిని కర్రలు, ఇనుపరాడ్లతోచిత్రహింసలకు గురిచేశారని విచారణలో నిరూపితమైంది. వారిపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేయడమే కాకుండా ఫోర్జరీ పత్రాలను సృష్టించారు. లాకప్‌డెత్ కేసుల్లో ఇంత మంది పోలీసులు ఇద్దరు వ్యక్తుల చావుకు కారణమవడమే ఒక రికార్డు. వారిలో ఏ ఒక్కరికి మానవత్వం లేకపోవడం దురదృష్టకరం. ఒకవేళ తమ ఇన్‌స్పెక్టర్ ఇలాంటి దురాగతానికి ప్రేరేపించినా ఆపై అధికారులకు తెలియ చేసి వారిమరణానికి దారితీసే చిత్రహింసలను ఆపిఉండ వచ్చునని, అలాకాకుండా ఈ నేరంలో భాగస్వామ్యమైనట్లు భావించి ఈ అరుదైన కేసులో వారంతా శిక్షార్హులేనని కోర్టు విశ్వసించింది. కాస్త ఆలస్యమైనా నేర నిర్ధారణతో మదురై బెంచి వెలువరించిన తీర్పు దేశవ్యాప్త ఉన్న పోలీసు లోకానికే గుణపాఠం కాగలదు.

ఎప్పుడూ ఒకరికి ఇవ్వడం నేర్చుకో అంతేకాని తీసుకోవడం కాదు. అలాగే ఒకరికి సేవ చేయడం నేర్చుకో అంతేకాని ఒకరిపైన పెత్తనం చేయడం కాదు.



రామకృష్ణ పరమహంస

ఏ విషయమైనా కొత్తగా ఉన్నప్పుడే బాగుంటుంది. కాని స్నేహం మాత్రం పాతబడిన కొద్దీ బాగుంటుంది.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య

# రాజకీయ పీటముడిలో 'డీజీపీ' పదవులు!

***నీతి నిజాయతీగా, ముక్కు సూటిగా పయనిస్తూ, నియమ నిబంధనలను కఠినంగా అమలు చేసే ఐపీఎస్ అధికారులను రాష్ట్ర పోలీస్ చీఫ్(డీజీపీ) ఎంపిక దరిదాపులోకి రాకుండా చేస్తున్నారు. ఆ పదవి కోసం కొందరు ఐపీఎస్‌లు విధులు చేపట్టే ముందు చేసిన ప్రమాణాలన్నిటిని మూట కట్టి మూలకు పడేసి, ఖాకీ దుస్తుల విలువలను నేల రాసి ఖద్దర్లకు జీ హుజూర్ అంటూ వంగి వంగి దండాలు పెడుతూ వారి పంచన చేరుతున్నారు. గత కొన్నేళ్లుగా విడిపోకముందు ఉమ్మడి తెలుగు రాష్ట్రం, ఆ తరువాత విడిపోయిన తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా, ఇతర రాష్ట్రాలలో జరుగుతున్న తంతు ఇదే.***



ఎం.నారాయణ స్వామి

ఏ పార్టీ చూసినా ఏమున్నది గర్వ కారణం, రాష్ట్ర డిజిపి నియామకంలో చెప్పిన పనులు తూచా తప్పకుండా చేసే సీనియర్ లేదా జూనియర్ ఐపీఎస్ అధికారిని డీజీపీగా నియమించి రాష్ట్ర పోలీస్ యంత్రాంగం పగ్గాలు అప్పగిస్తున్నారు. నీతి నిజాయతీగా, ముక్కు సూటిగా పయనిస్తూ, నియమ నిబంధనలను కఠినంగా అమలు చేసే ఐపీఎస్ అధికారులను రాష్ట్ర పోలీస్ చీఫ్ (డీజీపీ)ఎంపిక దరిదాపులోకి రాకుండా చేస్తున్నారు. ఆపదవి కోసం కొందరు ఐపీఎస్‌లు విధులు చేపట్టే ముందు చేసిన ప్రమాణాలన్నిటిని మూటకట్టి మూలకు పడేసి, ఖాకీ దుస్తుల విలువలను నేలరాసి ఖద్దర్లకు జీ హుజూర్ అంటూ వంగి వంగి దండాలు పెడుతూ వారి పంచన చేరుతున్నారు. గత కొన్నేళ్లుగా విడిపోకముందు ఉమ్మడి తెలుగు రాష్ట్రం, ఆ తరువాత విడిపోయిన తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా, ఇతర రాష్ట్రాలలో జరుగుతున్న తంతు ఇదే. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న జూనియర్ ఐపీఎస్ అధికారులను అందలం ఎక్కించడానికి సీనియర్ ఐపీఎస్ అధికారులను పక్కనబెట్టి చిన్నచూపు చూస్తున్నారు. డీజీపీ రేసులో ఉన్న ఐపీఎస్ అధికారులు రాష్ట్ర పోలీస్ యంత్రాంగం చీఫ్ పదవి దక్కించుకోవడానికి రాష్ట్ర, కేంద్రంలోని ముఖ్యమైన ప్రజా ప్రతినిధులు, నాయకులు ద్వారా పెద్ద ఎత్తున పైరవీలు చేయిస్తున్నారనే అపప్రధ ఉండనే ఉంది. న్యాయంగాతమకే డిజిపి పదవి దక్కాలి అని సీనియర్ ఐపీఎస్‌లు పేర్కొంటుంటే, మాకు డిజిపి హోదా ఇచ్చారు మేము కూడా ఆ పదవికి అర్హత సంపాదించాం కావున మాకే ఇవ్వాలంటూ జూనియర్ ఐపీఎస్‌లు వాదనలకు దిగుతున్నారు. యూపీఎస్సీ ఎంపిక చేసి పంపిన డీజీపీల పేర్ల జాబితాలో నుంచి ఆయా ప్రభుత్వాలు నియమించే డీజీపీ రెండేళ్లపాటు సర్వీసులో ఉండి పూర్తి స్థాయి బాధ్యతలను నిర్వహిస్తారు. ఒక వేళ యూపీఎస్సీ ద్వారా కాకుండా ప్రభుత్వాలు స్వయంగా నియమించే డీజీపీలను టెంపరరీ డీజీపీలుగా పరిగణించకుండా వారిని అదనపు బాధ్యతలు చేపట్టే డీజీపీలుగా పెర్కొనాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటి నుంచి రాష్ట్రాల ప్రభుత్వాలు తూచా తప్పకుండా పాటిస్తున్నాయి. జూనియర్ ఐపీఎస్‌ను డీజీపీగా నియమిస్తే వెంటనే సీనియర్ ఐపీఎస్‌లు తమకు అన్యాయం జరిగిదంటూ కోర్టులను ఆశ్రయించిన సందర్భాలున్నాయి. యూపీఎస్సీ ఎంపిక చేసి పంపిన ముగ్గురు ఐపీఎస్ ల జాబితాలో నుంచి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వారికీ సంబంధించిన ఐపీఎస్‌ను పూర్తిస్థాయి డీజీపీగా నియమించుకొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్(2014) తెలుగు దేశం అధికారంలోకి రాగానే అప్పుడు యూపీఎస్సీ ఎంపిక చేసిన జాబితాలో నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జె.వి.రాముడికి డీజీపీ పగ్గాలను అప్పగించారు. రాముడు పదవీ విరమణ చేసిన తరువాత డిజిపిలుగా నియమించిన నంద్యాల సాంబశివరావు, ఎం.మాలకొండయ్య, ఆర్.పీ. ఠాకూర్ డిజిపిలు గా అదనపు బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేసారు. అప్పట్లో యూపీఎస్సీ ఎంపిక వ్యవహారం గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఆ తరువాత (2019) అధికారం లోకి వైసీపీ హయాంలో రాష్ట్ర పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయి డీజీపీగా యూపీఎస్సీ జాబితాలో నుంచి ముఖ్య మంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి గౌతమ్ సవాంగ్ పేరును ఖరారు చేశారు. ఆ తరువాత చోటు చేసు



కొన్న తీవ్ర పరిణామాల రీత్యా రెండున్నర సంవత్సరాల సర్వీస్ తర్వాత గౌతం సవాంగ్‌ను ఆకస్మికంగాతప్పించారు. ఆ తరువాత కే.సీ. రాజేంద్రనాథ్ రెడ్డిని డీజీపీగా నియమించి అదనపు బాధ్యతలను అప్పగించారు. పదకొండు మంది సీనియర్లను కాదని రాజేంద్రనాథ్ రెడ్డిని నియమించడం గమనార్హం. అప్పుడు పూర్తి స్థాయి డీజీపీ ఎంపిక కోసం యూపీఎస్సీ దృష్టికి తీసుకెళ్ల లేదు. 2024 ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి స్థానంలో హరీష్ కుమార్ గుప్తాకు (మే2024జూన్ 2024 వరకు) డీజీపీ పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. అప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూటమి (టీడీపీ, బీజేపీ, జనసేన) అధికారంలోకి వచ్చింది. ఎన్నికల కోడ్‌ను తొలగించిన తరువాత కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సి.హెచ్.ద్వారకా తిరుమలరావుకు డీజేపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. తిరుమలరావు పదవీ విరమణ చేయగానే యూపీఎస్సీ పంపిన జాబితాలలో నుంచి హరీష్ కుమార్ గుప్తా పేరును ఎంపిక చేసి పూర్తి స్థాయి డీజీపీగా నియమించారు. 1992 బ్యాచుకు చెందిన గుప్తా రెండేళ్లు(2027 జులై నెలవరకు) డీజీపీగా కొనసాగుతారు. తెలంగాణా రాష్ట్రంఏర్పడి 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో టిఆర్ఎస్(ఇప్పుడు బిఆర్ఎస్) అధికారంలోకి రాగానే ప్రభుత్వానికి, పార్టీకి అండగా ఉండే అనురాగ్ శర్మను తొలిసారిగా పూర్తి స్థాయి డీజీపీగా నియమించింది. యూపీఎస్సీ జాబితాలో శర్మ పేరు ఉండటం,ముఖ్యమంత్రి కే.సి.ఆర్ ఆ పేర్లను ఖరారు చేశారు. అనురాగ్ శర్మ పదవీ విరమణ చేయగానే, యూపీఎస్సీ పంపిన జాబితాలోని మహేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి ఒకే చేశారు. మహేందర్ రెడ్డి పదవీ విరమణ తరువాత అంజనీ కుమార్‌ను డీజీపీగా నియమిస్తూ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన అసెంబ్లీ ఎన్నికల వరకు ఆ పదవిలో ఉన్నారు. అప్పుడు యూపీఎస్సీ ఎంపిక వ్యవహారం గురించే పట్టించు కోలేదు. 2023 డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర డీజేపీగా రవి గుప్తాను నియమించి, అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రధాన ఇంటలిజెన్స్ చీఫ్‌గా తిరిగి శివధర్ రెడ్డిని నియమించింది. డీజీపీ రవిగుప్తాను బదిలీ చేసి ఆయన స్థానంలో డీజీపీగా జితేంద్రను నియమించి అదనపు బాధ్యతలను అప్పగించారు. జితేంద్ర పదవీ విరమణతో 2025 సెప్టెంబర్ నెలలో బి. శివధర్ రెడ్డిని డీజీపీగా నియమించి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆయనను డీజీపీగా నియమించడంపై కొంత మంది సీనియర్లు వారి అనుయాయులకు చెప్పి కోర్టులో నియామకం చెల్లదని కేసు వేయించారు. కోర్టు కేసు పూర్వపరాలను పరిశీలించిన తరువాత డీజీపీ నియామకాన్ని కొనసాగిస్తూ, యూపీఎస్సీ ద్వారా పూర్తి స్థాయి డీజీపీ నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చెయ్యాలని, సుప్రీం కోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం యూపీఎస్సీకి లిస్ట్ పంపడం అక్కడనుంచి కొన్ని లోపాలున్నాయి అంటూతిరిగి పంపడం, మళ్ళీ లోపాలు సరిచేసి ప్రభుత్వం పంపడం, తిరిగి యూపీఎస్సీ కొన్ని తప్పులున్నాయి సరి చేసి పంపమని ఆదేశించారు. పలుమార్లు ఈ తతంగం జరిగిన తరువాత ఆ జాబితా అక్కడ్నించి కదల్లేదు. తాజాగా గత మార్చి నెలలో తెలంగాణా ప్రభుత్వం డీజీపీ పోస్టుకు ప్రతిపాదిత పేర్లతో ఉన్న లిస్ట్‌ను యూపీఎస్సీకి పంపారు. ఈసారి ఎంపిక జాబితాలో ముగ్గురు పేర్లను యూపీఎస్సీ ఎంపిక చేసింది. ఏప్రిల్ 30వ తేదీన బి.శివధర్ రెడ్డి పదవీ విరమణ చేస్తున్నారు. యూపీఎస్సీ ఎంపిక చేసి పంపిన డీజీపీ జాబితాలో 1991 బ్యాచ్‌కు చెందిన సి.వి.ఆనంద్ 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్య మిశ్రా ఉన్నారు వీరిలో వినాయక్ ప్రభాకర్ కేంద్రంలోడెప్యూటేషన్‌పై ఉన్నారు. ఆయన డీజీపీ పదవి పట్ల విముఖంగా ఉన్నారని చెప్పుకొంటున్నారు. రేసులో ఆనంద్, సౌమ్య మిశ్రా ఉన్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణా రాష్ట్ర డీజీపీగా ఎవరిని నియమిస్తారో వేచి చూడాలి. •

(రచయిత : సీనియర్ జర్నలిస్ట్)

# పొలాల్లో 'విషం'తో పెరుగుతున్న ముప్పు

తిప్పర్తి శ్రీనివాస్

దేశంలో వ్యవసాయం కోట్లాది ప్రజల జీవనాధారంగా కొనసాగుతోంది. పంటల దిగుబడిని పెంచేందుకు రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులు, కలుపు నాశినిలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. అయితే ఈ రసాయనాల అధిక వినియోగం ఇప్పుడు ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ఒక పెద్ద సవాలుగా మారుతోంది. ముఖ్యంగా 'పారాక్వాట్' వంటి అత్యంత విషపూరిత కలుపు నాశినిపై మళ్లీ దేశవ్యాప్తంగా చర్చ తీవ్రతరమైంది. పారాక్వాట్ అనేది వేగంగా పనిచేసే కలుపు నాశిని. కానీ దీని విషపూరిత అత్యంత ప్రమాదకరమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇది మనిషి శరీరంలోకి తక్కువ మోతాదులోనైనా ప్రవేశిస్తే ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు వంటి ముఖ్య అవయవాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ముఖ్యంగా దీనికి సమర్థవంతమైన విరుగుడు ఇప్పటికీఅందుబాటులో లేకపోవడం మరింత ఆందోళనకరం. పారాక్వాట్ విషప్రయోగం జరిగిన తర్వాత రోగిని రక్షించడం చాలా క్లిష్టమని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఇటీవలి సంవత్సరాల్లో వ్యవసాయ రసాయనాల వల్ల విషప్రయోగ కేసులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, పెరుగుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఆత్మహత్యా యత్నాల్లో కూడా పారాక్వాట్ వినియోగం ఒక కీలక సమస్యగా మారింది. సులభంగా లభ్యత ఉండటం వల్ల ఇదిప్రమాదాన్ని మరింత పెంచుతోంది. ఈ నేపథ్యంలో వైద్య సంస్థలైన ఇండియన్ మెడికల్ అసోసియేషన్, డాక్టర్స్ అసోసియేషన్ ఫర్ పబ్లిక్‌పాలసీ, హెల్త్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని పారాక్వాట్‌పై దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని పునరుద్ఘాటిస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ఇది అత్యవసర చర్యగావారు పేర్కొంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా పారాక్వాట్‌పై కఠిన నియంత్రణలు అమల్లో ఉన్నాయి. యూరోపియన్ యూనియన్ దేశాలు,చైనా, బ్రెజిల్ వంటి దేశాలు ఇప్పటికే దీనిని నిషేధించాయి లేదా గణనీయంగా పరిమితం



చేశాయి. ఈ నిర్ణయాలు మానవ ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలపై కఠిన వైఖరి అవసరాన్ని సూచిస్తున్నాయి. భారతదేశంలో పరిస్థితి మాత్రం ఇంకా భిన్నంగా ఉంది. కొన్ని నియంత్రణలు ఉన్నప్పటికీ, పారాక్వాట్ వినియోగం పూర్తిగా నిలిచిపో లేదు. అయితే ఇటీవల కొన్ని రాష్ట్రాలు, ముఖ్యంగా తెలంగాణ, దీని వినియోగాన్ని నిషేధించే దిశగా చర్యలు తీసుకోవడం గమనార్హం. ఇది ప్రజారోగ్య పరిరక్షణలో ఒక ముందడుగుగా భావించవచ్చు. అయితే ఒకే రాష్ట్రం నిషేధం విధించడం సరిపోదు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా సరఫరా జరిగే అవకాశముంది. అందువల్ల దేశవ్యాప్తంగా సమగ్ర విధానం అవసరం. కేంద్ర ప్రభు త్వం శాస్త్రీయ ఆధారాలతో, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఒకస్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. ఇక రైతుల కోణంలో చూస్తే, పారాక్వాట్‌కు ప్రత్యామ్నాయాలు లేవని కొందరు వాదిస్తున్నారు. కానీ వ్యవసాయ నిపుణులు సురక్షితమైన ఇతర కలుపునాశికాలు, యాంత్రిక పద్ధతులు, సహజ వ్యవసాయ పద్ధతులు ఉపయోగించడం ద్వారామంచి ఫలితాలు సాధ్యమని సూచిస్తున్నారు. ఈదిశగా రైతులకుశిక్షణ, అవగాహన, సబ్సిడీలు అందించడం అత్యవసరం. మరో ముఖ్య అంశం రైతుల భద్రత. రసాయనాల వినియోగంలో వ్యక్తి గత రక్షణ పరికరాలు వినియోగం చాలా తక్కువగా ఉంది. చర్మం, శ్వాస ద్వారా రసాయనాలు శరీరంలోకి ప్రవేశించిదీర్ఘకాలిక ఆరోగ్యసమస్యలకు దారితీస్తున్నాయి. కాబట్టి భద్రతా ప్రమాణాల ను కచ్చితంగా అమలు చేయడంకూడా ప్రభుత్వ బాధ్యత. ఇక భవిష్యత్తు దృష్టిలో చూస్తే, వ్యవసాయం కేవలం దిగుబడుల పెంపుపైనే కాకుండా, ఆరోగ్యకరమైన ఆహారం, పర్యావరణ సంరక్షణపై కూడా దృష్టి పెట్టాలి. సుస్థిర వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం వంటి విధానాలు మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. మొత్తానికి, వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే అది మానవ ఆరోగ్యాన్ని కాపాడే విధంగా ఉండాలి. ప్రాణాలకు ముప్పుగా మారే పారాక్వాట్ వంటి రసాయనాలపై దేశవ్యాప్తంగా కఠిన నియంత్రణలు లేదా పూర్తి నిషేధం విధించడం సమయోచిత నిర్ణయం అవుతుంది. అదే సమయంలో రైతులకు సురక్షిత ప్రత్యామ్నాయాలు అందించడం ద్వారా సమతుల్యతను సాధించాలి. •

# ప్రజావాక్కు



## విద్యా సంస్కరణలు

ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యా రంగంలో సాంకేతికతను అంతర్భాగం చేయడంఅనివార్యమైన కాలానుగుణ అవసరం. విద్యార్థులనుభావివృత్తినైపుణ్యాల దిశగా సిద్ధం చేయడానికి తెలంగాణ ప్రభుత్వంచేపడుతున్న విద్యా సంస్కరణలు విశేషంగాగమనించదగ్గవి. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక మౌలికసదుపాయాలను కల్పించడం, డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేయడం ద్వారా నవ సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కొత్తదిశను చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు, దత్తాంశ శాస్త్రం, డిజిటల్ అక్షరాస్యత వంటిరంగాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. ఈమార్పులకు అనుగుణంగా మన విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దడం అత్యంత ప్రాధాన్యత కలిగినఅంశం. పాఠ్యాంశాలను ఆధునీకరించడంవల్ల గ్రామీణప్రాంతవిద్యార్థులుకూడా ప్రపంచ స్థాయి పరిజ్ఞానాన్ని పొందే అవకాశం లభిస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## దొందు దొందే

రెండువేల ఇరవై నాలుగు ఎన్నికలు జరగడానికి చాలా ముందునుంచే చంద్రబాబు నాయుడిఆలోచనలో మార్పు వచ్చింది. మోడీతో విడిపోయినందుకు ఆయనను తిట్టిపోసినందుకుతెగబాధపడిపోయారు. మోడీకి దగ్గరయితేనే అధికారం దక్కుతుందని ముఖ్యమంత్రి పదవి వరిస్తుందనిగ్రహించిమళ్లీ ఆయనకు దగ్గరఅయ్యేందుకు ప్రయత్నించారు. తమ మధ్యసంధి కుదర్చడానికి పవన్‌కళ్యాణ్‌ని ఉపయోగించుకున్నారు. ఆయన ద్వారా రాయబారాలు బేరసారాలు జరిపారు. తిట్టిననోరుతోనే మోడీని పొగడటం చేశారు. మొత్తానికిచేసిన ప్రయత్నాలు ఫలించాయి.

- మిథునం, హైదరాబాద్

## అప్పులపాలు కావొద్దు

యువత క్రికెట్‌మోజులో, సినిమాల మోజులో పడి మీకు నచ్చిన హీరో కోసమో, ఆటగాడి కోసమో దగ్గరినుండి చూడాలి అని, మొదటి రోజే సినిమా చూడాలని వందల నుండి వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎవరి కొరకు ఈ ఖర్చు? వాళ్ళు ఏమైనా నీకుఆపదలో ఉన్నప్పుడు అండగా నిలుస్తున్నారా? వాళ్లను చూడడానికి వేల రూపాయలు మనం ఎందుకు ఖర్చుబెట్టాలి అని ఆలోచించాల్సిన అవసరంఉంది. ముందు మన కుటుంబం ఆ తర్వాతే హీరోలు, ఆటగాళ్లు వినోదానికి వెళ్ళి అప్పుల పాలు కావొద్దు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## అవినీతి ప్రచారం

తమ రాజకీయ ప్రత్యర్థులు అవినీతిపరులు, కుంభకోణాలు చేసేవారని 2014నుంచి బిజెపినాయకులు ప్రచారం చేస్తున్నారు. కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. విచారణలతో వేధిస్తున్నారు. చివరకు జైలు పాలు చేసి వారిని మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. ఇప్పటికి ఇలా ఎన్నో రాష్ట్రాలలో జరిగింది. వారి అధికారదాహానికి ముఖ్యమంత్రులు, మంత్రులు బలయ్యారు. పదవులతోపాటు పరువు ప్రతిష్ఠలను పోగొట్టుకున్నారు. ప్రజలు వీరి చర్యలను నిశితంగా గమనించాలి. పదవులు అధికారం కోసం దిగజారి ప్రవర్తిస్తున్న నాయకులకి భవిష్యత్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

## నాడు ప్రాజెక్టులు, నేడు విగ్రహాలు?

నెహ్రూ కాలంలో పెద్ద పెద్ద నీటి ప్రాజెక్టులు, రైల్వేలు, రోడ్లు లాంటి వాటిని ప్రారంభం చేసి జాతికి అంకితం చేస్తున్నాను అనేవారు. 1955లో నాగార్జునసాగర్ డ్యామ్ శంకుస్థాపన సమయంలో పూజలు ,టెంకాయలు ,బ్రాహ్మడు ,ముహూర్తం లేకుండా నెహ్రూ గారు ఒక దీపం వెలిగించి, ఈ ఆధునిక దేవాలయాన్ని జాతికి అంకితం చేస్తున్నాను అన్నాడు. ప్రధాని మోదీ ఆ మధ్య వేల కోట్లరూపాయలు ఖర్చుపెట్టి పటేల్ విగ్రహాన్నీ జాతికి అంకితమన్నారు. అయోధ్య రామ మందిరాన్ని జాతికి అంకితంఅన్నారు. జగ్గీబాబ ఆశ్రమాన్ని రిబ్బన్ కత్తిరించి జాతికి అంకితం అన్నాడు మోదీ గారు. యమునానది ఒడ్డున ఒక గడ్డం బాబా రవిశంకర్ 15 లక్షలమందితో జాతర చేస్తుంటే దానికి మోదీ ప్రారంభం. గుళ్లకు బాబాల ఆశ్రమాలకుమోడీప్రభుత్వం అతిగాప్రాముఖ్యత ఇస్తుంది. చంద్రబాబు కూడా అదేబాటలో నడుస్తున్నాడు. బహుశా అందుకేనేమో మొన్న చంద్రబాబు వెంకటేశ్వరస్వామి గుడి లాంటి గుళ్లను ప్రపంచ వ్యాప్తంగా నిర్మించాలి అన్నారు.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## అంతా ప్రచారం కోసమే

ఎఐ వల్ల రైతుల సమస్యలు తీరుతాయా? యువత భవిష్యత్తు బావుంటుందా! వారికి ఉద్యోగఅవకాశాలు పెరుగుతాయా? నిత్యావసర ధరలు తగ్గుతాయా? గ్రామాల్లో నివసించే జనాలకి ఈ ఎఐ ఏ విధంగా ఉపయోగపడుతుంది. బిజెపి వాళ్ల ఏం చేసినా ప్రచారం కోసం అందరి చేతా పొగిడించుకోవటం కోసం పార్టీ ప్రయోజనాల కోసం చేసే పనులే ఎక్కువగా ఉంటాయి. ఈమధ్య న్యూఢిల్లీలో నిర్వహించిన ఎ.ఐ సమిట్ కూడా అలాంటిదే.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పారదర్శకతలోపిస్తున్న 'తాత్కాలిక' కేటాయింపులు

మేకల క్రిష్ణ

మన దేశంలో సంస్కృతి, సాంప్రదాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఆ పరంపరలో గోదావరి పుష్కరాలకు కూడా ఆధ్యాత్మికంగా ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి పన్నెండు ఏళ్లకు ఒకసారి జరిగే ఈ పుష్కరాల్లో లక్షలాది భక్తులు నదీతీరాలకు తరలివచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. నదీ స్నానం ద్వారా పాపపరిహారం కలుగుతుందని ప్రజల విశ్వాసం. ఈ నేపథ్యంలో పుష్కరాలు కేవలం పండుగ మాత్రమే కాదు, భక్తి, విశ్వాసం, ప్రజల సామూహిక భావోద్వేగాలకు సమ్మేళనం. అయితే, ఈ ఆధ్యాత్మిక వైభవం వెనుక ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చు, నిధుల వినియోగం తీవ్రచర్చకు దారితీస్తోంది. 2027 జూన్‌లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ పుణ్య స్నానాలకు తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బాసర నుంచి భద్రాచలం వరకు పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించి, మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని సబ్ కమిటీకి నివేదిక పంపాలని టెక్నికల్ ఇంజినీర్ల బృందాన్ని సిఎం ఆదేశించారు. ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ప్రత్యేక పార్కింగ్‌ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత కోసం భారీ పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ, భక్తుల ఆరోగ్య పరంగా తాత్కాలిక ఆసుపత్రులు, మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ సేవలు 24గంటలు అందుబాటులో ఉండటంతో పాటు ఇంకా అనేక చర్యలు చేపడుతోంది. అయితే, ఈ ఏర్పాట్లకు భారీగా నిధులు కేటాయిస్తున్న నేపథ్యంలో వాటి వినియోగంలో పారదర్శకత ప్రశ్నార్థకంగా మారుతోంది. గోదావరి పుష్కరాలను సాధారణంగా ప్రతి 12 ఏళ్లకు ఒక సారి నిర్వహిస్తారు. గురుగ్రహం సింహరాశిలో ప్రవేశించిన రోజున ప్రారంభమై, 12 రోజులపాటు ప్రధాన ఘట్టంగా కొనసాగుతుంది. (తదుపరి రోజులు కూడా పుణ్యకాలంగా పరిగణిస్తారు). గత అనుభవాలను ఆధారంగా తీసుకుంటే, మొత్తం పుష్కరాల కాలంలో సుమారు 10-12 లక్షల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. ఈ పుష్కరాల నిర్వహణ కోసం దాదాపు రూ.3 వేల నుంచి 5వేల కోట్ల వరకు ఖర్చు అవుతున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. ఇందులో ఎక్కువ భాగం తాత్కాలిక వసతులపైనే వెచ్చించడం జరుగుతోంది. ఈ పుష్కరాలు ముగిసిన తర్వాత అనేక నిర్మాణాలు ఉపయోగంలో లేకుండాపోతున్నాయి. తాత్కాలిక అవసరాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న తలెత్తుతోంది.



మరోవైపు రాష్ట్రాల్లోని విద్యా, ఆరోగ్య రంగాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గురుకుల పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడం, విద్యార్థులకు తగిన పౌష్టికాహారం అందకపోవడం, హాస్టల్లో సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆరోగ్య పరంగా చూస్తే, పోషకాహార లోపం పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అంశం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది కొరత, మందుల లభ్యత లేమి సమస్యలు పేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇక్కడ అసలు సమస్య పుష్కరాలు కాదు. ప్రాధాన్యతల లోపం. తాత్కాలిక వసతుల కోసం వేలకోట్లు ఖర్చు చేస్తూ, ప్రజల ప్రాథమిక అవసరాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం పాలనలో అసమతుల్యతను సూచిస్తుంది. పుష్కరాలు నిర్వహించడం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఆ ఖర్చులు ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉండాలి. సమాజంలో అంత్యంత కీలక రంగాలను పక్కనబెట్టి పుష్కరాల పేరుతో భారీగా ఖర్చు చేయడం చర్చనీయాంశంగా మారింది. పుష్కరాల కోసం రోడ్లు, ఘాట్లు, సౌకర్యాలు ఏర్పాటు చేయడం అవసరమే. కానీ అదే పేరుతో అవినీతి, నిధుల దుర్వినియోగం జరిగితే అది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. కాంట్రాక్టులు ఇవ్వడంలో పారదర్శకత, పనులు నాణ్యత లేకుండా చేయడం వంటి సమస్యలు తరచూ వినిపిస్తున్నాయి. ఇక్కడ ప్రధానంగా ప్రశ్నించాల్సిన విషయం ప్రజల ప్రాధాన్యత ఏమిటి? పేద పిల్లలకు విద్య ఇవ్వడం ముఖ్యమా?లేదా తాత్కాలిక పనుల కోసం కోట్ల రూపాయలు ఖర్చుచేయడమా? ప్రజల ఆరోగ్యా న్ని కాపాడడం ముఖ్యమా?లేదా రాజకీయ దర్పం కోసం భారీ ప్రాజెక్టులు చేయడమా?. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలి. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలి. గురుకులాల అభివృద్ధి, పౌష్టికాహారం సరఫరా, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం వంటి అంశాలు అత్యవసరం. ఈ రంగాల్లో పెట్టుబడులు పెడితేనే సమాజం నిజంగా అభివృద్ధి చెందుతుంది. ఇక ప్రజల పాత్ర కూడా కీలకమే. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ఒక హక్కు. నిధుల వినియోగంపై పార దర్శకత కోరాలి. అవినీతి జరిగితే నిరసన వ్యక్తం చేయాలి. సామాజిక బాధ్యతతో ప్రతి పౌరుడు వ్యవహరించాలి. మొత్తంగా చూస్తే, పుష్కరాలు ఒక ఆధ్యాత్మిక వేడుకగా కొనసాగాలి. కానీ వాటిపేరుతో నిధుల దుర్వినియోగం జరగకూడదు. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చకుండా, తాత్కాలిక అవసరాలపై భారీ ఖర్చులు చేయడం సరైన నిర్ణయం కాదు. ప్రభుత్వాలు ప్రాధాన్యతలను సరిగా నిర్ణయించాలి. విద్య, ఆరోగ్యం, ఆహారం వంటి మౌలిక అంశాలపై దృష్టి పెట్టాలి. అప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజల కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల జీవితాన్ని మెరుగుపరచాలి. అదే నిజమైన పాలన, ప్రజాపాలన. •


## చంద్రుని ఆవలివైపు
# ఏం ఉంది?

ఆర్టెమిస్ వ్యోమనౌకలో 40నిమిషాలు బ్లాకౌట్

స్పేస్‌క్రాఫ్ట్‌ను కమ్మేసిన చీకట్లు

జాబిల్లికి సమీపం నుంచి సూర్యగ్రహణ దర్శనం

తిరిగి భూమివైపు ప్రయాణం ఆరంభించిన ఆర్టెమిస్



**న్యూయార్క్, ఏప్రిల్ 7:** ఆర్టెమిస్2 మిషన్‌లో భాగమైన ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడి ఆవలి వైపు నుంచి ప్రయాణించింది. ఆ సమయంలో సుమారు 40 నిమిషాల పాటు ఆ స్పేస్‌క్రాఫ్ట్‌లో బ్లాకౌట్ అయ్యింది. అమెరికా కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 6.44 నిమిషాలకు ఆ బ్లాకౌట్ ప్రారంభమైంది. నాసా ప్రకారం మళ్లీ రాత్రి 7.25 నిమిషాలకు బ్లాకౌట్ ముగిసింది. ఆ సమయంలో స్పేస్‌క్రాఫ్ట్‌ను చిమ్మచీకట్లు కమ్మేశాయి. చంద్రుడి ఆవల చీకటి వైపు ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్ ఉన్న సమయంలో వ్యోమగాములు అనేక పరీక్షలు నిర్వహించారు. మిషన్ కంట్రోల్‌తో లింకు లేకున్నా వ్యోమగాములు మాత్రం శాస్త్రీయ పరిశోధనలు చేపట్టారు. చంద్రుడికి మరో వైపు ఉన్న సమయంలో.. ఆస్ట్రోనాట్స్ ఒంటరి అయిపోయారు. వారితో ఎటువంటి కొవ్యూనికేషన్ జరగలేదు. భూమికి, స్పేస్‌క్రాఫ్ట్‌కు మధ్య చంద్రుడు ఉండడం వల్ల సిగ్నల్ అందదు. దీనితో బ్లాకౌట్ జరుగుతుంది. అయితే ఆ సమయంలో చంద్రుడి చీకటి ప్రదేశాన్ని ఆస్ట్రోనాట్స్ స్టడీ చేసినట్లు తెలుస్తోంది. ఆ టైంలోనే అపోలో 13 రికార్డును ఆర్టెమిస్ వ్యోమగాములు బ్రేక్ చేశారు. అపోలో 13 కన్నా సుమారు 4 వేల మైళ్లు అధిక దూరం ఆర్టెమిస్ వ్యోమగాములు ప్రయాణించారు. ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఉన్న వ్యోమగాములు.. సూర్య గ్రహణాన్ని వీక్షించారు. అద్భుతమైన ఆ క్షణాలను వ్యోమగాములు ప్రత్యక్షంగా అనుభవించారు. చంద్రుడికి అతి సమీపం నుంచి సూర్య గ్రహణాన్ని మనుషులు వీక్షించడం చరిత్రలో ఇదే మొదటిసారి అవుతుంది. చంద్రుడు భ్రమణ సమయంలో ఆర్టెమిస్ సిబ్బంది అనూహ్యమైన సూర్యాస్తమయాన్ని వీక్షిస్తారు. ఆ సమయంలో సోలార్ కరోనా ఏర్పడనుతుంది. ఇదే సమయంలో ఆర్టెమిస్‌లో ఉన్న వ్యోమగాములు అంతరిక్షంలో ఉన్న అనేక గ్రహాలను ఫోటో తీశారు. భూమి, మెర్క్యూరీ, వీనస్, మార్స్, శని గ్రహాలను వ్యోమగాములు ఫోటో తీశారు. కేవలం ఆస్ట్రోనాట్స్ మాత్రమే వీక్షించగల గ్రహణాన్ని ప్రత్యేక కెమెరాలతో ఫోటోలు తీశారు. ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్ జర్నీ సమయంలో అనేక శాస్త్రీయ పరిశోధనలు కూడా చేపట్టారు. తమ ప్రయాణంలో ఓ అరుదైన సంపూర్ణ సూర్య గ్రహణాన్ని వీక్షించినట్లు ఆస్ట్రోనాట్స్ చెప్పారు. కాని దీన్ని వర్ణించడం అంత సులువైన అంశంకాదన్నారు. సుమారు ఏడు గంటల పాటు చంద్రుడి ఉపరితలాన్ని వ్యోమగాములు అబ్జర్వ్ చేశారు. కొత్తగా రెండు అగాధాలను గుర్తించినట్లు తెలుస్తోంది. వాటికి పేర్లు కూడా పెట్టారు. గతంలో వెళ్లిన స్పేస్‌క్రాఫ్ట్ ఇంటిగ్రిటీ పేరును ఓ క్రాటర్‌కు పెట్టారు. రెండో క్రాటర్‌కు కారల్ అని నామకరణం చేశారు. ఆర్టెమిస్ మిషన్ కమాండర్ రీడ్ వైజ్‌మాన్ భార్య ఇటీవల క్యాన్సర్‌తో మృతిచెందింది. అతని భార్య పేరు కారల్. ఆమె పేరును ఓ క్రాటర్‌కు పెట్టారు.

### అసోం, కేరళ, పుదుచ్చేరిలో ముగిసిన ప్రచారం
# మూడు అసెంబ్లీలకు రేపే పోలింగ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** అసోం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. ఏప్రిల్ 9వ తేదీ గురువారం ఆయా రాష్ట్రాల్లో ఒకే విడతలో పోలింగ్ జరుగనుంది. ఆఖరి రోజు అన్ని పార్టీలు ప్రచారాన్ని హోరెత్తించాయి. కేరళలో కాంగ్రెస్, బిజెపి, అధికార ఎల్‌డిఎఫ్ పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శల దాడిని తీవ్రతరం చేశాయి. ఇదే సమయంలో, 2021లో ఇచ్చిన హామీలలో 97 శాతాన్ని నెరవేర్చినట్లు పేర్కొంటూ ఎల్‌డిఎఫ్ ఒక ప్రగతి నివేదికను విడుదల చేసింది. మరోవైపు పుదుచ్చేరిలో, కేంద్ర పాలిత ప్రాంత శాసనసభ పూర్తి స్థాయి రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ 14 సార్లు తీర్మానాలు చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి ఆసక్తి చూపలేదని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ ఆరోపించారు. అసోంలో శాంతి, అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారానికి దూరంగా ఉంచాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం (ఏప్రిల్ 6, 2026) ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అసోంలోని 126 స్థానాలకు, కేరళలోని 140 స్థానాలకు, పుదుచ్చేరిలోని 30 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల సంఘం ఇందుకు సంబంధించి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది.

## సర్‌ఛార్జిలను పెంచిన ఎయిరిండియా

**ముంబయి, ఏప్రిల్ 7:** ప్రపంచవ్యాప్తంగా జెట్ ఇంధన ధరలు పెరిగిన నేపథ్యంలో, దేశీయ అంతర్జాతీయ మార్గాల్లో ఇంధన సర్‌ఛార్జీని సవరిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. దేశీయ మార్గాలకు సంబంధించి, బుధవారం నుంచి ఫ్లాట్ సర్‌ఛార్జీ స్థానంలో దూరం ఆధారిత విధానానికి మారనున్నట్లు ఆ విమానయాన సంస్థ తెలిపింది. దేశీయంగా 500 కిలోమీటర్ల లోపు ప్రయాణాలకు రూ.299 నుంచి 2,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ ప్రయాణాలకు రూ.899 సర్‌ఛార్జ్‌ను సవరిస్తున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ విమాన సర్వీసులకు 24 డాలర్ల నుంచి 280 డాలర్ల వరకు వసూలు చేయనున్నట్లు తెలిపింది. సవరించిన ఛార్జీలు డొమెస్టిక్ ప్రయాణాలకు ఈనెల 8వ తేదీ నుంచి, అంతర్జాతీయ ప్రయాణాలకు 10వ తేదీ నుంచి వసూలు చేస్తామని తెలిపింది. దేశీయ ప్రయాణాలకు 0 నుంచి 500 కిలోమీటర్ల వరకు రూ.299, 501 నుంచి 1000 కిలోమీటర్ల వరకు రూ.399,1001 నుంచి 1500 కిలోమీటర్ల వరకు రూ.549,150 నుంచి 2000 కిలోమీటర్ల వరకు రూ.749, 2000 నుంచి అంతకుమించి కిలోమీటర్లకు రూ.899 వసూలు చేస్తారు. అంతర్జాతీయ ప్రయాణం విషయానికి వస్తే పశ్చిమాసియాకు 50 డాలర్లు, ఆగ్నేయాసియాకు 100 డాలర్లు, సింగపూర్‌కు 60 డాలర్లు, ఆఫ్రికాకు 130 డాలర్లు, యూకేకు 205 డాలర్లు, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా దేశాలకు 280 డాలర్ల చొప్పున ఫ్యూయల్ సర్‌ఛార్జిని వసూలు చేయనున్నట్లు ఎయిరిండియా గ్రూప్ తెలిపింది.

## కిడ్నీ అయినా ఇవ్వు..రూ.30 లక్షలైనా తీసుకురా!

### అత్తింటివారి నుంచి కోడలికి ఎదురైన వేధింపులు



**కాన్పూర్, ఏప్రిల్ 7:** వరకట్న వేధింపులు ఎంతటి దారుణ స్థాయికి చేరాయో తెలియజేసే ఒక అమానుష ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో వెలుగుచూసింది. తన భర్త రెండు కిడ్నీలూ పాడైన విషయాన్ని దాచిపెట్టి పెళ్లి చేశారని, ఇప్పుడు చికిత్స కోసం రూ.30 లక్షలు తీసుకురావాలని లేదా తన కిడ్నీని దానం చేయాలని అత్తింటివారు వేధిస్తున్నారంటూ ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. కాన్పూర్‌కు చెందిన యువతికి, లక్నోకు చెందిన నిశాంత్ కుమార్‌తో 2023 జూన్ 22న వివాహం జరిగింది. పెళ్లి సమయంలో ఆమె కుటుంబం రూ.8 లక్షల నగదు, విలువైన నగలతో పాటు మహీంద్రా థార్ కారును కట్నంగా ఇచ్చింది. పెళ్లయిన తర్వాత భర్త రోజూ పదికి పైగా మాత్రలు వేసుకోవడం గమనించిన ఆమె, అత్తింటివారిని ప్రశ్నించగా రక్తపోటు ఉందని అబద్ధం చెప్పారు. అనుమానం వచ్చిన ఆమె ఇంట్లో వెతకగా భర్తకు సంబంధించిన మెడికల్ ఫైల్ దొరికింది. వ్యసనాల కారణంగా 2022లోనే అతని రెండు కిడ్నీలు పాడయ్యాయని, అప్పటి నుంచి డయాలసిస్‌పై ఉన్నాడని తెలుసుకుని ఆమె షాక్‌కు గురైంది. ఈ విషయాన్ని నిలదీయడంతో ఆమెపై అత్తింటివారి వేధింపులు మొదలయ్యాయి. నీ భర్త బతకాలంటే మీ పుట్టింటి నుంచి రూ.30 లక్షలు తీసుకురా, లేదంటే నీ కిడ్నీని అతడికి దానం చెయ్యి అని ఒత్తిడి చేశారని తెలిపింది. తన భర్తకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయం వారి కుటుంబ సభ్యులకు కూడా తెలుసని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు చాకేరి పోలీసులు నిశాంత్ కుమార్, అతని కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపులు, మోసం, క్రూరత్వం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారి అభిషేక్ పాండే తెలిపారు.



## భారత్ రక్షణ వ్యవస్థలోకి ఆత్మాహుతి డ్రోన్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ఆధునిక యుద్ధ తంత్రంలో డ్రోన్స్ కీలకంగా మారాయి. గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయికి డ్రోన్స్ చేరుకున్నాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ అమ్ములపొదిలోకి మరో అస్త్రం వచ్చి చేరింది. శత్రుమూకలకు వెన్నులో వణుకు పుట్టించే ఆత్మాహుతి డ్రోన్స్‌ను (కామెకాజీ డ్రోన్స్) గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ సంస్థ సైన్యానికి అప్పగించింది. వీటి కోసం రూ.10 కోట్లకు గతంలో ఆర్మీ ఒప్పందం కుదర్చుకోగా తాజాగా వందల సంఖ్యలో ఈ డ్రోన్‌లను ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ డెలివరీ చేసింది. గతేడాది డిసెంబర్‌లోనే ఈ ఒప్పందం కుదరగా అత్యవసర ప్రాతిపదికన నెలల వ్యవధిలోనే కంపెనీ ఈ డ్రోన్స్‌ను సరఫరా చేసింది. మైనస్ 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండే కఠిన వాతావరణంలో కూడా పనిచేసేలా ఈ డ్రోన్స్‌ను డిజైన్ చేశామని సంస్థ వెల్లడించింది. యుద్ధ స్థలంలోని పరిస్థితులను రియల్‌టైమ్‌లో తెలుసుకునేందుకు ఉద్దేశించిన ఫస్ట్ పర్సన్ వ్యూ డ్రోన్స్ తయారీకి కూడా ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ పేరుగాంచింది. నిపుణులు చెప్పే దాని ప్రకారం, ఏఐ ఆధారిత గైడెన్స్ వ్యవస్థ ఉన్న ఈ డ్రోన్స్ 2.5 కిలోల వరకూ పేలుడు పదార్థాలను తీసుకెళ్లగలవు. 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ డ్రోన్స్ 10 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ధ్వంసం చేస్తాయి. సంప్రదాయక దళాలు చేరుకోలేని ప్రాంతాల్లో అత్యధిక రిస్క్ ఉన్న మిషన్స్ కోసం వీటిని వినియోగిస్తారు. శత్రుదేశంలోని లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంగా వేగంగా దాడి చేసేందుకు ఈ డ్రోన్స్‌ను ప్రధానంగా వినియోగిస్తారని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

# మంటల్లో పశ్చిమాసియా

## కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ?



**టెహ్రాన్, ఏప్రిల్ 7:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కోమాలో ఉన్నట్లు సమాచారం. ఆయన ప్రస్తుతం కోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని, ఈ మేరకు అమెరికా-ఇజ్రాయెల్‌కు నిఘా సమాచారం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమాసియా ఘర్షణల వేళ ఇరాన్ నాయకత్వంపై ఈ వార్తలు రావడం సంచలనంగా మారింది. 'ఖమేనీ అపస్మారక స్థితిలో ఉన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నందు వల్ల నిర్ణయాలు కూడా తీసుకోలేని స్థితిలో ఉన్నారు.' అని ఆ కథనాలు పేర్కొన్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన ఆయన ఆచూకీ గురించి వెలుగులోకి రావడం ఇదే తొలిసారి. ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు! ఫిబ్రవరి 28న ప్రారంభమైన దాడుల్లో అప్పటి ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా ఖమేనీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలను కోమ్ నగరంలో చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఇక, యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి మొజ్తాబా బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. కానీ ఆయన పేరు మీద అప్పుడప్పుడు ప్రకటనలు వెలువడుతున్నాయి. ఘర్షణలు ప్రారంభమైన తొలిరోజే ఆయన కూడా గాయపడ్డారు ఈ విషయాన్ని ఇరాన్ కూడా ధ్రువీకరించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఆయన ఇరాన్ దాడుల్ని సమీక్షిస్తున్నట్లుగా ఉన్న ఒక ఎఐ వీడియోను అక్కడి ప్రభుత్వం విడుదల చేయడం గమనార్హం. ఆయనే తమ దేశానికి నాయకత్వం వహిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

## పాకిస్థాన్‌లో 'స్మార్ట్ లాక్‌డౌన్' విధింపు

### చమురు సంక్షోభంతో కీలక నిర్ణయం



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 7:** ఇరాన్ యుద్ధం ప్రభావం పాకిస్థాన్‌పై తీవ్రంగా పడుతోంది. హార్ముజ్ జలసంధి మూసివేయడం, విదేశాల నుంచి చమురు రాకపోవడంతో పాకిస్థాన్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. చమురు కొరత ప్రభావంతో ఇప్పటికే దేశంలో పలు ఆంక్షలు విధించిన పాక్ ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 'స్మార్ట్ లాక్‌డౌడ్' విధిస్తూ పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఆదేశాలు జారీ చేశారు. చమురు కొరతపై రాష్ట్రాల సిఎంలతో సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. చమురు వినియోగాన్ని తగ్గించేందుకు, ఉన్న నిల్వల్ని కాపాడుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాక్ ప్రధాని చెప్పారు. 'స్మార్ట్ లాక్‌డౌడ్'పై స్థానిక రేడియో వెల్లడించిన ప్రకారం.. పాక్‌లోని పంజాబ్, ఖైబర్ పక్తుంఖ్వా, బలూచిస్థాన్, ఇస్లామాబాద్, గిల్గిత్ బల్తిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో పలు ఆంక్షలు విధించారు. మార్కెట్లు, షాపులు, ఇతర వాణిజ్య సముదాయాలన్నీ రాత్రి 8 గంటలకు మూసేయాలి. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మినహాయింపులు ఇచ్చారు. అక్కడ రాత్రి 9 గంటల వరకు అనుమతి ఉంటుంది. జనరల్ స్టోర్స్, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ వంటివి 8 గంటలకే మూసేయాలి. అలాగే, బేకరీలు, రెస్టారెంట్లు, ఇతర ఫుడ్ ఔట్‌లెట్లు మాత్రం రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచొచ్చు. అలాగే, పెళ్లి వేడుకలపై కూడా ఆంక్షలు విధించారు. రాత్రి 10 గంటల తర్వాత ఇళ్లల్లో మాత్రమే పెళ్లి వేడులకు తక్కువ మందితో నిర్వహించుకోవాలి. మెడికల్ స్టోర్స్, ఫార్మసీలు మాత్రం ఎల్లప్పుడూ తెరిచి ఉంటాయి. ఈ ఆంక్షలన్నీ మంగళవారం నుంచే అమలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కొన్నిచోట్ల ప్రైవేటు వాహనాలపై నిషేధం విధించారు. అలాగే, ప్రభుత్వ రవాణా ఉచితంగా అందిస్తున్నారు.

## బెంగాల్‌పై కన్నేస్తే పాక్ మళ్లీ ముక్కలే

### రక్షణమంత్రి రాజ్‌నాథ్ హెచ్చరిక

**బ్యారక్‌పూర్, ఏప్రిల్ 7:** పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాపై దాడి చేస్తామన్న తన పాకిస్థాన్ రక్షణ మంత్రి బెదిరింపుపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం తీవ్ర హెచ్చరిక చేశారు. 55 ఏళ్ల క్రితం, బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసిన 1971 భారత్-పాకిస్థాన్ యుద్ధంలో ఏమి జరిగిందో గుర్తుంచుకోవాలన్నారు. "పాకిస్థాన్ రక్షణ మంత్రి అలాంటి రెచ్చగొట్టే ప్రకటన చేసి ఉండకూడదు. యాభై ఐదు సంవత్సరాల క్రితం, పాకిస్థాన్ రెండు ముక్కలుగా విడిపోయినప్పుడు వారు దాని పర్యవసానాలను అనుభవించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే, ఈసారి పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో దేవుడికే తెలియాలి" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. బెంగాల్‌లోని బ్యారక్‌పూర్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.



## నవ్‌జ్యోత్ సిద్ధూ భార్య కొత్తపార్టీ

### సోషల్‌మీడియా వేదికగా వెల్లడి

**అమృత్‌సర్, ఏప్రిల్ 7:** పంజాబ్ రాజకీయాల్లో మరో ఆకస్మికపరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, కాంగ్రెస్ బహిష్కృత నాయకురాలు, మాజీ టీమిండియా క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ సిద్ధూ సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు ప్రకటించారు. గత కొంతకాలంగా ఆమె బీజేపీలో చేరుతారని ప్రచారం జరిగినప్పటికీ, వాటన్నింటికీ తెరదించుతూ కొత్త పార్టీ పెడుతున్నట్టు ప్రకటించి పంజాబ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రకటన ఇదని తెలుపుతూ, భారతీయ రాష్ట్రవాది పార్టీ (బీఆర్‌పీ)ని స్థాపిస్తున్నట్లు ఆమె సోషల్‌మీడియాలో వెల్లడించారు. ప్రస్తుత రాజకీయ నాయకుల పనితీరును సమీక్షించిన తర్వాత, ప్రజలకు ఒక కొత్త ప్రత్యామ్నాయం అవసరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. తన కొత్త పార్టీ ప్రధానంగా ప్రజాసేవ, న్యాయంపై దృష్టి సారిస్తుందని తెలిపారు. ప్రజలకు నిజంగా ఏం కావాలో దానిని అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. పంజాబ్ కోల్పోయిన కీర్తిని, గౌరవాన్ని తిరిగి తీసుకురావడం ద్వారా రాష్ట్రాన్ని సువర్ణ రాష్ట్రంగా మార్చడమే తన ఆశయమని వెల్లడించారు. ప్రేమ, స్వేచ్ఛ, నిస్వార్థ సేవ వంటి విలువల ఆధారంగా ప్రభుత్వాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. పౌరుల్లో ఆధ్యాత్మిక వికాసాన్ని పెంపొందించడం, సత్యం, ప్రేమ మార్గంలో నడవడం వంటి ఉన్నత ఆశయాలను ఆమె తన సందేశంలో ప్రస్తావించారు. గాయపడిన ప్రజల మనసులను నయం చేసే ఉద్యమంగా దీనిని అభివర్ణించారు. ఈ ప్రకటనలో పార్టీ నిర్మాణం, ఇతర నాయకులు ఎవరు ఉంటారు, అధికారికంగా పార్టీని ఎప్పుడు లాంచ్ చేస్తారు అనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదు.

## ఎమిరేట్స్ రుణం చెల్లింపుతో మరోసారి సంక్షోభంలోకి పాక్!

**కరాచి, ఏప్రిల్ 7:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు 3.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.29 వేల కోట్లు) భారీ రుణాన్ని చెల్లించాలని కోరడంతో తీవ్ర అప్పుల భారంతో కుంగిపోతున్న పాకిస్థాన్ మరో పెను ఆర్థిక సంక్షోభంలో చేరుకుంది. ఇప్పటికే ఆ దేశ విదేశీ మారక నిల్వలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయిన తరుణంలో, ఈ చెల్లింపు పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థను మరింత కుంగదీస్తుందన్న అంచనాలున్నాయి. గతంలో స్నేహపూర్వక దేశాల నుంచి రుణాలు పొంది, వాటిని రోలోవర్ (గడువు పొడిగింపు) చేయించుకుంటూ పాకిస్థాన్ నెట్టుకొచ్చేది. ఈసారి రోలోవర్‌కు యూఏఈ నిరాకరించినట్లు తెలుస్తోంది. అమెరికాఇజ్రాయెల్ ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో మారిన భౌగోళిక రాజకీయ సమీకరణాలే అబుదాబి కఠిన వైఖరికి కారణమని తెలుస్తోంది. ప్రాంతీయ ఉద్రిక్తతల్లో పాకిస్థాన్ ఇరాన్‌కు దగ్గరగా ఉందనే భావన గల్ఫ్ దేశాలతో, ముఖ్యంగా యూఏఈతో సంబంధాలను క్లిష్టతరం చేసిందని పేర్కొంది. ఈ భారీ చెల్లింపు పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. విదేశీ మారక నిల్వలు మరింత పడిపోయి దిగుమతులకు చెల్లింపులు జరపడం, కరెన్సీ స్థిరత్వాన్ని కాపాడుకోవడం కష్టతరం కానుంది. ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పర్యవేక్షణలో ఆర్థిక సంస్కరణలు చేపడుతున్న పాకిస్థాన్‌కు ఈ పరిణామం గట్టి ఎదురుదెబ్బేనని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. గతంలో పాకిస్థాన్‌కు యూఏఈ ఆర్థికంగా అండగా నిలిచింది. 2018లో 2 బిలియన్ డాలర్ల సాయం అందించగా, 2023లో మరో 1 బిలియన్ డాలర్ల కోసం పాక్ అభ్యర్థించింది. అప్పులో కొంత భాగాన్ని పెట్టుబడిగా మార్చుకునే అంశంపై చర్చలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నా, అవి ఎంతవరకు ఫలిస్తాయోనన్న అనిశ్చితి నెలకొంది. మొత్తంగా, ఈ సంక్షోభం పాక్ ఆర్థిక వ్యవస్థలోని దీర్ఘకాలిక బలహీనతలను మరోసారి వెల్లడి అయ్యాయి.



## భారత్ ధర్మసత్రం కాదు: కేంద్ర మంత్రి అమిత్ షా

**అస్సాం, ఏప్రిల్ 7:** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గరపడుతుండడంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారంజోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ చొరబాటుదారుల ప్రస్తావన తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది బిజెపి వల్లే సాధ్యం అని, బిజెపి అధికారంలోకి వస్తేనే ఇవన్నీ జరుగు తాయన్నారు. బరాక్ లోయలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. బెంగాల్‌లో అక్రమ చొరబాటుదారుల అంశాన్ని పేర్కొనడం గమనార్హం.

## భారత్ సంతతి వైద్యునికి 14 మిలియన్ డాలర్ల జరిమానా!

### అవినీతి బయటపెట్టింది మాజీ ఉద్యోగులే

**అట్లాంటా, ఏప్రిల్ 7:** అమెరికా అట్లాంటాలో భారత సంతతికి చెందిన డాక్టర్ జితేష్ పటేల్ తన పవిత్రమైన వైద్యవృత్తికి మచ్చతెచ్చే విధంగా వ్యవహరించారన్న అభియోగాలతో ఆయనపై 14 మిలియన్ డాలర్ల జరిమానా విధించారు. ఈయన తన క్లినిక్‌కు వచ్చే ప్రతి రోగికి అవసరం ఉందో లేదో కూడా చూడకుండానే శాశ్వత ప్రాతిపదికన శాక్రల్ నర్వ్ స్టిమ్యులేటర్ పరికరాలను శరీరంలో అమర్చారు. రోగులకు మత్తుమందు ఇచ్చి మూత్రనాళం ద్వారా లోపలికి స్కోప్‌లను పంపే సిస్టోస్కోపీ వంటి పరీక్షలను అవసరం లేకపోయినా పదే పదే చేసినట్లు డోజ్ అధికారులు తెలిపారు. యూరాలజీలో ఎప్పుడో గానీ వాడని ఎలక్ట్రోమయోగ్రఫీ పరీక్షలను దాదాపు ప్రతి రోగికి చేసినట్లు డోజ్ వెల్లడించారు. ఇందులో భాగంగా రోగుల జననేంద్రియాలకు ఎలక్ట్రోడ్లు తగిలించి విద్యుత్ సంకేతాలను పంపేవారని దర్యాప్తులో తేలింది. చిన్న ఆపరేషన్‌కూడా సంక్లిష్టమైన ఆపరేషన్ చేసినట్లుగా ప్రభుత్వానికి బిల్లులు పంపి భారీగా సొమ్ము చేసుకున్నట్లు ఫిర్యాదులు వెళ్లాయి. డాక్టర్ జితేష్ పటేల్ చేసిన ఈ నేరాన్ని బయట పెట్టింది అతడి వద్ద పని చేసిన మాజీ ఉద్యోగిని లోరైన్ పెరుమాల్, మాజీ ఫిజీషియన్ డాక్టర్ హిమాన్షు అగర్వాల్‌లే. ఒకప్పుడు జితేష్ పటేల్ వద్ద పని చేసిన వీళ్లే తమ క్లినిక్‌లో జరుగుతున్న దందా గురించి, జితేష్ పటేల్ చేస్తున్న అరాచకాల గురించి ఎఫ్‌బీఐకి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈక్రమంలోనే ఎఫ్‌బీఐ అధికారులు విచారణ చేపట్టి మోసం జరిగింది నిజమేనని తేల్చారు. సర్కారు ఆయనపై 14 మిలియన్ డాలర్లు చెల్లించాలని చెప్పగా డాక్టర్ జితేష్ ఒకే చెప్పారు. సమాచారం ఇచ్చిన లోరైన్ పెరుమాల్, డాక్టర్ హిమాన్షు అగర్వాల్‌లకు ఈ జరిమానాలోంచి 2.94 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 27 కోట్లు) ఇవ్వబోతున్నట్లు కూడా సర్కారు స్పష్టం చేసింది.

## వైట్‌హౌస్‌లోనే రహస్య గూఢచారులున్నారు!

### ఆపరేషన్ లీకేజిపై ట్రంప్ ఆగ్రహం

**వాషింగ్టన్, ఏప్రిల్ 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ ప్రభుత్వంలోనే ఒక గూఢచారి ఉన్నాడంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో కూలిపోయిన ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగిల్ పైలట్‌ను కాపాడేందుకు యూఎస్ సైన్యం భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఆ ఆపరేషన్ వివరాలను గూఢచారి లీక్ చేశాడని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన సైన్యం నిర్వహించిన ఆపరేషన్ గురించి మాట్లాడిన ట్రంప్ ఎఫ్15ఈ విమానం కూలిన తర్వాత ఒక పైలట్‌ను అమెరికా బలగాలు రక్షించాయని, రెండో పైలట్ కోసం బలగాలు ఇంకా గాలిస్తున్నాయని వార్త రావడంతో ఇరాన్‌కు ఆ విషయం తెలిసిందని ట్రంప్ అన్నారు. దాంతో ఆపరేషన్ క్లిష్టతరమైందని చెప్పారు. వార్త రాసిన జర్నలిస్టుకు సమాచారం ఎవరిచ్చారో చెప్పకపోతే జైలుకి వెళ్లాల్సి వస్తుందని బెదిరించారు. అయితే ఆ జర్నలిస్టు పేరుగానీ, ఆ వార్త సంస్థ పేరుగానీ ట్రంప్ బయటపెట్టలేదు. లీక్‌కు కారణమైన వ్యక్తిని కనిపెట్టేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందని ట్రంప్ చెప్పారు. అమెరికా దళాలు రెండో పైలట్ కోసం గాలిస్తున్నాయని వార్త ప్రచురితమైన తర్వాతేఇరాన్ అప్రమత్త మైందన్నారు. ఆ పైలట్‌ను పట్టుకున్నవారికి భారీగా బహుమతి అందజేస్తామని ఆ దేశం బహిరంగ ప్రకటన జారీ చేసిందని, దాంతో తమ సహాయక చర్యలకు తీవ్రఆటంకం ఏర్పడిందన్నారు.

## ఇరాన్ రక్షణకోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమే

### అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్



**టెహ్రాన్, ఏప్రిల్ 7:** ఇరాన్ రక్షణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నారు. దేశానికి చెందిన 14 మిలియన్లకు పైగా ఇరాన్ ప్రజలతో పాటు తానూ దేశం కోసం ప్రాణాలను త్యాగం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కాల్పుల విరమణకు పలు దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదేమైనా పోరాటాన్ని ఆపే ప్రసక్తి లేదని అన్నారు. ఇరాన్ కోసమే నిలబడ్డాను, ఇక ముందు కూడా నిలబడతానని పేర్కొన్నారు. ఇరాన్ హార్మూజ్ జలసంధిని తెరవకపోతే ఆ దేశంలోని అనేక స్థావరాలను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈసారి డెడ్‌లైన్ పొడిగింపు ఉండదని, ఇరాన్‌ను తమ బలగాలు ఒక్క రాత్రికే తుడిచి పెట్టేయగలవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు ధీటుగా స్పందించారు. అమెరికా తాత్కాలిక ఒప్పందాలకు అంగీకరించబోమని, తమ శాశ్వత డిమాండ్లు అంగీకరించాలని చెబుతోంది. తాను, తమ దేశ ప్రజలు ప్రాణత్యాగాలకు కూడా సిద్ధమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించడం చూస్తుంటే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## రైళ్లలో వెళ్లద్దంటూ ఇరాన్‌ప్రజలకు ఇజ్రాయెల్ హెచ్చరికలు

**టెల్ అవీవ్, ఏప్రిల్ 7:** ఇరాన్‌ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం మరింత ఉగ్రరూపం దాలుస్తోంది. భీకర దాడులకు ఇరు దేశాలు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ ప్రజలకు ఇజ్రాయెల్ ఒక హెచ్చరిక జారీ చేసింది. రైల్వే వ్యవస్థలకు, రైళ్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. ముఖ్యంగా 12 గంటలపాటు రైళ్లలో ప్రయాణించకపోవడమే మంచిదని సూచించింది. స్థానిక కాలమానం ప్రకారం ఇప్పటి నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఇరాన్‌లోని ఏ రైళ్లలో అయినా ప్రయాణించడం మానేయండి అని ప్రజల్ని హెచ్చరిస్తూ ఎక్స్‌లో ఇజ్రాయెల్ మిలిటరీ ఒక ప్రకటన జారీ చేసింది. వారి భద్రత కోసమే హెచ్చరికలు చేస్తున్నట్లు తెలిపింది. రైళ్లలో లేదా రైల్వే లైన్ల సమీపంలో ఉంటే ప్రాణాలకు ముప్పు తప్పదని హెచ్చరించింది. ఇజ్రాయెల్ ఇరాన్‌పై సోమవారం భారీ దాడులు నిర్వహించింది. యేహ్లోని పెట్రో కెమికల్ స్థావరాలపై దాడి చేసింది. ఇరాన్‌కు అవసరమైన చమురులో 50 శాతం అందించే స్థావరంపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇది దేశంలోనే అతిపెద్ద చమురు స్థావరం. సౌత్‌పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై దాడి జరిగినట్లు ఇరాన్ మీడియా కూడా ధృవీకరించింది. ఈ ప్రదేశంపై దాడి జరగడం అంటే ఇరాన్‌కు భారీ ఆర్థిక నష్టం కలిగినట్లే. దీని విలువ వందల కోట్ల డాలర్లు ఉంటుందని ఇజ్రాయెల్ తెలిపింది.

# వ్యాపార రంగంలో మహిళలు ముందుకు

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో మహిళలకు పెరిగిన అవకాశాలు

## సెంట్రింగ్ యూనిట్ల ఏర్పాటుతో నెలకు లక్ష ఆదాయం

## తెలంగాణ ఆడబిడ్డలు కొత్త వ్యాపారాలను ఎంచుకోవాలి: మంత్రి సీతక్క పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయేతర వ్యాపారరంగాల్లో మహిళలకు శిక్షణ ఇవ్వడం ద్వారా కొత్త ఉపాధి, వ్యాపార అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంతో మహిళా సంఘాలకు విస్తృత అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 2025-26లో 3.5 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా నిర్మాణ సామగ్రిపై పెరుగుతున్న డిమాండ్‌ను గుర్తించి ఎస్‌హెచ్‌జి మహిళలను ఈ రంగంలోకి ప్రవేశించేలా రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. స్వయం సహాయక మహిళలను నిర్మాణరంగంలో ప్రోత్సహించే లక్ష్యంతో సెంట్రింగ్ పని, ఇటుకల తయారి వంటి వ్యాపారాల్లోఅవకాశాలు కల్పించాలన్న మంత్రి ఆదేశాలతో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు వ్యాపారారానికి అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ(న్యాక్)తో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 772 మంది మహిళలకు సెర్ప్ ద్వారా ప్రత్యేక ఉచిత శిక్షణ అందించింది.

ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సాంకేతిక నైపుణ్యాలు, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ సామర్థ్యాలు పెంపొందించడమే కాకుండా సెంట్రింగ్ ప్రక్రియలో మెళుకువలు, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడం గురించి అవగాహన కల్పించారు. చెక్క, ఉక్కు, అల్యూమినియం, మాడ్యులర్ సిస్టమ్స్ వినియోగంపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. సెంట్రింగ్ యూనిట్ స్థాపన, నిర్వహణకు అవసరమైన మానవ వనరుల ప్రణాళిక, ముడి సరుకుల సమీకరణ, డిజైన్ నుండి అమలు వరకు వర్క్ ఫ్లో నిర్వహణ వంటి అంశాలపై కూడా శిక్షణ అందించారు. డిజైన్ డ్రాయింగ్స్ అర్థం చేసుకోవడం, వనరుల సమర్థ వినియోగం, ఫార్మ్‌వర్క్ అమలు వంటి విషయాల్లో మహిళలను ప్రావిణ్యులను చేశారు.

శిక్షణ అనంతరం ఆర్థిక సహాయం పొందేందుకు అవసరమైన వసతులు కల్పించారు. నిర్మాణరంగంలో శిక్షణ పొందిన 772 మంది మహిళల్లో ఇప్పటివరకు 154 మంది సెంట్రింగ్ యూనిట్లను స్థాపించగా మరో 16 మంది ప్రధాన్ మంత్రి ఉపాధి సృష్టి పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు.

మహిళలను నిర్మాణ రంగంలో ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా మంత్రి సీతక్క జారి చేసిన ఆదేశాలను సెర్ప్ వాటిని సమర్థంగా అమలు చేస్తోంది. ఈ శిక్షణ పొందిన వారిలో వనపర్తి జిల్లా పానగల్ మండలం బండపల్లికి చెందిన వనజ ఒకరు. గ్రామీణ తెలంగాణ ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల ఈ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పట్టభద్రురాలు నెలకు సుమారు రూ.1 లక్ష వరకు ఆదాయం సంపాదిస్తూ మహిళా సాధికారతకు, ఇందిరా మహిళా శక్తి పథక విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇంజినీరింగ్ ఉద్యోగం వైపు కాకుండా నిర్మాణరంగంలో వ్యాపార అవకాశాలను గుర్తించి వ్యాపారవేత్తగా మారిన వనజ మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే విజన్‌కు అద్దం పడుతోంది. ప్రస్తుతం వనజ తన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 3 సెంట్రింగ్ యూనిట్లను అందిస్తూ ఆదాయం పొందడమే కాకుండా స్థానికంగా ఇతరులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తోంది.

# అగ్నిప్రమాదఘటనల్లో రెండువేల మందిని రక్షించాం

## గుల్జార్‌హౌజ్ ఘటన కలచివేసింది

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** అగ్నిప్రమాద సంఘటనల్లో ఇప్పటివరకు దాదాపు రెండువేల మందిని రక్షించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అగ్నిప్రమాదాల నివారణ, అగ్నిమాపక భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో హైదరాబాద్‌లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో 150 మంది ప్రాణాలు కోల్పోయారని, దాదాపు రూ. 800 కోట్ల ఆస్తి నష్టం జరిగిందన్నారు. అగ్ని ప్రమాద సంఘటనల్లో దాదాపు రెండు వేల మంది ప్రాణాలు రక్షించామన్నారు. అగ్ని ప్రమాదాలను తగ్గించడానికి, నియంత్రించడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నా మన్నారు. అగ్ని ప్రమాదాలను తగ్గించడానికి అగ్నిమాపక శాఖ, జీహెచ్ ఎంసీ, పోలీస్ శాఖలు ఎప్పటికప్పుడు తగిన సూచనలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు నగరంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలతోపాటు అవసరమైన చర్యలు చేపడు తున్నామన్నారు. నగరంలో ఎలక్ట్రిక్ కేబుల్స్ కనబడకుండా అండర్ గ్రౌండ్ కేబుల్ ప్రక్రియ జరగబోతుందన్నారు. అత్యవసర సమయాల్లో స్పందిం చడానికి ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ నెట్ వర్క్ అందుబాటులో ఉందన్నారు. అగ్నిమాపక శాఖ వెంటనే స్పందిస్తుందని, ప్రమాదం జరిగినప్పుడు ప్రజలు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఇవే కాకుండా రహవీర్ కార్యక్రమం కింద రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో క్షతగాత్రులను ఆసుపత్రిలో చేర్చితే రూ. 25 వేల బహుమతి అందిస్తున్నామన్నారు. గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదం అందరినీ కలిచివేసిందని, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులంతా బాధ్యతగా ఉండాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, గ్యాస్ లీకేజీలు, పరిశ్రమలలో భద్రతా లోపాలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఫైర్ డీజీ విక్రమ్ మాన్ సింగ్, ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డేవిస్, జెటిసి రమేష్ తదితరలు పాల్గొన్నారు.



యంత్రం పనితీరును తెలుసుకుంటున్న మంత్రి రాజనర్సింహ, చిత్రంలో మంత్రి పొన్నం, ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్, నగరి బీరప్ప తదితరులు

# నిమ్స్‌లో ఆధునిక కేన్సర్ చికిత్స యంత్రం ప్రారంభం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిమ్స్ రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో ఆధునిక అడ్వాన్స్డ్ హై ఎనర్జీ లీనియర్ యాక్సిలరేటర్ యంత్రాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య మహిళ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని సైతం ఇక్కడ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మరో మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, నిమ్స్ డైరెక్టర్ డా. ఎన్. బీరప్ప, పాల్గొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ మహిళలు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. ఈ యంత్రం ద్వారా ఆధునిక క్యాన్సర్ చికిత్స సేవలు మరింత మెరుగుపడతాయన్నారు. ఈ శిబిరంలో 30 మంది మహిళలు రిజిస్టర్ చేసుకున్నారు. వారికి బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ గర్భద్వార క్యాన్సర్‌కి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. నిమ్స్‌లోని రేడియేషన్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, గైనకాలజీ, రేడియాలజీ విభాగాల నిపుణులు పాల్గొని సేవలు అందించారు. ఈ సందర్భంగా ఒక మహిళ తనకు ఎదురైన ఇబ్బందిని నేరుగా మంత్రి దృష్టికి తీసుకురాగా స్పందించిన మంత్రి తన ఫోన్ నంబరును ఇచ్చారు. ఎలాంటి సమస్య ఉన్న తనను సంప్రదించాలని సూచించారు. రోగుల వైపు నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆసుపత్రి వర్గాలకు ఆయన సూచించారు.

# డిజిపిని కలిసిన నార్త్ ఈస్టర్న్ పోలీసు అకాడెమీ అధికారులు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మేఘాలయలోని కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని ఈశాన్య రాష్ట్రాల పోలీసు అకాడమిలో శిక్షణ పొందుతున్న తొమ్మిది మంది డిఎస్‌పిలు, ఐదుగురు ఎస్‌ఐలు రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డిని ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. భారత్ దర్శన్‌లో భాగంగా వీరంతా దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలలో పర్యటిస్తున్న క్రమంలో తెలంగాణకు వచ్చారు. ఈ సందర్భంగా డిజిపి కార్యాలయాన్ని సందర్శిం చి డిజిపి శివధర్ రెడ్డితో భేటీ అయ్యారు. అనంతరం తెలంగాణ పోలీసు విభాగం తీరుతెన్నులు, శాంతి భద్రతల పరిరక్షణలో అనుసరిస్తున్న విధానాలు, నేరాల నివారణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అమలును ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి వారికి వివరించారు. తెలంగాణ పోలీసు విభాగం దేశంలో అనేక విభాగాల్లో ఉత్తమంగా నిలవడం వెనుక అంకిత భావం, చిత్తశుద్ధి, నిజాయితీగా పనిచేయడం వంటివి వున్నాయని వారికి వివ రించారు. అనంతరం ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ట్రైనీ అధికారులు ఇక్కడి పోలీసింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ఇక్కడి పోలీ సుల వృత్తి నైపుణ్యతను తెలుసుకోవడం ద్వారా ఈశాన్య రాష్ట్రాలలో దీనిని అమలు చేయడం తమ ఉద్దేశమని వారు తెలిపారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, ఈశాన్య రాష్ట్రాల పోలీసు అకాడమి డిప్యూటీ అసిస్టెంట్ జనరల్ పర్వేజ్ షేక్ తదితరులు పాల్గొన్నారు.



బిసి మహిళా బిల్లుపై జరిగిన సమావేశంలో పాల్గొన్న వి.హనుమంత రావు, మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

# బిసి మహిళలకు సబ్‌కోటా లేని మహిళా బిల్లు మాకొద్దు

## 16న పార్లమెంటును ముట్టడిస్తాం

## విహెచ్, మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** బిసిలపై కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని పలు రాజకీయ పార్టీల బిసి నేతలు, బిసి సంఘాలు డిమాండ్ చేశాయి. బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించకపోతే ఈనెల 16న పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించాయి. కులగణన, బీసీ మహిళా సబ్ కోటా కల్పించేవరకు కేంద్రంపై పోరాడుతామని ప్రకటించారు. మంగళవారం కాచిగూడలో బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎంపి వి.హనుమంతరావు, బిఆర్‌ఎస్ శాసన మండలి పక్షనాయకుడు ఎస్.మధుసూదనాచారి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు మాట్లాడారు. అగ్రకుల మహిళల ప్రయోజనాల కోసమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళా బిల్లును ముందుకు తీసుకువస్తుందని, అందులో భాగంగానే ఈ నెల 16 నుండి 18 వరకు ఢిల్లీలో ప్రత్యేక పార్లమెంటు సమావే శాలు ఏర్పాటు చేసి మహిళా బిల్లును అమలులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం తహతహ లాడుతుందన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోటా కల్పించినప్పుడే మహిళా బిల్లుకు సంపూర్ణ సాధికారత లభిస్తుందన్నారు.

# అధికారులు పనితీరు మార్చుకోవాలి

## వాహన్ పోర్టల్‌లో సమస్యలు లేకుండా చూసుకోవాలి

## జూన్ 1 నాటికి ఆటోమేటిక్ టెస్టింగ్‌స్టేషన్‌ను ప్రారంభించేలా చూడాలి

## రవాణా శాఖ సమీక్షలో మంత్రి పొన్నం



మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ అధికారులతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** రవాణాశాఖలోని పలువురు అధికారులు తమ పనితీరును మార్చుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వాహన్ పోర్టల్ డేటా పూర్తి చేసుకొని టెక్నికల్ సమస్యలు లేకుండా చూసుకోవాలని, జూన్ 2 నాటికి ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ను ప్రారంభించేలా పనులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో రవాణా శాఖ అధికారులతో రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం నిర్వహించారు. రవాణా శాఖలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎన్‌ఫోర్స్ మెంట్‌ను బలోపేతం చేస్తూ ఆదాయాన్ని పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2024-25 లో రవాణా శాఖ రూ. 6910.90 కోట్లు ఆదాయం వసూలు కాగా 2025-26 లో రూ.7097.38 కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు. ఈవీ పాలసీ ద్వారా రవాణా శాఖ ఆదాయం కొంతమేర తగ్గినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. తగ్గిన ఆదాయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేస్తూ ఆదాయ మార్గాలు పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. గతంలో ఇచ్చిన టార్గెట్ రీచ్ అయి లైఫ్ టాక్స్ ,త్రైమాసిక టాక్స్ వసూలు లో మంచి పనితీరు కనబరచిన అధికారులను అభినం దించిన మంత్రి.. పలువురు అధికారులకు పనితీరు మెరుగు పరచుకోవాలని హెచ్చరించారు. నిజామా బాద్ మహారాష్ట్ర , ఆది లాబాద్ మహారాష్ట్ర, మెదక్ కర్ణాటక తదితర సరిహద్దు జిల్లాల రవాణా శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ఆర్టీవో కార్యాలయాల్లో పెండింగ్ లైసెన్స్ ఇతర పౌర సేవలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. వాహన్ పోర్టల్ ద్వారా సేవలు డేటా పూర్తిచేసుకొని టెక్నికల్ సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. సారథి అమలులోకి వచ్చిన తర్వాత 8 నెలల్లోనే దేశంలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. ఏఎంవీఐలకు ఇచ్చిన శిక్షణ మాదిరి ఇతర రవాణా శాఖ అధికారులకు విడతల వారిగా శిక్షణ ఇవ్వాలనీ అధికారులకు సూచించారు. రవాణా శాఖలో తన పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలు పూర్తి చేసి ఇతర సమస్యలు కమిషనర్ లేదంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 13 నుండి నిర్వహించే అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పోలీస్, రవాణా శాఖ సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో 37 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్ మంజూరయ్యాయని, జూన్ 1 న తొలి టెస్టింగ్ స్టేషన్ ప్రారంభించుకునేలా పనులు వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి రేడియం రిఫ్లెక్టివ్‌ను కచ్చితత్వం చేయాలన్నారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ కోసం కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం దాదాపు ఈవీ పాలసీ తీసుకొచ్చిందని ఇప్పటి వరకు దాదాపు వెయ్యి కోట్లు టాక్స్ మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్క్రాపెజ్ పాలసీ తీసుకొచ్చిందని ఇప్పుడు రాష్ట్రంలో మూడు కేంద్రాలు ఉండగా జిల్లా కేంద్రానికి ఒక ఆర్వీఎస్ఎఫ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెహికిల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్ నిర్భయ ఫ్రేమ్ అందుబాటులోకి రానుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రహవీర్ స్కీమ్, క్యాష్ లెస్ ట్రీట్మెంట్ లో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎవరికైనా ప్రమాదం జరిగినప్పుడు అత్యవసరంగా హాస్పిటల్ కి తీసుకెళ్లిన వారికి రహవీర్ అవార్డు కింద 25 వేలు బహుమతి అందించనున్నారు. 25 ప్రాంతాల్లో రవాణా శాఖకు స్థలాలు ఉన్నాయని 17 జిల్లాల్లో రవాణా శాఖ కార్యాలయాలకు స్థలాలు గుర్తించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, రమేష్ పాల్గొన్నారు.

# టిజి సీడ్స్‌నే సాగు చేయండి

## అన్నదాతలకు తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ మార్కెట్‌లోకి తీసుకువచ్చిన విత్తనాలనే వినియోగించాలని రైతులకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం విత్తనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రైవేట్ విత్తన కంపెనీలు చెప్పే మాయ మాటలకు మోసపోవద్దని, ప్రైవేట్ విత్తనాల కంటే నాణ్యమైన తెలంగాణ సీడ్స్ విత్తనాలనే వినియోగించాలని సూచించారు. ఈ విషయమై మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతియేటా నకిలీ విత్తనాలతో రైతులు పెద్దసంఖ్యలో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. అన్నిరకాల విత్తనాలను నకిలి మాఫియా కల్తీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను నకిలీ మాఫియా బారి నుంచి కాపాడేందుకు ప్రభుత్వం త్వరలోనే సమగ్ర విత్తన చట్టాన్ని



# యాసంగిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

## 48 గంటల్లో రైతులకు చెల్లింపులు

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** యాసంగి సీజన్‌లో వరి కొనుగోళ్లకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హుజూర్‌నగర్ మార్కెట్ యార్డులో వరి కొనుగోళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... ఈ యాసంగి సీజన్‌లో సుమారు 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రబి వరి ఉత్పత్తి 148 లక్షల మెట్రిక్ టన్నులకు మించనున్న నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రైతులకు 48 గంటల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,251 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వీటికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నిల్వ గోదాములు, రవాణా సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయనితెలిపారు. ఇప్పటికే 16 కోట్లకుపైగా గన్నీ సంచులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ప్రతీ కేంద్రంలో ఒక అధికారిని నియమించి కొనుగోళ్లు, నాణ్యత తనిఖీలు, చెల్లింపులు పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షణ చేయిస్తామని పేర్కొన్నారు. కొనుగోళ్లలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని యంత్రాంగాన్ని మంత్రి ఆదేశించారు. సాధారణ వరి రకానికి క్వింటాల్‌కు రూ. 2,369, మెరుగైన రకానికి రూ. 2,389 కనీస మద్దతు ధర రైతులకు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కస్టమ్ మిల్డ్ రైస్ (సిఎంఆర్) కింద ఉడకబెట్టిన బియ్యం కొనుగోలు విషయంలో కొన్ని సమస్యలు ఉన్నాయని మంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కోటాను తగ్గించడం, అలాగే బియ్యంలో బ్రోకెన్ రైస్ శాతం తగ్గించాలనే కఠిన నిబంధనలపై రైస్ మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, మిల్లర్లు, కేంద్ర ఆహార మంత్రిత్వశాఖతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద వరి ధాన్యం అక్రమ రవాణాపై కఠిన నిఘా ఉంచుతున్నామని, ఇతర రాష్ట్రాల వరి తెలంగాణ కొనుగోలు కేంద్రాలకు అనుమతించబోమని మంత్రి స్పష్టం చేశారు. గత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రం సుమారు 72 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసి రికార్డు సృష్టించిందని గుర్తుచేశారు. ఆ సీజన్‌లో రైతుల ఖాతాల్లో రూ. 19,500 కోట్లకు పైగా నేరుగా జమ చేసినట్లు తెలిపారు. రాష్ట్రానికి కేటాయించిన నదీ జలాలను సమర్థంగా వినియోగిస్తూ పంటలకు నీటిపారుదల అందించామని, తెలంగాణ హక్కుల విషయంలో రాజీ పడబోమని మంత్రి స్పష్టం చేశారు.

# ప్రాణం తీయడానికే డంపింగ్‌యార్డులా?

## హుజూరాబాద్ ప్రజలు ఏం పాపం చేశారు?

## 24 గంటల నిరహార దీక్ష చేపట్టిన కౌశిక్‌రెడ్డి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్

**జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో పాలకప్రభుత్వాలు ఏ సంక్షేమ కార్యక్రమం చేపట్టిన ముందు ప్రజల ప్రాణాలు, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఆచితూచి అడుగులు వేస్తుంది. అలాంటిది రాష్ట్రంలోని పలు ప్రాంతాల ప్రజలు డంపింగ్ యార్డు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తే.. కరోనా వ్యాధి కన్న విషపూరితమైన డంపింగ్ యార్డు నిర్మాణాన్ని హుజూరాబాద్-సిర్సపల్లి గ్రామాల మధ్యన ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఉద్దేశం హుజూరాబాద్ ప్రజల ప్రాణాలు హరించడానికా..? 119 నియోజకవర్గాలలో హుజూరాబాద్ ప్రజలు చేసిన పాపామేంటి..? ఆ యార్డు నిర్మాణం వల్ల ప్రజలకు లాభమేంటి..? వారి ప్రాణాలు తీయడమేనా..? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హుజు రాబాద్ బిఆర్‌ఎస్ శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద వేలాది మందితో 24గంటల నిరాహార దీక్షలు చేపట్టిన సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసారు. అంతకుముందు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, అఖిలపక్ష సంఘాల నేత పల్కాల ఈశ్వర్‌రెడ్డితో పాటు వందమందికిపైగా పలు రాజకీయ పార్టీల నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి నివాళులు అర్పించారు. దీక్ష శిబిరం వద్దకు అఖిలపక్ష సంఘ నాయకులు, సభ్యులు అభిమానులు, ప్రజలు డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ దీక్ష శిబిరాల వద్దకు చేరుకున్నారు. అనంతరం దీక్ష శిబిరం వద్ద వేద పండితులు, ముస్లిం మత పెద్దలు, క్రైస్తవ పాస్టర్లు సర్వమత ప్రార్థనలు చేసి నిరాహార దీక్షలు ప్రారంభించి, మద్దతుగా నిలిచారు. పరిసర గ్రామాల నుండి ఈ నిరాహార దీక్షకు మాజీ కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, మాజీ తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ ఈ దీక్షకు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ దీక్ష కార్యక్రమానికి హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, కమలాపూర్, ఇల్లందకుంట మండలాల పలు రాజకీయ పార్టీల నేతలతో పాటు బిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు అఖిల పక్ష ప్రజాసంఘాల నేతలు వేల సంఖ్యలో మహిళలు, పురుషులు దీక్ష శిబిరానికి చేరుకుని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో పాటు సుమారు వందమందికి నుదుట తిలకం దిద్ది పూలమాలలు వేసి నిరాహారదీక్షలు ప్రారంభించారు.

ఈ సందర్భంగా అశేశంగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ హుజూరాబాద్ ప్రాంత ప్రజలు గత 17రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూర మన్నారు. హుజూరాబాద్ ప్రజలను హరిగోస పెట్టాలని రేవంత్‌రెడ్డి సర్కారు చూస్తుందని నియోకవర్గ ప్రజల ఓపిక నశిస్తే.. ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకవస్తుందని కౌశిక్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు.

# ఆహార కల్తీ నియంత్రణలో తీవ్రలోపాలు

## ప్రత్యేక శాఖ, కోర్టులు లేకపోవడం వల్లే సమస్య

## వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి

**హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆహార కల్తీ నియంత్రణలో తీవ్ర లోపాలు ఉన్నాయని, ప్రత్యేక యంత్రాంగం లేకపోవడం వల్ల సమస్య రోజురోజుకు పెరుగుతోందని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆహార కల్తీని అరికట్టేందుకు గతంలో కేంద్రం పలు కఠిన చట్టాలు, నిబంధనలు అమలు చేసినప్పటికీ, ప్రస్తుతం అమల్లో ఉన్న ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం 2006 (2011 నుంచి అమలు) వచ్చిన 15 సంవత్సరాలు పూర్తవుతున్నా, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయకపోవడం ఆందోళనకరమని తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేట్ పాల డెయిరీల్లో హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి రసాయనాల కల్తీ జరుగుతుండగా, పసుపు పొడిలో సీసం ఆధారిత రంగులు, మసాలా పొడులు, చికెన్ పౌడర్లలో హానికర ప్రిజర్వేటివ్‌ల వినియోగం కొనసాగుతోందని ఆరోపించారు. ఆహార కల్తీ నివారణలో ప్రధాన లోపం ప్రత్యేక శాఖ లేకపోవడమేనని ఆయన స్పష్టం చేశారు. కుటుంబ సంక్షేమ, ఆరోగ్యశాఖ కమిషనరే ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించడం, అలాగే ఇండియన్ ప్రివెన్షన్ ఆఫ్ మెడిసిన్ డైరెక్టర్‌కు ఆహార కల్తీ నిరోధక శాఖ బాధ్యతలు అప్పగించడం వల్ల సమర్థవంతమైన అమలు సాధ్యం కావడం లేదన్నారు. జిల్లా స్థాయిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నప్పటికీ, పూర్తి స్థాయి అధికార వ్యవస్థ లేకపోవడం వల్ల నియంత్రణలో లోపాలు ఉన్నాయని చెప్పారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం జిల్లా స్థాయిలో కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం ఏర్పాటు కావాల్సి న జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితులు, ఆహార భద్రత చట్టాల ప్రకారం ఉండాల్సి న విజిలెన్స్ కమిటీలు, జిల్లా ఆహార సలహా సంఘాలు, ధరల నియంత్రణ కమిటీలను రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఇప్పటికీ పూర్తిగా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఆహార భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని, ప్రత్యేక శాఖ, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని, నాణ్యత పరీక్షల ల్యాబొరేటరీలను పునరుద్ధరించాలని సాంబరాజు చక్రపాణి ప్రభుత్వాన్ని కోరారు.

# సమతుల ఆహారంతో ఆరోగ్యం కాపాడుకోవాలి

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** పౌష్టికాహారంతో ఆరోగ్యం కాపాడుకోవాలని ముఖ్యంగా గర్భవతులు మంచి ఆహారం తీసుకొంటే ఆరోగ్యకరమైన శిశువు జననం ఇస్తారని దీనితో మేలికరం మానవ వనరులతో విజ్ఞానవంతమైన ఆరోగ్యకరమై సమాజాన్ని నిర్మించడానికి సాధ్యమౌతుందని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణలో ప్రజలు ఆరోగ్యకరమై అలవాట్లు ఆచరించడం నేటి నుంచి మొదలు పెట్టాలని హితవు చెప్పారు. ఆరోగ్యం ప్రతి మనిషికి అత్యంత విలువైన సంపద అని, సమాజం మొత్తం ఆరోగ్యవంతంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి న అవసరం ఉందని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు.



చదరంగం ఆడుతున్న శ్రేయాన్ష్ కృష్ణపటేల్

## ప్రపంచ రికార్డు సృష్టించిన మంత్రి కొండా సురేఖ మనవడు

### అతిపిన్న వయసులోనే చదరంగంలో అసాధారణ ప్రతిభ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మనవడు ప్రపంచ రికార్డు సృష్టించాడు. 2 యేళ్ల 11 నెలల అతి పిన్న వయసులో చదరంగంలో ప్రతిభను చాటాడు. జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే ఎంపీస్ కాలనీ కల్చరల్ సెంటర్‌లో రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, కొండా మురళీ దంపతుల మనవడు కొండా శ్రేయాన్ష్ మురళీకృష్ణ పటేల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్)లో రెండు అసాధారణ రికార్డులను నెలకొల్పాడు. 15 నిమిషాల 52 సెకన్లలో 93 బ్యాక్‌ర్యాంక్ చెక్‌మేట్స్‌ను పరిష్కరించడంతో పాటు, గంట 9 నిమిషాలలో 21 చెస్ బోర్డులను అమర్చి రెండు ప్రపంచ రికార్డులను సాధించి చరిత్ర సృష్టించాడు. మనవడి ప్రతిభను తిలకించిన మంత్రి కొండా సురేఖ ఒక్కసారిగా ఉద్వేగానికి గురై ఆనందభాష్పాలు రాల్చారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. బాలుడి ప్రతిభను ప్రత్యక్షంగా తిలకించారు. ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అత్యంత పిన్న వయస్సులోనే ఈ రికార్డును సాధించిన ఏకైక బాలుడిగా ఖ్యాతికెక్కడం అభినందనీయమన్నారు. శ్రేయాన్ష్ కృష్ణపటేల్ తన అద్భుత నైపుణ్యాలతో నిర్ణీత సమయంలో రికార్డును సాధించాడన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి చిన్నారిని వెన్నుతట్టి ప్రోత్సాహించారు. ఆయన మాట్లాడుతూ, చెస్‌లో వరల్డ్‌రికార్డ్ సాధించిన శ్రేయాన్ష్ మురళీకృష్ణపటేల్ తెలంగాణకు గర్వకారణమన్నారు. శ్రేయాన్ష్ తల్లి కొండా సుష్మితపటేల్ మాట్లాడుతూ.. జూన్‌లో బ్రిటన్ పార్లమెంట్‌లో అవార్డు అందుకుంటామన్నారు. తమ కుమారుడి ఆధ్యాత్మిక చింతన, క్రీడానైపుణ్యాలు అబ్బురపరుస్తాయన్నారు. కొండా సురేఖ మాట్లాడుతూ, శ్రేయాన్ష్‌కృష్ణ ఎంతో ఓపికగా పజిల్స్ పరిష్కరించడంతోపాటు చెస్‌బోర్డులను చాలా చక్కగా అమర్చడం ఉద్వేగానికి గురిచేసిందన్నారు. కార్యక్రమంలో రాయ్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు, కోచ్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ శ్రేయాన్ష్ సాధన కేవలం రికార్డు కోసం కాదనీ, అతని మేధ భవిష్యత్ తరాలకు ప్రేరణ అని అన్నారు. బ్రిటీష్ పార్లమెంట్‌లో సత్కారంతోపాటు సర్టిఫికెట్‌ను పొందనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాయ్ చెస్ అకాడమీ తరపున ట్రోఫీ, సర్టిఫికెట్‌ను మంత్రి కొండా సురేఖ, వాకిటి శ్రీహరి ప్రదానం చేశారు.

## దేశంలోనే నం.1 తెలంగాణ ఆడిట్ శాఖ

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** ఆన్‌లైన్ ఆడిటింగ్ లో అత్యుత్తమ ప్రమాణాలతో తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలో నెంబర్ వన్ గా నిలిచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వరుసగా గత మూడుసార్లు దేశంలో నెంబర్ వన్ ర్యాంకు సాధించిందని తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం రాష్ట్రంలో ఆన్ లైన్ ఆడిటింగ్ వ్యవస్థను పరిశీలించేందుకు వచ్చిన గుజరాత్ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు అత్యంత బలంగా ఉన్నాయన్నారు. తెలంగాణ లో ఆడిట్ శాఖ పనితీరు అధ్యయనానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను అర్థం చేసుకోవడానికి అధికారులు పూర్తిగా సహకరిస్తారని చెప్పారు. గుజరాత్ అధికారులు స్పందిస్తూ గత రెండు రోజులుగా తెలంగాణ రాష్ట్రంలోని పలు గ్రామపంచాయతీలను సందర్శించి ఆన్‌లైన్ వ్యవస్థను అధ్యయనం చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణలో ఆడిటింగ్ వ్యవస్థ పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగుతుందని కితాబునిచ్చారు.

## పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు

### ఆరుగురు అధికారులకు ప్రమోషన్

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ప్రమోషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. మల్టీ జోన్-1 పరిధిలోని పంచాయతీ కార్యదర్శి గ్రేడ్1, సీనియర్ అసిస్టెంట్ కేటగిరీలకు చెందిన ఆరుగురు ఉద్యోగులకు మండల పంచాయతీ అధికారులుగా (ఎంపీవోలు) పదోన్నతి లభించింది. కొత్త జోనల్ విధానం ప్రకారం 2019-20, 2020-21 ప్యానెల్ సంవత్సరాలకు సంబంధించి నిర్వహించిన రివ్యూ ఆధారంగా ఈ నియామకాలు జరిగాయి. గతంలో జరిగిన ఎంపీవో ప్రమోషన్లపై ఏర్పడిన సందేహాలు, కొత్త లోకల్ క్యాడర్ అంశాలపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం అంతర్గత కమిటీని నియమించింది. ఈ కమిటీ సమర్పించిన రిపోర్టును పరిశీలించిన డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) నిబంధనల ప్రకారం అర్హులైనవారికి ప్రమోషన్లు ఖరారు చేసింది. నిజామాబాద్ జిల్లాలో గ్రేడ్-1 పంచాయతీ సెక్రటరీగా కొనసాగుతున్న ఏ.గంగాధర్, రజినీకాంత్‌రెడ్డి, సయ్యద్ మగ్దుమ్ అహ్మద్‌ను మెదక్ జిల్లాకు ఎంపీవోలుగా కేటాయించారు. నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతున్న పి.సాయిలును సిద్ధిపేట, సిద్ధిపేటలో గ్రేడ్-1 పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న మునీరుద్దీన్‌ను మెదక్, వరంగల్ జిల్లాలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షాజహాన్ ను ములుగుకు కేటాయించారు. పదోన్నతి పొందిన అధికారులు 15 రోజుల్లోగా కొత్త జిల్లాలో విధుల్లో చేరాలని పంచాయతీరాజ్‌శాఖ ఆదేశించింది. ఈ నియామకాలను అడ్‌హాక్ ప్రాతిపదికన చేపట్టారు. కోర్టు కేసులు లేదా ఇతర పాలనాపరమైన నిర్ణయాలకు లోబడి ఈ ప్రమోషన్లు ఉంటాయని పేర్కొంది.

## అంతరాయం లేకుండా ఆటో ఎల్‌పిజి సరఫరా

### వారం రోజుల్లో పనితీరును మెరుగుపరుచుకున్న కంపెనీలు

### పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్‌రవీంద్ర

**హైదరాబాద్, ఎప్రిల్ 7, ప్రభాతవార్త:** ఆటో ఎల్పీజీని ఎక్కువగా తెప్పించి తమ పరిధిలోని బంకులన్నింటికీ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని ఆయా ప్రయివేట్ ఆటో ఎల్‌పిజి కంపెనీలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. వారం క్రితం నిర్వహించిన సమీక్షలో చాలావరకు కంపెనీలు సరఫరాను నిరాటంకంగా కొనసాగిస్తు న్నాయన్నారు. అయితే కొన్ని కంపెనిలు మాత్రం పనితీరులో పెద్దగా చూపించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ఉండాలంటే ఆటో ఎల్పీజీ సరఫరా ఆగకుండా చూడటం చాలా ముఖ్యమని ఆ కంపెనీలకు తేల్చి చెప్పారు. ఈ విషయమై మంగళవారం పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో ఆటో ఎల్‌పిజి ప్రయివేటు ఆయిల్ కంపెనిలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆటో ఎల్‌పిజి సరఫరాలో అంతరాయం లేకుండా పనిచేస్తున్న కంపెని యాజమాన్యాలను ఆయన ప్రశంసించారు. గడిచిన వారం రోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీని తెప్పించి సరఫరా చేశామన్నారు. మూతపడిన 17 బంకులను మళ్లీ తెరిపించామని వెల్లడించారు. గ్యాస్ సరఫరాను పెంచి, మూతపడిన బంకులను మళ్లీ తెరిపించడంలో సూపర్ గ్యాస్, గో గ్యాస్, టోటల్ ఎనర్జిస్, ప్రైమ్ ఫ్యూయల్ కంపెనీలు చేసిన కృషిని కమిషనర్ అభినందించారు.

# శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం లేనట్టేనా?

### సమర్థించిన కేంద్రం, సుప్రీంకు నివేదన

### తుది విచారణ ఆరంభం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** శబరిమల ఆలయంతో సహా పలు మతపరమైన ప్రదేశాలలో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై, అలాగే పలు మతాలు పాటించే మత స్వేచ్ఛ పరిధి, విస్తృతిపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం తుది విచారణను ప్రారంభించింది. మత స్వేచ్ఛ, మత శాఖలకు సంబంధించిన ఆర్టికల్స్ 25, 26లను ఈ ధర్మాసనం ప్రత్యేకంగా పరిశీలించనుంది. వాదనలను ప్రారంభిస్తూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఒక నిర్దిష్ట వయస్సు వర్గానికి చెందిన ఒక నిర్దిష్ట లింగాన్ని ప్రార్థనా స్థలంలోకి ప్రవేశించకుండా నిరోధించడం వివక్ష కాదని అన్నారు. సామాజిక సంస్కరణల కోసం చట్టాలు చేయడం శాసనసభల విధి అని, న్యాయ సమీక్ష పరిమితంగా ఉంటుందని కూడా ఆయన వాదించారు.

ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బివి నాగరత్న కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక నెలలో మహిళలకు మూడు రోజులు అంటరానితనం ఉండి, నాలుగో రోజు అంటరానితనం ఉండదని అనుకోవడానికి వీల్లేదని జస్టిస్ బి.వి. నాగరత్న వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 గురించి ఆమె ప్రస్తావించారు. అంటరానితనానికి అధిగమించడానికే ఆర్టికల్ 17ను ప్రాథమిక హక్కుగా చేశారని గుర్తు చేసుకున్నారు. 2018 సెప్టెంబర్‌లో, ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం, 4:1 మెజారిటీ తీర్పుతో, కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి రుతుస్రావ వయస్సు గల మహిళల ప్రవేశాన్ని నిరోధిస్తున్న నిషేధాన్ని ఎత్తివేసింది. శతాబ్దాల నాటి ఈ హిందూ మత ఆచారం చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అని కూడా పేర్కొంది. అయితే, 2019లో, అప్పటి సిజెఐ రంజన్ గోగోయ్ నేతృత్వంలోని మరో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం, వివిధ ప్రార్థనా స్థలాలలో మహిళలపై వివక్షకు సంబంధించిన ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించింది. ఇదిలా ఉండగా, 'మత శాఖ' అంటే ఏమిటి లేదా ఏ మత ఆచారాలు 'అత్యవసరం' అనేదానికి ఒక కఠినమైన నిర్వచనం ఇవ్వడం, విభిన్న వర్గాలు, సమూహాలు, ఆధ్యాత్మిక వంశాలు, ప్రాంతీయ సంప్రదాయాలు, విశ్వాసాలు, ఆచారాలు, సంప్రదా యాలు, నమ్మకాల ద్వారా వ్యక్తమయ్యే హిందూమతం సహజసిద్ధమైన బహుళత్వ స్వభావాన్ని 'కుదించినట్లు' అవుతుందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కాగా, అంతకుముందు శబరిమల అయ్యప్ప ఆలయం లోకి మహిళ ప్రవేశంపై తమ వైఖరిని సుప్రీంకోర్టుకు తెలియజేసింది.




## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

### అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్ ప్రతినిధి బృందంతో సిఎస్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఏప్రిల్7:** అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్ నుండి వచ్చిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావుతో సమావేశమైంది. ఈ ప్రతినిధి బృందంలో బీమా, ఆర్థిక సేవలు, వ్యవసాయం, సాంకేతిక రంగాలకు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు ఉన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిపై ప్రతినిధి బృందానికి వివరించారు. 2014లో దేశంలోనే అత్యంత పిన్న రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ గత దశాబ్దకాలంలో విశేష పురోగతి సాధించిందని ఆయన తెలిపారు.



ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల నుంచి గణనీయమైన పెట్టుబడుల వలన రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి) ఆదాయం గణనీయంగా పెరిగిందని చెప్పారు. భారతదేశంలో నగరీకరణ వేగంగా జరుగుతున్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటని, దాదాపు మూడో వంతు జనాభా హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నారని ఆయన అన్నారు. హైదరాబాద్‌ను దేశంలోనే ఔషధ రాజధానిగా, సమాచార సాంకేతిక రంగంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల రక్షణ రంగ స్టార్టప్‌ల అభివృద్ధికి కూడా దోహదపడిందని చెప్పారు. అలాగే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జిసిసిలు)లో హైదరాబాద్ భారీ పెట్టుబడులను ఆకర్షించిందని, దేశంలో పేరుగాంచిన విద్యాసంస్థలు, ప్రపంచ స్థాయి ఆరోగ్య సదుపాయాలు, బలమైన ఫిన్‌టెక్ పరిసర వ్యవస్థ ఇక్కడ ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, సమృద్ధిగా ఉన్న సాంస్కృతిక వారసత్వం, ప్రసిద్ధ వంటకాలు వంటి అంశాలు పెట్టుబడిదారులను ఆకర్షించే ముఖ్య కారణాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటిగా ఉండి, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్స హించడంలో ప్రతినిధి బృందానికి పూర్తి సహకారం అందిస్తుందని, తెలంగాణను గ్లోబల్ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, మలాచీ బ్రియాన్ నుగెంట్, ఆర్ దీపక్ జోషి, దివదృష్ట్ సింగ్ (అమెరికాభారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్), వివిధ కంపెనీల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

### వారాహి-ప్రత్యంగిరా-శరభేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి

## మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరికి ఆహ్వానం

**హైదరాబాద్, ఎప్రిల్ 7, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి గ్రామ వారాహి అమ్మవారు, ప్రత్యంగిరాదేవి, శరభేశ్వరస్వామి దేవాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతోపాటు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ఆలయ కమిటి ఆహ్వానించింది. ఈ మేరకు మంగళవారం మంత్రులను హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో మంగళవారం ఆయల ప్రతినిధులు కలిశారు. దేవాలయాల మహా ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఈ నెల 29, 30, మే 1, 2 తేదీల్లో అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో వారాహి-ప్రత్యంగిరా-శరభేశ్వర స్వామి దేవాలయాలను నిర్మిస్తున్న దేవాలయాల చైర్మన్ మమతమ్మ సేవలను మంత్రి వాకిటి శ్రీహరి ప్రశంసించారు.

## నేడే పిసి ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు కీలక తీర్పు

### నివేదికను రద్దు చేయాలంటూ

### కెసిఆర్, హరీశ్‌రావు, స్మితాసబర్వాల్ పిటిషన్లు

### సుదీర్ఘవాదనల అనంతరం తీర్పును రిజర్వ్ చేసిన ఉన్నత న్యాయస్థానం

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అక్రమాలు జరిగాయంటూ వెల్లువెత్తిన ఆరోపణలపై విచారణ జరిపిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక అంశంపై బుధవారం హైకోర్టు కీలక తీర్పు వెలువరించనుంది. ఘోష్ నివేదికను రద్దు చేయాలంటూ హైకోర్టులో మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరిష్‌రావు, సీనియర్ అధికారులు స్మితా సబర్వాల్, ఎస్‌కె జోషి పిటిషన్లు వేశారు. తమ వాదనలు వినకుండా ఏకపక్షంగా ఈ నివేదికను కమిషన్ రూపొందించినందున రద్దు చేయాలని తమ పిటిషన్లలో కోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్లపై కొన్ని రోజులుగా హైకోర్టులో కొనసాగిన సుదీర్ఘ వాదనలు పూర్తయ్యాయి. ప్రభుత్వం తరపు న్యాయవాదులు, పిటిషనర్ల తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఇప్పటికే తీర్పును రిజర్వ్ చేసింది. ఆ తీర్పును బుధవారం వెలువరించనుంది. కాగా.. ఘోష్ కమిటి నివేదికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు కోర్టు వెలువరించనున్న తీర్పుపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపి జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే.

# రూ.12.5 లక్షల డాలర్ల మోసం

### ఐటి సంస్థ ఫిర్యాదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లో భారీ కార్పొరేట్ మోసం వెలుగుచూసింది. సింగపూర్‌కు చెందిన ఇన్‌ఫ్లో టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధి సందీప్‌గుప్తా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. 2017లో సింఫనీ ఐటీ డిస్ట్రిబ్యూ షన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై నమ్మకం కల్పించి హెచ్‌పీఈ ఉత్పత్తులను సరఫరా చేయించుకుని, మొత్తం 12.5 లక్షల డాలర్ల విలువైన సరుకులు తీసుకున్నట్లు ఆరోపించారు. కొంత మొత్తాన్ని ముందుగానే చెల్లించి నప్ప టికీ, మిగతా రూ.2.92 లక్షల డాలర్ల బకాయిని చెల్లించకుండా మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రిసార్ట్ కంపెనీకి రూ.50 లక్షల మోసం: ఆరుగురిపై కేసు**

జూబ్లీహిల్స్‌లోని ఎస్‌ఎస్‌పీడీఎల్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన రూ.50 లక్షల మోసం కేసు వెలుగులోకి వచ్చింది. సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధి వంగూరి యేసోబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కేరళంలోని మున్నార్ ప్రాంతంలో ఉన్న కంపెనీ ఆస్తి భద్రత బాధ్యతలు చూసే ఇద్దరు ఉద్యోగులు, మిగతా నలుగురితో కలిసి కుట్ర పన్ని తప్పుడు దాడి కథను సృష్టించి కంపెనీ నుంచి రూ.50 లక్షలు వైద్యఖర్చుల పేరుతో ఖర్చు చేయించారు. అనంతరం కోర్టులో ఇచ్చిన అఫిడవిట్లలో తమకేమీ సమస్య లేదని చెప్పడంతో మోసం బయటపడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**సైబర్ మోసం - కార్మికుడికి రూ.97 వేల నష్టం**

జూబ్లీహిల్స్‌లో రోడ్ నం.14లో నివసించే మంటూసింగ్ (42) కార్మికుడు సైబర్ మోసానికి గురయ్యాడు. ఫిబ్రవరి 22న తన బ్యాంక్ ఖాతాలో రూ.2,000 తగ్గినట్లు గుర్తించిన అతడు, యూట్యూబ్‌లో నవి యాప్ కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతికాడు. అందులో కనిపించిన నంబర్‌కు కాల్ చేయగా, వ్యక్తి తనను కస్టమర్ కేర్ ప్రతినిధిగా చెప్పి వాట్సాప్ వీడియో కాల్ ద్వారా స్క్రీన్ షేరింగ్ చేయమని సూచించాడు. కొద్ది సేపటికే ఖాతా నుండి రూ.97వేలు మాయమయ్యాయి. బాధితుడు వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కూకట్‌పల్లి జెఎన్టీయుసిలో కలకలం రేపిన బాంబు బెదిరింపు

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** కూకట్‌పల్లిలోని జెఎన్‌టియుసిలో మంగళవారం బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తుల నుండి వైస్ ఛాన్స్‌లర్‌కు జెఎన్‌టియు ఆవరణలో బాంబు అమర్చి ఉన్నట్లు ఒక ఈమెయిల్ వచ్చింది. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడినా యూనివర్సిటీ సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సైబరాబాద్ పోలీసులు బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్స్‌తో కలిసి క్యాంపస్ మొత్తం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని విభాగాలు తరగతి గదులు, పరిపాలన భవనం, హాస్టల్ ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అంతేకాకుండా ముందస్తు జాగ్రత్తగా విద్యార్థులను సిబ్బందిని భవనాల నుండి కాళీ చేయించి సురక్షి త ప్రాంతాలకు తరలించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన గురవు తున్నారు. పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు సైతం ఆందోళనకు గురయ్యారు. క్యాంపస్ ఆవరణలో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి తనిఖీలు నిర్వహించడంతో ఇది కేవలం ఆకతాయిల పనేనా లేక దీని వెనుక ఏదైనా కుట్ర దాగి ఉందా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.




జెఎన్‌టియు వద్ద బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్స్‌తో సిబ్బంది

## హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన వాంటెడ్ డ్రగ్స్‌స్మగ్లర్లు

### యాప్‌లు, సోషల్ మీడియాలో కోడ్ భాషలో ఆర్డర్ల స్వీకరణ

### కొరియర్ల ద్వారా సరఫరా.. రూ.63.65 లక్షల డ్రగ్స్ జప్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** ఎపి, ఒడిశాతో పాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి పలురకాల డ్రగ్స్‌ను హైదరాబాద్‌లో స్మగ్లింగ్ చేస్తున్న ఐదుగురు వాంటెడ్ డ్రగ్స్ స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ స్మగ్లింగ్ కోసం వీరు యాప్‌లతో పాటు సోషల్ మీడియాలో కోడ్ భాషల్లో ఆర్డర్లు తీసుకుని ఆనక కొరియర్ కంపెనీల ద్వారా సరుకును పంపేవారు. వీరి వద్ద రూ.63 లక్షల 65 వేల 500 విలువ చేసే పలు రకాల మాదకద్రవ్యాలను, ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. మొదటి ముఠాలో శివార్లలోని బాలానగర్‌కు చెందిన నిఖిల్ యాదవ్ అలియాస్‌సాయి (18) పాత డ్రగ్స్ స్మగ్లర్ ఎపికి చెందిన ఆదిత్య అనే



స్మగ్లర్ల వద్ద పట్టుబడిన మాదకద్రవ్యాలను మీడియాకు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

మరో స్మగ్లర్ నుంచి ఎండిఎంఎతో పాటు మరికొన్ని రకాల మాదకద్రవ్యాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని గ్రేటర్ పరిధిలో వినియోగదారులకు అమ్మేవాడు. ఇతనిపై సనత్‌నగర్, జీడిమెట్ల పోలీసు స్టేషన్లలో మాదకద్రవ్యాల అమ్మకాలకు సంబంధించిన కేసులున్నాయి. ఈ రెండు చోట్ల ఇతను పరారీలో వున్నాడు. ఇతనిపై నిఘా వుంచగా సోమవారం రాత్రి చిలకలగూడ పరిధిలో పట్టుబడ్డాడు. ఇతని వద్ద 115 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్ పట్టు బడింది. దీన విలువ 11 లక్షల 50 వేల రూపాయలు. ఇతనికి డ్రగ్స్ సరఫరా చేసిన ఆదిత్యతో పాటు ఇతని వద్ద వీటిని కొన్న వారి కోసం గాలిస్తు న్నారు. రెండవ ఘటనలో సనత్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరు డ్రగ్స్ స్మగ్లర్లు పట్టుబడ్డారు. శ్రీకాకుళం సంతబొమ్మాళికి చెందిన సింహాచలం అలియాస్ సాయి అలిమాస్ సైబు (28) శివార్లలోని సురారంలో కొంతకాలంగా వుంటూ రవాణా రంగంలో కార్మికుడుగా పనిచేసి తర్వాత స్మగ్లర్‌గా అవతారం ఎత్తాడు. ఈ క్రమంలో లాభాలు రావడంతో కూకట్‌పల్లికి చెందిన వేణు (23) అనే మరో యువకుడిని తనతోపాటు కలుపుకుని దందాను విస్తరించాడు. ఎపిలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి హాష్ ఆయిల్‌ను అక్కడి స్మగ్లర్ల నుంచి తక్కువ ధరకు కొని దానిని ఇక్కడ అధిక ధరకు అమ్మసాగాడు. సింహాచలం వద్ద వేణుతో పాటు మరికొందరు సహాయకులు వున్నారు. ఈ ముఠా నెట్‌వర్క్‌పై నిఘా వుంచగా సోమవారం రాత్రి సింహాచలం, వేణు దొరికిపోయారు.

వీరి వద్ద 1005 గ్రాముల హాష్ ఆ యిల్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. పట్టుబడ్డ హాష్ ఆయిల్ విలువ 12 లక్షల 75 వేల రూపాయలుగా తేలింది. ఈ ముఠాలో వున్న మిగతా వారితో పాటు వీరి వద్ద డ్రగ్స్ కొనే వారి కోసం గాలిస్తున్నారు. మూడవ ఘటనలో అబ్దుల్లాపూర్ మెట్‌కు చెందిన అక్షయ్ పటేల్ (35) అనే ప్రైవేటు ఉద్యోగి, వ్యాపారిగా వున్న బబ్బూరి ఆదిత్యవర్దన్ (25)లు పట్టుబడ్డారు. వీరి వద్ద ఎక్స్‌టేసి అనే సింథటిక్ డ్రగ్ 363 గ్రాములు, 41 గ్రాముల హైబ్రీడ్ గంజాయి, 0.12 గ్రామల నాలుగు బ్లాట్ల ఎల్ఎస్‌డి డ్రగ్ పట్టుబడింది. ఈ ఆపరేషన్‌లో నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పోలీసులు కీలకంగా వ్యవహరించారని, ఇందుకు వారిని అభినందిస్తున్న ట్లు ఆయన తెలిపారు.

## అగ్రికల్చర్ వర్సిటీలో ఎసిబి అధికారులు దాడులు

### లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన అసోసియేట్ డీన్ గోవర్ధన్

**హైదరాబాద్ (అత్తాపూర్) ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** ఫెర్టిలైజర్, సీడ్ కంపెనీ ఏర్పాటుకు లైసెన్స్ కోసం లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ మంతటి గోవర్ధన్ ఏసీబీ అధికారులు పట్టుకున్న సంఘటన మంగళవారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏసిబి డీఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం..ఒక వ్యక్తి ఫెర్టిలైజర్ సీడ్ కంపెనీ పెట్టడానికి గత సంవత్సరం మార్చి 2025 లో లైసెన్స్ కోసం ఆన్లైన్లో అప్లై చేసుకున్నాడు. అయితే చాలా నెలలు అవుతున్న అతనికి లైసెన్స్ రాకపోవడంతో రాజేందర్‌నగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలోని అసోసియేషన్ డీన్ మంతటి గోవర్ధన్ కలిశాడు. అయితే 1,25,000 ఇస్తే లైసెన్స్ ఇప్పిస్తానని గోవర్ధన్ అతనికి చెప్పడంతో అతను 25 వేల రూపాయలు యూపీఐ పేమెంట్ చేశాడు. దీంతో అతనికి కొద్ది రోజుల క్రితం లైసెన్స్ వచ్చింది. అయితే గోవర్ధన్ మిగతా లక్ష రూపాయల కోసం ఫోన్ చేసి వేధిస్తున్నాడు. ఫిర్యాదుదారుడు దగ్గర లక్ష రూపాయలు లేకపోవడంతో అతడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు మంగళవారం సాయంత్రం ఫిర్యాదుదారునికి లక్ష రూపాయలు ఇచ్చి యూనివర్సిటీలోని గోవర్ధన్ చాంబర్‌కు పంపించారు. అక్కడ ఫిర్యాదు దారుడు గోవర్ధన్‌కి లక్ష రూపాయలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అదేవిధంగా అతని ఇంట్లో కార్యాలయంలో ఏసీబీ అధికారు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అతని నాంపల్లి లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

## మీ పాలనలో కబ్జాలను విముక్తి చేయడానికి 'హైడ్రా'

### పిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ ధ్వజం

**హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:** మీ పాలనలో కబ్జాలను విముక్తి చేయడానికి 'హైడ్రా' అంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హారీష్‌రావుపై టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గాంధీ భవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలపై గన్‌పార్క్ వస్తే మాట్లాడుకుందాం రండి అంటూ ఆహ్వానించారు. కవిత చేసిన ఆరోపణలపై నేటికి మీ వద్ద సమాధానంలేదని సిఎం, మంత్రులపై చిల్లర మాటలతో విమర్శలు మానుకోవాలని అన్నారు. మళ్లీ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తోంది సందేహం లేదని అని ఆయన అన్నారు.

## నేటి నుంచి ఎస్ఎ-2 పరీక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్ఎ)-2 పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మొదట ప్రకటించినట్టుగా ఈ నెల 10 నుంచి ప్రారంభం కావల్సి ఉన్న ఎస్ఎ-2 పరీక్షలను నేటి నుంచి ప్రారంభించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) పరీక్షల నేపథ్యంలో గతంలో ప్రకటించినట్టుగా ఎస్ఎ-2 పరీక్షలను ఈ నెల 10 నుంచి 20 వరకు కాకుండా.. ఈ నెల 8 నుంచే ప్రారంభించి 18 వరకు కొనసాగించనున్నారు. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 11.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇక 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్ఎ-2 పరీక్షలు నిర్వహించనున్నారు.

# సమాచార సమగ్రత పరిరక్షకులు ఐఐఎస్ అధికారులు

## 2009, 2023, 2024 ఐఐఎస్ ట్రైనీ అధికారులతో బండి సంజయ్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్7:** దేశ భద్రత, సంక్షోభ సమయాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించే శక్తులను కుట్రలను తిప్పికొట్టేందుకు సమయోచిత, వాస్తవిక, బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) అధికారుల పాత్ర చాలా కీలకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఐఐఎస్ అధికారులు సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాదని, సమాచార సమగ్రతకు(ఇన్ఫర్మేషన్ ఇంటెగ్రిటీ), జాతీయ ఐక్యత పరిరక్షకులుగా నిలవాలని సూచించారు. యుద్ధం చేయకుండా సమాచార వ్యాప్తి ద్వారా శత్రువులను మనసులను ప్రభావితం చేయడంలో టీవీ, రేడియో సహా మీడియా సైకలాజికల్ ఆపరేషన్స్ నిర్వహిస్తూ ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. బలాన్ని కాకుండా మేధస్సును ఉపయోగించి చేసే సమాచార యుద్ధంలో ఐఐఎస్ అధికారులు అగ్రభాగాన నిలవాలని కోరారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) 2009, 2023, 2024 బ్యాచ్ లకు చెందిన గ్రూప్ ఏ ట్రైనీ అధికారులు ఈనెల 15 నుండి 22 వరకు అంతర్గత భద్రత, సంక్షోభ, విపత్తు కమ్యూనికేషన్, సైకాలజికల్ ఆపరేషన్స్ పై అవగాహన పెంపొందించుకునేందుకు ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు సాయంత్రం ఢిల్లీలోని కర్తవ్య భవన్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఆయా ట్రైనీ అధికారులు మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా అధికారుల విద్య, కుటుంబ నేపథ్య వివరాలను అడిగి తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ లోకి రావడానికి కారణాలపైనా ఆరా తీశారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయా? లేదా? అట్టడుగునున్న అణగారిని వ్యక్తుల వరకు సంపూర్ణంగా సంక్షేమ ఫలాలు అందాలంటే ఏం చేస్తే బాగుంటుందనే అంశాలపైనా ఆరా తీశారు. ముఖ్యంగా నేటి పరిస్థితుల్లో సేవలు ఎలా మారుతున్నాయి? భవిష్యత్తులో ఎలా ఉండబోతుందనే అంశాలతోపాటు మారుమూల గ్రామాలకు సైతం సమాచారం చేరేలా కమ్యూనికేషన్ బలపడేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా వారితో చర్చించారు. అనంతరం వారిని ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడుతూ... వేగంగా మారుతున్న సమాచార ప్రపంచంలో సమర్ధవంతమైన కమ్యూనికేషన్ కేవలం పరిపాలనా సాధనం మాత్రమే కాదని, జాతీయ స్థిరత్వానికి, ప్రజల విశ్వాసానికి మూలస్థంభమని చెప్పారు. ఈ విషయంలో ఐఐఎస్ అధికారుల పాత్ర కీలకమని తెలిపారు. ముఖ్యంగా అంతర్గత భద్రతకు సంబంధించిన విషయానికొస్తే...మీడియా, సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించే ఫేక్ సమాచారం సవాల్ విసురుతున్న నేటి తరుణంలో వాటిని అధిగమిస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు ఏం చేయాలనే దానిపై ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్స్, సెంట్రల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్ అందించే ప్రత్యేక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మధ్యవర్తిగా పనిచేసేలా సిద్ధం కావాలని సూచించారు. దేశం మీమీద ఆశలు పెట్టుకుంది. మీరు కేవలం సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాదు. సమాచార సమగ్రతకు(ఇన్ఫర్మేషన్ ఇంటెగ్రిటీ), జాతీయ ఐక్యత పరిరక్షకులుగా నిలవాల్శిఅని సూచించారు. దేశ భద్రత, సంక్షోభ సమయాల్లో తప్పుడు సమాచారాన్ని పంపుతూ గందరగోళం సృష్టించే శక్తులను కుట్రలను తిప్పికొట్టేందుకు సమయోచిత, వాస్తవిక, బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఐఐఎస్ అధికారుల పాత్ర చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అంద్ర వంశీ, కేంద్ర హోంశాఖ మీడియా విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ రాజ్ కుమార్, ఐఐఎస్ విభాగం కోర్సు డైరెక్టర్ రష్మీ రోజా తుషార నాయర్ తదితరులు పాల్గొన్నారు.



## పశ్చిమాసియా సంక్షోభం అధిగమించేందుకు.. ఎంఎస్ఎంఇ రంగం కోసం రూ.2.5 లక్షలకోట్లతో క్రెడిట్‌గ్యారంటీ స్కీం

### త్వరలోనే కేబినెట్‌పరిశీలనకు వస్తున్న స్కీం ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** పశ్చిమాసియా సంక్షోభంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్ని రంగాలకు కేంద్ర ప్రభుత్వం చేయూతనిచ్చేందుకుగాను రూ.2.5 లక్షలకోట్లుతో క్రెడిట్ గ్యారంటీ స్కీంను అమలుకు తెస్తోంది. ఎంఎస్ఎంఇ రంగంలోని అన్ని సెక్టార్లకు ఈస్కీంను వర్తింపచేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నడుస్తున్న అత్యవసర రుణగ్యారంటీ స్కీంకు విస్తరణగా ఈ స్కీం అమలవుతుంది.ప్రస్తుతం ఇసిజిఎల్ఎస్ ఫ్రేమ్‌వర్క్‌లోనే ఈస్కీంకూడా ఉంటుందని కేంద్రం చెపుతోంది. ఈ స్కీంను కొవిడ్ కాలంలో చిన్న పరిశ్రమలను ఆదుకునేందుకు ఈసీజిఎల్ఎస్‌ను అమలుకు తెచ్చింది. ఈ స్కీంకింద ఎంఎస్ఎంఇ పరిశ్రమలకు 90శాం రుణహామీ ఇస్తుంది. ఇందుకు నేషనల్ క్రెడిట్ గ్యారంటీ ట్రస్టీ కంపెనీ హామీదారుగా ఉంటుంది. బ్యాంకర్లు ఇచ్చిన రుణాల్లో రుణగ్రహీత బకాయిపడితే ఆమొత్తాన్ని ప్రభుత్వం బ్యాంకరుకు భర్తీచేస్తుంది. అదనంగా ఈ స్కీంను కేవలం నాలుగేళ్ల కాలానికి మాత్రమే పరిమితంచేస్తారు. అన్నిరంగాలు, వాటిలోని ఉపరంగాలకు కూడా ఈ స్కీంను వర్తింపచేస్తారు. ఈ స్కీం వివరాలను కేబినెట్ ఆమోదంకోసం పంపించారు.రానున్న రోజుల్లోనే ఈ కొత్త స్కీం ఆమోదం పొంది అమలుకువస్తుందని అంచనా. ఎంఎస్ఎంఇతోపాటే ఏవియేషన్, ఇతరత్రా నగదు కొరత సమస్యను ఎదుర్కొంటున్న అన్ని రంగాలకు వర్తింపచేస్తారు. పశ్చిమాసియా యుద్ధకాలంలో ప్రత్యేకించి వైమానికరంగం నష్టాలను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ కొనసాగిన ఇసిజిఎల్ఎస్ స్కీంలో రుణగ్రహీత అదనపు సెక్యూరిటీ ఏమి చూపించనవసరం లేకపోయింది. అందుబాటులో ఈరుణం పొందేందుకు వడ్డీరేట్లు కూడా 9.25శాతంగా మాత్రమే కేంద్రం ప్రకటించింది. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు అయితే 14శాతంగా నిర్ణయించింది.

రుణం పొందిన తర్వాత ప్రిన్సిపల్‌మొత్తంపై ఒక ఏడాదిపాటు మారటోరియం కూడా ఉంటుంది. ఈకాలంలో కేవలం వడ్డీచెల్లిస్తే సరిపోతుంది. ఆర్ధికసేవల విభాగం అంచనాప్రకారం సుమారు 1.19 కోట్ల గ్యారంటీలు ఇప్పటివరకూ ఈసీజిఎల్ఎస్ స్కీం కింద జారీచేసారు. వీటిలో ఎంఎస్ఎంఇలకు 1.13 కోట్లు జారీ అయ్యాయి.

కష్టసమయాల్లోను, అనుకోని విపత్కరపరిస్థితుల్లో చిన్నపరిశ్రమలను ఆదుకునేందుకుగాను ఇసిజిఎల్ఎస్ స్కీం ఎంతోప్రయోజనకారిగా ఉంటుంది.

# కల్తీ కల్లును అరికట్టండి

### కూకట్‌పల్లి, బాలానాగర్ కల్తీకల్లు బాధితులకు న్యాయం చేయాలి

### కేసు విచారణ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోండి

### - సిఎం రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వినతి

**హైదరాబాద్, ఎప్రిల్ 7, ప్రభాతవార్త:** గత ఏడాది జూలైలో కూకట్‌పల్లి, బాలానగర్ ప్రాంతాల్లో కల్తీ కల్లు సేవించి14 మంది మృతిచెందిన కేసులో దర్యాప్తు నత్తనడకన సాగుతోందని, ఎక్సైజ్‌శాఖ 13మందిపై కేసులు నమోదు చేసినా ఇప్పటి వరకు ఛార్జ్‌షిట్ దాఖలు చేయలేదని ఫోరంఫర్ గుడ్‌గవర్నెన్స్ ఆక్షేపించింది. ఈ విషయమై ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో దాదాపు 100 మంది ఆసుపత్రిలో చేరారని గుర్తు చేశారు. కేవలం రికార్డు కోసం కొంతమందిని అరెస్ట్ చేసినప్పటికీ చార్జ్‌షీట్లు దాఖలు చేయకపోవడంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు బెయిల్‌పై విడుదలయ్యారని పేర్కొన్నారు. కల్లును సాధారణంగా సమాజంలోని బలహీన వర్గాల వారు సేవిస్తారని, స్వచ్ఛమైన కల్లు అందుబాటులో లేకపోవడంతో కొంతమంది కల్లు విక్రేతలు క్లోరల్ హైడ్రేట్, డయాజెపామ్, ఆల్ప్రాజోలామ్ వంటి హానికర పదార్థాలను కలిపి కల్తీ కల్లు తయారు చేస్తున్నారని లేఖలో సిఎం దృష్టికి తెచ్చారు. నాటి ఘటనలో మరణించిన 14 మంది, ఆసుపత్రిలో చేరిన దాదాపు 100 మంది లైసెన్సు పొందిన కల్లు విక్రేతల వద్ద నుండి కొనుగోలు చేసిన కల్లును సేవించారని స్పష్టం చేశారు. మరణించిన వారంతా బలహీన వర్గాలకు చెందినవారు కావడంతో ఈ కేసులను పట్టించుకోకుండా నిందితులను రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసులో నిందితుల పేర్లు, అరెస్టుల వివరాలు ఇవ్వడానికి ఎక్సైజ్‌శాఖ నిరాకరిస్తోందని, మొత్తం వ్యవహారాన్ని గోప్యంగా ఉంచుతోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో తక్షణమే స్పందించి మరణించిన వారి కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని, ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిని శారీరక పని చేయలేని స్థితికి చేరిన వారికి పరిహారం ఇవ్వాలని, నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, 50 కి.మీ పరిధిలో కల్లు తీయగల చెట్లు లేని ప్రాంతాల్లో కల్లు దుకాణాలు ఉండకుండా ఎక్సైజ్ విధానాన్ని రూపొందించాలని సిఎంను ఆయన కోరారు. డ్రగ్స్ దుష్ప్రరిణామాలపై అవగాహన కల్పిస్తున్నట్టుగానే కల్తీ కల్లు సేవించడం వల్ల కలిగే ప్రమాదాలపై పెద్ద స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.



## రాకెట్ దాడిలో ఇద్దరుచిన్నారులు మృతి, తల్లికి తీవ్రగాయాలు

### మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఉద్రిక్తతలు

**ఇంపాల్, ఏప్రిల్ 7:** ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మరోసారి హింసాత్మకంగా మారింది. గుర్తు తెలియని దుండగులు జరిపిన రాకెట్ దాడి కారణంగా ఇద్దరు చిన్నారులు మరణించగా, వారి తల్లి గాయపడింది. ఈ ఘటనతో బిష్ణాపూర్ జిల్లాలో ఆందోళనలు చెలరేగాయి. ఈ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో అధికారులు ఇంటర్నెట్ బంద్ చేశారు. పలు చోట్ల కర్ఫ్యూ విధించారు. మణిపూర్‌లో కొన్నేళ్లుగా మైతీ, కుకీ తెగల మధ్య ఘర్షణ ఉన్న సంగతి తెలిసిందే. గతంలో ఘర్షణలు జరిగిన ప్రాంతాల్లో బిష్ణాపూర్ జిల్లా కూడా ఒకటి. ఈ జిల్లాలోని మోయిరంగ్ ప్రాంతంలోని ట్రోంగ్లాబి అవాంగ్ లైకై అనే గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత ఒక ఇంటిపై కొందరు దుండుగులు రాకెట్ దాడి చేశారు. ఈ దాడిలో ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలు మరణించారు. వారి తల్లి గాయపడ్డారు. మృతుల్లో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల పాప ఉంది. ఈ దాడి ఘటనతో మరోసారి ఈ ప్రాంతంలో ఉద్రిక్తత తలెత్తింది. స్థానికులు భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. దగ్గర్లోని ఆయిల్ ట్యాంకులు, ట్రక్కులు తగలబెట్టారు. ఆస్తులు ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు, భద్రతా దళాలు అక్కడికి చేరుకుని శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో 19 వరకు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘర్షణలు మరింత చెలరేగకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తప్పుడు సమాచారం వ్యాపించకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా బిష్ణాపూర్‌తోపాటు మరో నాలుగు జిల్లాల్లో ఇంటర్నెట్ బంద్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఈ ఘటనను మణిపూర్ సీఎం వై ఖేంచంద్ సింగ్ ఖండించారు. ఇంటిపై రాకెట్‌తో దాడి చేయడాన్ని తీవ్రవాద చర్యగా అభివర్ణించారు. మరోవైపు కుకీ తెగల వాళ్లే ఈ దాడి చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# 30 నెలలు వేచి చూశాం.. ఇక ఉపేక్షించం

**న- మొత్తం పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందే - మే 5న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు.. - తెలంగాణ ఉద్యోగ జెఎసి నిర్ణయం**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 07:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వంపై ఉద్యమించడానికి సిద్ధమయ్యారు. 30 నెలలుగా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎదురు చూశామని కానీ ఇప్పటి వరకు కూడా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని.. ఇకపై ఉపేక్షించేది లేదని మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమైన తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ నిర్ణయించింది. ఈ నెల 17న మండల కేంద్రాల్లో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు చేయాలని, తహసీల్దార్లకు మెమోరాండంలు ఇవ్వాలని టీజీఈజేఏసీ నిర్ణయించింది. మే 5న జిల్లా కేంద్రాల్లో సామూహిక నిరాహారదీక్షలు చేయాలని తీర్మానించింది. మే 14న జెఎసి సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను ప్రకటించాలని నిర్ణయించింది. తాము ప్రభుత్వం ముందుంచిన 57 డిమాండ్లలో ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని ఈ నేపథ్యంలో ఇక ఉపేక్షించేది లేదని నిర్ణయించినట్టు జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సమావేశం జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లోని రెవిన్యూభవన్‌లో జరిగింది. సమావేశం అనంతరం జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడారు. 30 నెలలుగా ప్రభుత్వం పీఆర్‌సీ నివేదికను తెప్పించుకోకుండా కాలక్షేపం చేస్తుందని మండిపడ్డారు. 30 నెలలుగా పీఆర్‌సీ అమలు చేయకపోగా.. ఇప్పుడు పీఆర్‌సీ గడువును పొడిగించాలనే ఆలోచన చేస్తుండటం సరైంది కాదన్నారు. 30 నెలలుగా తమ సమస్యలపై ముఖ్యమంత్రితోపాటు, ఉప ముఖ్యమంత్రితోనూ, ఇతర మంత్రులతోనూ పలుసందర్భాల్లో చర్చించినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుకు నిరసన తెలియజేయాలని నిర్ణయించి తెలిపారు. పక్కరాష్ట్రమైన ఏపీలో ఉద్యోగుల ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదని.. అలాగే రాష్ట్రంలోనూ మొత్తం పెండింగ్ బిల్లులను చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆరు ప్రధాన డిమాండ్లను ఏకగ్రీవంగా ఆమోదించినట్టు తెలిపారు. 2 వ పీఆర్‌సీ కమిషన్ రిపోర్ట్ తెప్పించి జూన్ 2 లోపు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 51 శాతం ఫిట్ మెంటుతో పీఆర్‌సీని అమలు చేయాలని, పీఆర్‌సీ కాలాన్ని ఎట్టి పరిస్థితుల్లో పొడిగించొద్దని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం ఇటీవల పెండింగ్ బిల్లులపై రూ. 700 కోట్లు విడుదల చేసినప్పటికీ, వాస్తవ అవసరం రూ. 1,500 కోట్లుపైగా ఉందని, రాష్ట్రంలో నెలకు సగటున 600 మంది ఉద్యోగులు రిటైర్ అవుతుండటంతో బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయన్నారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డులపై మంత్రివర్గ ఉపకమిటి ఇప్పటికే నిర్ణయం తీసుకుందని దానిని వెంటనే అమలు చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పలుమార్లు జేఏసీ నేతలతో జరిపిన సమావేశాలలో చెబుతున్నప్పటికీ అమలు కావడంలేదన్నారు. ఈహెచ్ఎస్ స్కీం విధి విధానాలను వెంటనే అమలుచేసి, మే 1 వ తేది నుండి ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య సేవలు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూషన్ పెన్షన్(సీపీఎస్)ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీం(ఓపిఎస్)ను పునరుద్ధరణ చేయాలన్నారు. సెప్టెంబర్ 1, 2004 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ స్కీం(ఓపీఎస్)ను పునరుద్ధరణ చేయాలని సమావేశంలో తీర్మానించినట్టు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు చేపట్టాలని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని త్వరితగతిన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా శాఖ కార్యదర్శితో ఉపాధ్యాయ సంఘాల కొఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆకునూరి మురళీ పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల కలెక్టర్లు ఉద్యోగుల పట్ల నిరక్ష య

## పట్టపగలు తనిఖీ పేరుతో బంగారం షాపులో లూటీ

### బంగారం వ్యాపారికి బేడీలు వేసి ఉడాయించిన దొంగలు

### కిలో బంగారు ఆభరణాలు అపహరణ

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన క్రైమ్ ఎఎస్పీ శ్రీనివాసరావు

**పలాస, ఏప్రిల్ 7:** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నిత్యం రద్దీగా ఉండే కాశీ బుగ్గ నిత్యానంద నగర్ లో ఉన్న శ్రీ వెంకటేశ్వర జ్యుయలరీ దుకాణంలో మంగళవారం చోరీ జరిగింది. రూ. 1.65 కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలను ముఠా దొంగలు దోచుకున్నారు. బంగారు యజమానికు బేడీలు వేసి లాకర్, దుకాణంలో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించారు. బంగారు యజమాని, కాశీబుగ్గ పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కాశీబుగ్గ నిత్యానంద నగర్ లో శ్రీ వెంకటేశ్వర బంగారం దుకాణం ఉంది. కిల్లంశెట్టి రామకృష్ణరావు కొద్ది సంవత్సరాలుగా జూయలరీస్ షాపును నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పోలీసు పేరుతో ఉన్న బనియన్లు వేసుకొని ఇద్దరు వ్యక్తులు షాపులోకి ముందుగా వెళ్లారు. అనంతరం వారి వెంట మరో ముగ్గురు వ్యక్తులు వెళ్లి రామకృ షారావు చేతికి బేడీలు వేసి పోలీసులుగా నమ్మకం కలిగించారు. అనంతరం మరో వ్యక్తి లోపలకు ప్రవేశించి ముఖంపై ముష్టిఘాతాలు కురిపిస్తు తుపాకీ తీసి బెదిరించాడు. అనంతరం బంగారు ఆభరణాలు దొంగిలించడంతో పాటు ఆయనపై ఉన్న బంగారు ఆభరణాలు సైతం దోపిడీ చేసి పరారీ అయ్యారు. సుమారు రూ. 1.65 కోట్లు విలువ చేసే ఆభరణాలు దొంగతనం జరిగినట్లు షాప్ యజమాని చెబుతున్నాడు. ఈ దోపిడీలో ఎనిమిది మంది ఉన్నట్లు తెలుస్తోంది. దొంగల చిత్రాలు సిసి కెమేరాల్లో నిర్లిప్తమయ్యాయి అయితే ముఖాలకు మాస్కులు వేసుకోవడంతో వారు ఏ ప్రాంతానికి చెందిన వారో తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఈ విషయం ఒక్కసారిగా పట్టణమంతా వ్యాపించగా విషయం తెలుసుకున్న కాశీబుగ్గ సిఐ వై రామకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జరిగిన ఘటనను సిఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళారు. దీంతో జిల్లా క్రైమ్ ఎఎస్పీ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించగా క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ టీంలు పరిశీలించాయి. దుకాణానికి దొంగల ముఠా నాలుగు ద్విచక్రవాహనాలు, ఒక కారులో వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాల్లో నిర్లిప మై న దొంగలను గుర్తించారు. మొత్తం నాలుగు బృందాలు నియమించి దొంగల కోసం వెతుకుతున్నామని జిల్లా ఎఎస్పీ పి. శ్రీనివాసరావు విలేకర్లకు తెలిపారు. కొద్ది రోజుల్లోనే దొంగలను పట్టుకోవడం జరుగుతుందని ఎఎస్పి విలేకర్లకు తెలిపారు. దొంగల కోసం మొత్తం నాలుగు పోలీసు బృందాలు ఏర్పాటు. చేసారు. క్లూస్ బృందాలు, క్రైమ్ బృందాలు, డాగ్కొంట్లు రంగంలో దిగి మొత్తం వ్యవహారంను పరిశీలించాయి. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.



## అమరావతిలో ఎన్ఎఫ్‌డీబి ప్రాంతీయ కార్యాలయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ - మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,, ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు (వినీదీతీ) ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయబట్టే ఎన్ఎఫ్‌డీబీ ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో ప్రముఖ ఆక్వాకల్చర్ రాష్ట్రంగా ఉండటంతో అమరావతిలో పూర్తి స్థాయి ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన భూమి, ప్రాథమిక మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లేఖ ద్వారా తెలియజేశారని మంత్రి వెల్లడించారు. దేశంలో ఆక్వాకల్చర్ రంగంలో అగ్రగామి రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌కు ఇది కీలక ముందడుగు అని, రాష్ట్ర మత్స్యరంగ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారనుందని తెలిపారు.

# రాష్ట్రంలో విద్యుత్‌కు భారీ డిమాండ్

### - వచ్చే ఏడేళ్లలో 58.71 శాతానికి పెరుగుదల
### - తెలంగాణ అవసరాల్లో హైదరాబాద్‌దే అగ్రస్థానం
### - 2029-30కు 12726 మిలియన్ యూనిట్ల అవసరాలు
### - సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నివేదిక వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** తెలంగాణలో ఇంధన వినియోగం భారీగా పెరుగుతోంది. తెలంగాణ ఇంధన వినియోగంలో 2031-32 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణ ఇంధన వినియోగంలో 58.71 శాతానికి పైగా వృద్ధిని సాధించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇఎ) తాజా నివేదికలో అంచనా వేసింది. ముఖ్యంగా ఎల్‌టి, హెచ్‌టి విద్యుత్ కనెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తోంది. మరోపక్క దేశంలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్ ఉన్న ప్రధాన నగరాల జాబితాలో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని మొత్తం ఇంధన అవసరాల్లో హైదరాబాద్‌కు 30 శాతానికి పైగా ఉండటం విశేషం. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల సామర్థ్యం, బహుళ పరిశ్రమల అభివృద్ధి పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ కనెక్షకు డిమాండ్ పెరిగింది. ఇందులో భాగంగా విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ఎస్పీడీసీఎల్ పరిధిలో 15 శాతం, ఎన్పీడీసీఎల్ పరిధిలో 6 శాతం పెరుగుదల నమోదైంది. ఒక్క ఎస్పీడీసీఎల్ పరిధిలో ప్రతీ నెలా దాదాపు 37 వేల చొప్పున ఏటా 4 లక్షలకు పైగా కొత్త విద్యుత్ కనెక్షన్లు మంజూరవుతున్నట్లు ఎస్పీడీసీఎల్ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ గృహ విద్యుత్ కనెక్షన్లతో పాటు, పరిశ్రమలకు హెచ్‌టి కనెక్షన్లు క్రమంగా పెరగడం విశేషం. 2020-22 సంవత్సరాల మధ్య విద్యుత్ కనెక్షన్లు ఏటా 7 నుండి 8 శాతం పెరగ్గా, 2025-26 సంవత్సరం నాటికి ఇది రెండింతలు పెరిగి 17 శాతానికి చేరుకుంది. హైదరాబాద్ ఫార్మా సిటీ ప్రాజెక్టుతో రాబోయే 5 నుండి 10 ఏళ్లలో 1000 మెగావాట్ల అదనపు డిమాండ్‌కు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. కాగా గత కొన్నేళ్లుగా దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా ఉంది. ముఖ్యంగా ఐటీ కారిడార్ నగరం అంతటా వ్యాపించడంతో దేశ వ్యాప్తంగా ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ భారీగా తరలివస్తోంది. తద్వారా హైదరాబాద్‌లో విద్యుత్ డిమాండ్ పెరుగుదలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో దేశంలో అత్యధిక విద్యుత్ డిమాండ్ ఉన్న ప్రధాన నగరాల జాబితాలో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉన్నట్లు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ తాజా నివేదిక వెల్లడించింది. ఇక హైదరాబాద్ మహానగరం యొక్క ఇంధన అవసరాలు రాబోయే 6 ఏళ్లలో 6.6 శాతం చొప్పున సమ్మేళన వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్) కలిగి ఉంటుందని అంచనా. దీని అవసరాన్ని 2026-27 సంవత్సరం నాటికి 33000 మిలియన్ యూనిట్ల కంటే ఎక్కువగా పెరుగుదల ఉండబోతోంది.

## తిరుమలలో వాహన భద్రతపై అవగాహన కార్యక్రమం

**తిరుమల,ఏప్రిల్ 7ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలలో వేసవి సెలవులకు ముందే భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాహన భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, తిరుమల ట్రాఫిక్ పోలీసులు వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుమలలోని పుష్పగిరి మఠంలో ఈ కార్యక్రమం మంగళవారం ఉదయం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో వాహనాలలో అగ్ని ప్రమాదాలు (ఫైర్ యాక్సిడెంట్స్) జరగకుండా తీసుకోవలసిన ముఖ్యమైన జాగ్రత్తలను డ్రైవర్లకు వివరించారు. ముఖ్యంగా వాహనాల ఎలక్ట్రికల్ సిస్టమ్‌ను సకాలంలో తనిఖీ చేయడం, ఇంధన లీకేజీలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సరిచేయించడం, అధిక వేడి కారణంగా మంటలు చెలరేగే అవకాశాలను గుర్తించడం వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. అలాగే ప్రతి వాహనంలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ తప్పనిసరిగా ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రాక్టికల్‌గా వివరణ ఇచ్చారు. డ్రైవర్లు తమ వాహనాలను శుభ్రంగా, సక్రమంగా నిర్వహించుకోవడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐహరిప్రసాద్, ఎంవిఐ శ్రీనివాసులు, సెక్టార్ ఇన్‌చార్జీలు శివకుమార్ రెడ్డి, కృష్ణయ్య, 2టౌన్ సీఐ రాముడు పాల్గొన్నారు.

## దేశంలోనే ఆదర్శంగా ఎపి అగ్నిమాపక శాఖ

### అధునాతన ఫైర్ టెండర్ వాహనాలను ప్రారంభించిన సిఎం

**గుంటూరు ఏప్రిల్ 7 ప్రభాత వార్త ప్రతినిధి :** దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక , విపత్తుల నిర్వహణ శాఖను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సహాయం చేసిన చరిత్ర ఏపీకి ఉందని గుర్తు చేశారు. అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో అగ్నిమాపక శాఖ నూతన వాహనాలు, పరికరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. రూ.252.93 కోట్లతో అగ్నిమాపక శాఖ ఆధునీకరణలో భాగంగా రూ.33.25 కోట్ల విలువైన వాహనాలు, వివిధ పరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రూ.18 కోట్ల వ్యయంతో తొలిదశలో 25 అధునాతన అగ్నిమాపక శకటాలు, రూ.10 కోట్లతో హై ప్రెషర్ పంప్‌లు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ.2.49 కోట్లతో 50 ఇన్ ఫ్లేటబుల్ రబ్బర్ బోట్లు, రూ.2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడడానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అమరావతి రాజధానితో పాటు ఇప్పుడు ప్రధాన నగరాల్లో హై రైజ్డ్ బిల్డింగ్‌లు నిర్మాణం అవుతున్నాయని..వాటికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ అన్ని విధాలా ఆధునిక పరికరాలు సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. అన్ని సవాళ్లను అధిగమించి కేంద్ర పథకాలను, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని అగ్నిమాపక శాఖను బలోపేతం చేయాలని సూచించారు.

## ఆంధ్ర తీరంలో తమిళనాడు బోట్ల ఆగడాలు :రాష్ట్ర బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్

**విజయవాడ,ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతమైన నెల్లూరు, ఒంగోలు, బాపట్ల జిల్లాల్లో తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారుల ఆగడాలు పెరుగుతున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఆందోళన వ్యక్తం చేశారు. కడలూరు, కారేకల్ ప్రాంతాల నుంచి స్పీడ్ బోట్లలో వచ్చి అక్రమంగా ఆంధ్ర తీరప్రాంతంలోకి ప్రవేశిస్తూ స్థానిక మత్స్యకారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతంలో అక్రమంగా సంచరిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్న తమిళనాడు బోట్లను స్థానిక మత్స్యకారులు నిర్బంధించిన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం స్పందన ఆశించినంతగా లేదని మత్స్య కారులు భావిస్తున్నారు గత వారం నిర్బంధించిన బోట్లను రాత్రికి రాత్రే విడుదల చేసి తమిళనాడుకు పంపించడం అనేక అనుమానాలకు తావిస్తోంది దాడులకు పాల్పడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల స్థానిక మత్స్యకారుల్లో తీవ్ర అభద్రతా భావం నెలకొంది భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సూచనలు: తీరప్రాంత మెరైన్ పోలీస్ స్టేషన్లను ఆధునీకరించి పటిష్టం చేయాలి.

స్థానిక మత్స్యకారులను హోం గార్డులుగా భాగస్వామ్యం చేయాలి. కోస్టల్ గార్డ్ సహాకారంతో మెరైన్ పర్యవేక్షణను బలోపేతం చేయాలి.

## అమరావతి.. మన ఆత్మగౌరవానికి, భవిష్యత్తుకు ప్రతీక :ఎమ్మెల్యే బాలకృష్ణ

**విజయవాడ ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** మన ఆంధ్రప్రదేశ్ రాజధాని అని, ఇవాళ రాష్ట్ర ప్రజలందరికీ ఒక చారిత్రక విజయ క్షణమని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. అమరావతి మన ఆత్మగౌరవానికి , మన భవిష్యత్తుకు ప్రతీక. రాజధాని రైతుల త్యాగానికి, ప్రజల ఆశలకు లభించిన న్యాయం ఇది.మనందరం కలిసి అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుదాం. గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా, రాజధాని చిరకాల స్వప్నాన్ని సాకారం చేయడంలో సహకరించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఈ బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీల సభ్యులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు అని బాలకృష్ణ పేర్కొన్నారు.

# మహిళా రైతులకు ఉపాధి కల్పిస్తూ..



మా తలరాత ఇంతే. ఏమీ చేయలేమని పరిస్థితులకు తలొగ్గుతారు కొందరు. కొందరుంటారు... వాటిని సవాళ్లుగా చూస్తారు. మార్చేందుకు ఎంత పోరాటమైనా చేస్తారు. ఆ రెండో కోవకే చెందుతారు లీలావతి మహాత.

కాబట్టే, 85 ఊళ్ల పాలిట దేవత అయ్యారీమె. పశ్చిమబంగాలోని ఝార్గ్మ కరవుకి మారుపేరు. ఆ ఏర్పాటు చిన్నపల్లె లీలావతిది. 16ఏళ్లకే పెళ్లి. ఇద్దరమ్మాయిలు పుట్టడంతో ఇంటర్లోనే చదువు మానేశారు. అక్కడ వర్షపాతం తక్కువ. దీని నుండి మినహా వేరే పంటలే వేసేవారు కాదు. ఆహారం, ఆర్థిక అవసరాలైనా పక్కనున్న అడవులపైనే ఆధారపడాలి. ఇల్లు గడపడం కోసం కూలిపనులకి వెళ్లేవారిమె. తన కూతుళ్లకే ఇలాంటి జీవితం ఇవ్వడం నచ్చని ఆమె... ఊళ్లో కొంతమంది మహిళలతో స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ రుణం తీసుకుని కొంత భూమి కౌలుకి తీసుకుని, తక్కువ నీటితో కూరగాయలు పండించడంపై ప్రయోగాలు చేశారు. అది ఫలించి లాభం రావడంతో ఆమె పేరు ఆ జిల్లాలో మారుమోగింది. దీంతో ఇతర మహిళలు, రైతులు లీలావతిని అనుసరించడం మొదలుపెట్టారు. కానీ నీటి సమస్యకు దీర్ఘకాల పరిష్కారం కనుక్కోనిదే అసలైన అభివృద్ధి సాధ్యం కాదని భావించారు లీలావతి, మహిళలతో కలిసి నీటి నిల్వలు, వర్షనీటిని సేకరించడానికి చిన్న చిన్న గుంతలు, నీటి నిల్వ ట్యాంకులు సిద్ధం చేయడం ప్రారంభించారు. పెద్ద చెరువు తవ్వితే ఇంకా మంచిదని భావించే పంచాయతీ అధికారుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అయినా ఆమె పోరాటం ఆపలేదు. వాళ్లూ తగ్గక తప్పలేదు. అలా ఆ ఊరికి చెరువొచ్చింది. ఈమె గురించి తెలిసి ప్రధాన్ అనే ఎన్జీఓ తను అనుసరించే వ్యవసాయ విధానాలను ఇతరులకీ నేర్పేలా నియమించుకుంది. 'మా ఊళ్ళో ఎక్కువ చదువుకున్నది నేనే. అందుకే నాకీ అవకాశమిచ్చారు. నాకొచ్చిన గుర్తింపు వల్ల గ్రామస్థులు నా మాట వినడానికి ముందుకొచ్చారు. దీంతో మట్టిరకాలు, తక్కువ నీటితో వ్యవసాయం, ఏ పంటలు వేస్తే మేలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నా. ఆరేళ్లలో కందకాలు, చిన్న ఆనకట్టలు, ట్యాంకులు వంటివెన్నో నిర్మించాం. ఇవన్నీ వ్యవసాయానికి సాయపడుతున్నాయి. ఒకప్పుడు పంట అమ్మక ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు కొనేవాళ్లే మా దగ్గరికొస్తున్నారు అని చెబుతారు లీలావతి 35 ఏళ్ల లీలావతి సేవలు 85కి పైగా గ్రామాలకు విస్తరించాయి. అక్కడి రైతులంతా నీటి వనరులను సమకూర్చుకోవడంతో పాటు తక్కువ నీటితో సాగునీ అవలంబిస్తున్నారు. తమ జీవితాలను మార్చుకుంటున్నారు. సహజ వనరులతో వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లే మహిళా రైతుల సంఖ్య పెంచడం తన లక్ష్యమంటోన్న నా లీలావతిని మెచ్చుకోవాల్సిందే!

# రోజంతా పరిమళ భరితంగా..




రోజంతా పరిమళ భరితంగా ఉండాలంటే చక్కని స్ప్రే లేదా పెర్ఫ్యూమ్ వాడడంతో పాటు వేసుకునే దుస్తులు.. మొదలైన విషయాల్లో కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. నిపుణులు. ముఖం జిడ్డుగా అనిపిస్తే బేబీ వైట్స్‌తో తుడుచుకోవచ్చంటున్నారు నిపుణులు. ఫలితంగా ముఖం తాజాగా కనిపిస్తుంది.

✦ కొంతమందికి పాదాలకు చెమట పట్టి వాసన వస్తుంటుంది. ఇలాంటప్పుడు స్నానం చేసిన తర్వాత కాళ్లను బాగా ఆరనిచ్చి మాయిశ్చరైజర్ అప్లై చేయాలి. అలాగే సాక్సులు ధరించేవారు వాటిలోని పరిమళాలు వెదజల్లే పౌడర్ వేసినప్పుడు పాదాల నుంచి చెమట వాసన రాకుండా చెక్ పెట్టచ్చు.

✦ దుస్తులు ఉతికేటప్పుడు ఫ్యాబ్రిక్ కండిషనర్లు వాడితే సువాసనలు వెదజల్లే అవకాశం ఉంది. అలాగే వాటిని వార్డ్రోబ్‌లో భద్రపరిచేటప్పుడు నాప్తలీన్ బాల్స్, సువాసనలు వెదజల్లే శాషేలు.. ఉంచితే ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# పిల్లలు ఏ వయసులో ఎలా?



ఈ రోజుల్లోపిల్లల్ని పెంచడం పెద్ద సవాలు. గారాబంగా పెంచితే మాట వినడం లేదనీ, అలాగని కాస్త కఠినంగా వ్యవహరిస్తే మరింత మొండిగా తయారవుతున్నట్లూ చెబుతున్నాయి. కొన్ని అధ్యయనాలు.

అందుకే, వారినెలా చక్కదిద్దాలో తెలియక తల్లిదండ్రులు ఒత్తిడిని గురవుతున్నారట. ఈ ఇబ్బంది తలెత్తకుండా వారిని ఏ వయసులో ఎలా పెంచాలో చెబుతున్నారు నిపుణులు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు ఎక్కువగా అల్లరి చేస్తుంటారు. అలాగని వారిని నియంత్రించడానికి కొట్టడం, తిట్టడం, శిక్షలు వేయడం వంటివి చేస్తే మరింత మొండిగా తయారయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే వారితో సున్నితంగా ప్రవర్తించాలి. అర్థమయ్యేలా చెప్పాలి. ఐదేళ్ల నుంచి పదమూడేళ్ల పిల్లలు ఎదుటివారిని ఎక్కువగా గమనిస్తుంటారు. వాటిని తిరిగి అనురిస్తుంటారు. అందుకే ఈ వయసులోనే వారికి మంచి అలవాట్లు నేర్పించాలి. మంచిచెడు లను బోధిస్తూ పెంచాలి. కుటుంబంలో ఎవరైనా వారి ముందు చెడుగా ప్రవర్తించినా భవిష్యత్తులో వారూ అదే చేయాలనుకుంటారు. అందుకే ఈ వయసులో పిల్లల ముందు ఆలోచించి మాట్లాడాలి. ఆచితూచి నడుచుకోవాలి. ఇక టీనేజ్‌కి వచ్చేసరికి వారికి ప్రతి విషయం అర్థమవుతుంది. ఈ వయసు లోనే వారితో స్నేహంగా ఉండాలట. ఆర్థిక విషయాలు,కుటుంబ పరిస్థితులు, ప్రేమ వ్యవహారాలు ఇలా సమాజంలో జరిగే ప్రతీ విషయాన్ని వారికి అర్థమయ్యేలా ఉదాహరణలతో వివరించాలట. ఈ విధంగా చేయం వల్ల భవిష్యత్తులో అలాంటి పరిస్థితి వారికి ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోగలుగు తారు. ఎటు వంటి మోసాలకు లోనుకాకుండా ఉంటారు.

# ధ్యానయోగి

ధ్యానయోగి వివేకానంద ఒకసారి మహాబలేశ్వరం వెళ్లారు. అక్కడ ఓ వకీలు ఇంట బసచేశారు. ఆ రాత్రి శిశువు గుక్క పెట్టి ఏడవటం వివేకానంద చెవిన పడింది. మర్నాడు ఉదయం ఇల్లాలి వద్దకు వెళ్లి చిన్నారిని ఈ రాత్రికి నా దగ్గరుంచండి! అన్నారు. అయ్యో స్వామీజీ! తల్లిని నేనే సముదాయించ లేకపోతున్నాను. మీ వల్ల అవుతుందా? అందామె. వివేకానంద పసిబిడ్డను ఒళ్ళో పడుకోబెట్టుకొని రాత్రంతా ధ్యానమగ్నులయ్యారు. శిశువు ఒక్కసారైనా ఏడవలేదు. అదీ స్వామీజీ ధ్యానమహిమ. మీ శక్తిని వ్యర్థమైన మాటల్లో వృథా చేయక, ధ్యానసాధన చేస్తే శక్తులెన్నో జాగృతమవుతాయి. మౌనం పాటిస్తూ మనఃశక్తిని సమీకరించి ఆధ్యాత్మిక శక్తిజనక యంత్రంగా తయారవండి అనేవారు. వివేకానంద దేశమంతా పర్యటిస్తూ 1892 డిసెంబరు ఆఖరున దక్షిణాగ్ర భూభాగంలో మూడు మహా సముద్రాల సంగమక్షేత్రమైన కన్యాకుమారి చేరుకున్నారు. సముద్రం మధ్యనున్న శిలపై మూడు రోజులు ధ్యానం చేశారు. అప్పుడాయన దర్శించింది దీనభారతం, దుఃఖభారతం. వివేకానందలో దేశ పునర్నిర్మాణానికి, భరతజాతి పునరుద్ధరణకూ సంకల్పబీజం ఆ సమయంలోనే! మిగిలిన వారంతా నూనెదీపాలు, మిణుకు మిణుకుమనే నక్షత్రాలైతే నా నరేంద్రుడు విశ్వానికి వెలుగునిచ్చే జ్ఞాన సూర్యుడు అన్నారు రామకృష్ణ పరమహంస.



ధ్యాన కౌశలంతో జ్ఞానభాస్కరుడై బాసించాడు వివేకానంద. ఆ స్థితిలో తనలోని ఆత్మను మేల్కొలిపి లోకసంక్షేమం కోసం ప్రణాళికలు రచించారు. ధ్యానమే ఆధ్యాత్మిక జీవనానికి దగ్గరి తోవ అనేవారు. నిత్య జీవితంలో ధ్యాన సమయంలో మాత్రమే మనం భౌతిక ప్రపంచాన్ని అధిగమించి ఉంటామని, ధ్యానస్థితిలోనే అంతరాత్మ స్ఫుర్ప ప్రస్ఫుటమోతుందని చెప్పేవారు.

వేసవి కాలంలో శరీరానికి చలువ నిచ్చే పానీయాల సోల్కడి ఒకటి, ముఖ్యంగా మహారాష్ట్ర కొంకణ్ తీరప్రాంతాల్లో ప్రసిద్ధి పొందిన ఈ పానీయం రుచికరమైనదే కాదు... అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. కొబ్బరి పాలుకోకమ్ పండ్లతో దీని గురించి మరిన్ని వివరాలు తెలుసుకుందామా!

# శక్తినిచ్చే సోల్కడి!



ఎండల వల్ల శరీరం త్వరగా వేడెక్కుతుంది. సోల్కడిలో ఉంటే కోకమ్కు సహజంగానే చలువ చేసే గుణం ఉంటుంది. ఇది తాగితే తక్షణ ఉపశమనం కలుగుతుంది. ఈ కాలంలో జీర్ణవ్యవస్థ పనితీరు నెమ్మదిస్తుంది. ముఖ్యంగా ఇందులో కలిపే అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర... జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. భోజనం చేశాక సోల్కడి తాగితే గ్యాస్, ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలు దూరమవుతాయి. వేసవిలో శరీరం నుంచి చెమట రూపంలో ఖనిజ లవణాలు బయటకు వెళ్లిపోతాయి. కొబ్బరి పాలలో ఉండే పొటాషియం, ఇతర ఎలక్ట్రోలైట్లు శరీరానికి తిరిగి శక్తినిస్తాయి. ఇవి డీహైడ్రేషన్ బారిన పడకుండా మిమ్మల్ని రక్షిస్తుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అంతేకాదు, కోకమ్ ఆకలిని నియంత్రిస్తుంది. ముఖ్యంగా హైడ్రాక్సి సిట్రిక్ యాసిడ్ కొవ్వును కరిగించి బరువు తగ్గింది. ఇందులో యాంటీఆక్సిడెంట్, యాంటీ సెప్టిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. దీనితో వ్యాధినిరోధకశక్తి బలపడుతుంది.

# మనిషిక్కడ.. మనసెక్కడో..



ఆఫీస్ మన మూడ్ రోజూ ఒకేలా ఉండదు. ఓరోజు ఉత్సాహంగా పని చేస్తే.. మరో రోజు మానసికంగా డిస్టర్బ్ అవుతాం.. ఇంకో రోజు ఏదో ఒక ఆరోగ్య సమస్య వేధించచ్చు. యాక్టివ్‌గా ఉన్న రోజు ఏకాగ్రతతో పని పూర్తి చేసినా.. మానసిక, ఆరోగ్య సమస్యలున్న పుడు పనిపై పూర్తి దృష్టి పెట్టలేం. ఈ విషయం తెలిసిందే.. ఓరోజు సెలవు పెట్టి విశ్రాంతి తీసుకుంటా మంటే ఒక్కోసారి కుదరకపోవచ్చు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో ఇలా ఆఫీసుకు వచ్చినా సరిగ్గా పని చేయలేరు. మనిషిక్కడున్నా.. మనసెక్కడో ఉంటే ఈ పరిస్థితినే ప్రజెంటీయిజం అంటారు.

**ఈ లక్షణాలు కనిపిస్తే..!** అనవసరంగా సెలవు పెట్టడం ఎందుకనో, సెలవు ఇవ్వకపోవడం వల్ల, ఇతర వ్యక్తిగత కారణాల వల్ల. ప్రజెంటీయిజంగా పిలిచే ఇలాంటి స్థితిలో పని చేయడం వల్ల సరైన ఉత్పాదకతను అందించలేం. తద్వారా మన కెరీర్‌పై ప్రతికూల ప్రభావం పడుతుంది. అయితే ఈ స్థితిని కొన్ని లక్షణాల ద్వారా గుర్తించవచ్చు నిపుణులు.

✦ఏదైనా సమస్య ఉన్నప్పుడు ఆఫీస్కు హాజరైతే.. రోజూలా ఉత్సాహంగా పనిచేయలేం. చేసే పనిపై పూర్తి దృష్టి పెట్టకపోవడం వల్ల పొరపాట్లు దొర్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

✦ ఏకాగ్రత లోపంతో పనిలో నాణ్యత కూడా తగ్గిపోతుంది. ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే. ఈ తేడా మనకు తెలిసిపోతుంది.

✦.ఆసక్తి లేనప్పుడు ఆఫీస్కు రావాలంటే ఏదోలా అనిపి స్తుంది.. ఎవరో బలవంతంగా లాక్కొచ్చినట్లు ఫీల వుతాం. దీంతో ఆఫీస్కి రావడానికి ఆలస్యమవుతుం టుంది.. త్వరగా ఇంటికి వెళ్లాలనిపిస్తుంది... కొన్ని సందర్భాల్లో పని పూర్తి కాకుండా అదనపు గంటలు ఆఫీస్ లోనే ఉండాల్సి వస్తుంది.

✦ మనసు, ఆరోగ్యం బాగోలేక పోయినప్పుడు ఆఫీస్కొస్తే ఒక రకమైన ఒత్తిడితో మనసంతా సతమతమవుతుంటుంది. ఇలాంటి సమయంలో అదనపు పని భారం పడినా,ఎవరైనా మనల్ని కదిపినా వారిపై చికాకు పడుతాం. దీనివల్ల కూడా ఇటు వ్యక్తిగతంగా, అటు కెరీర్ పైనా ప్రతికూల ప్రభావం పడుతుందంటున్నారు నిపుణులు. అలాగే కొన్ని సందర్భాల్లో అధిక పని గంటలు కూడా ఈ పరి స్థితికి కారణం కావచ్చునని నిపుణులు అంటున్నారు.

# యాక్షన్ థ్రిల్ చిత్రం 'డెకాయిట్'



**డెకాయిట్ తెలుగు ట్రైలర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.. హిందీ రెస్పాన్స్ ఎలా ఉంది?**

హిందీలో చాలా అద్భుతంగా ఉంది. హిందీలో మేము ఊహించిన దాని కంటే చాలా చక్కని రీచ్ ఉంది. ఫస్ట్ టైం భోజ్‌పురిలో కూడా ప్రీమియర్ చేస్తారా అని అడిగారు. అది విన్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది.

**మీ గత సినిమాల్లో కూడా ప్రేమ కథలు ఉన్నాయి కానీ.. ఈ ప్రేమ కథకి ఉన్న ప్రాముఖ్యత ఏమిటి?**

నా గత సినిమాల్లో ఒక బిగ్ ప్లాట్ఫామ్ చేరుకోవడానికి లవ్ స్టోరీ వుంటుంది. కథలో ఒక చిన్న భాగంగా ఉంటుంది.

**మీరు ఇప్పటివరకు స్క్రీన్ మీద డాన్స్ చేయలేదు. ఈ సినిమాతో మొదలుపెట్టారు దీనికి కారణమేదైనా ఉందా?**

చిన్నప్పుడు ఫంక్షన్‌లో డాన్స్ చేస్తున్నప్పుడు నువ్వు చాలా పొడుగ్గా ఉన్నావు డాన్స్ చేయొద్దు ఎవరో అన్నారు అప్పటినుంచి ఆ ఫీలింగ్ ఎలా ఉండిపోయింది. నాకు నేనే ఆ లిమిట్ పెట్టుకున్నాను.

**ఈ సినిమా కాస్త డిలే అయింది కదా దీనికి కారణం?**

నిజానికి ఒక డిలే కాలేదు. నేను సినిమా చేసే ప్రాసెస్ ఎలా ఉంటుంది. నా వరకు గత రెండు సంవత్సరాలుగా రోజు ఆగకుండా పనిచేస్తున్నాననే ఉంది. వరుసగా సినిమాలు రావాలంటే నేను రైటింగ్ ప్రాసెస్‌లో ఉండకూడదు. గూడచారి 2 తర్వాత ఎమోషనల్‌గా రీఛార్జ్ అవ్వాలి అనుకుంటున్నా.

**డాల్బీ లో రిలీజ్ చేయాలి అనే ఆలోచన ఎప్పుడు వచ్చింది?**

మాకు మొదటి నుంచి సినిమాని డాల్బీలో రిలీజ్ చేయాలని ఉంది. కాకపోతే అల్లు అరవింద్ ఫోన్ చేసి సినిమా చాలా ప్రామి సింగ్‌గా ఉంది కొలబరేట్ అవుదాం అని చెప్పారు. అది నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది.

**భీమ్స్‌తో వర్క్ చేయడం?**

ఒక ఫ్రెష్ మ్యూజిక్ చేయాలని అనుకున్నాం. భీమ్స్ గారికి కూడా చాలా ఫ్రెష్ ప్రాజెక్ట్ అయింది. ఇది నేను చేసిన మ్యూజిక్ లాగా లేదని ఆయనే అన్నారు.

**కన్నే పెట్టరో సాంగ్ ఆలోచన ఎవరిదీ?**

హరి క్యారెక్టర్ ఒక మూమెంట్లో ఎంజాయ్ చేసే మూడ్లో ఉంటాడు. ఆ సీక్వెన్స్ చెబుతున్నపుడు సుప్రియ ఫస్ట్ టైం ఎప్పుడు డ్యాన్స్ చేశావ్ అన్నారు.

# 'అహోం' సినిమా ప్రారంభోత్సవం



వివేక్ మిశ్రా, శృతిక జంటగా నటిస్తున్న సినిమా 'అహోం'. ఈ చిత్రాన్ని ఈగల్ ఐ స్టూడియో ఇంటర్నేషనల్ బ్యానర్ పై దశరథ్ నిర్మిస్తున్నారు. ప్రసాద్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా భాషల్లో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళంలో సినిమా తెరకెక్కనుంది. నిర్మాత కేవస్ రామారావు, డైరెక్టర్ వి.వి.వినాయక్ ముఖ్య అతిథులుగా ఈ చిత్ర ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత కేవస్ రామారావు డైరెక్టర్ ప్రసాద్ రాజు మంచి అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన దర్శకత్వంలో ఈ సినిమా పలు భాషల్లో రూపొందడం సంతోషంగా ఉంది అన్నారు హీరోయిన్ శృతిక మాట్లాడుతూ "అహోం" చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. . హీరో వివేక్ మిశ్రా మాట్లాడుతూ హైదరాబాద్ అంటే మూవీస్, మ్యూజిక్ కన్సర్ట్స్ లకు ఫేమస్. మా మూవీలో నటించేందుకు ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. ప్రముఖ మోడల్ దీప్తి మాట్లాడుతూ "అహోం" చిత్ర ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు నన్ను ఆహ్వా నించిన దర్శకుడు ప్రసాద్ రాజుకి థ్యాంక్స్. నటుడు ఆజాద్ మాట్లాడుతూ ఈ చిత్రానికి మంచి టైటిల్ పెట్టుకున్నారు. హీరో హీరోయిన్స్ జంట కూడా బాగుంది. నటుడు విశ్వ మాట్లాడుతూ ప్రసాద్‌రాజు దర్శకత్వం అవకాశం కోస చాలాకాలంగా వేచి చూస్తున్నారు.

# తెర

# 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'తో ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు: ప్రొడ్యూసర్ శివప్రసాద్



ప్రొడ్యూసర్ శివప్రసాద్ ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, యోగి బాబు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన తెలుగు టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శ్రీ పద్మిని సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఏప్రిల్ 10న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది.

**ప్రొడ్యూసర్‌గా మీ జర్నీ గురించి?**

మొదట శ్రీరామ్‌తో మాతృ సినిమా నిర్మించాం. తర్వాత రారాజా ప్రొడ్యూస్ చేశాం. సుహాసిని మణిరత్నంతో మహతి అనే సినిమా చేస్తున్నాం. ఆ సినిమా షూటింగ్‌లో ఇంకా 10 బ్యాలెన్స్ ఉంది.

**లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ సినిమా గురించి?**

గత సంవత్సరం ఈ సినిమాకు అగ్రిమెంట్ చేసుకున్నాము. ఈ సినిమా కోసం చాలా మంది ప్రయత్నించారు.

**కొత్తగా మీరు చేయబోయే సినిమాలు?**

మా తమ్ముడు అజయ్ హీరోగా రంగూన్ రాజా సినిమా చేశాం. అది జూన్ లేదా జూలైలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. అలాగే మహతి సినిమా కూడా త్వరలో రెడీ అవుతుంది.

**ఐపీఎల్ ఎఫెక్ట్ సినిమాలపై ఉంటుందని అనుకుంటున్నారా?**

సినిమా బాగుంటే, చూడాలనుకునే ఆడియన్స్ తప్పకుండా చూస్తారు. సినిమా మంచి కంటెంట్‌తో ఉంటే ఐపీఎల్ పెద్దగా ప్రభావం చూపదని నేను భావిస్తున్నాను.

**విజయ్ సేతుపతి గారికి కథ చెప్పే విషయంపై?**

విజయ్ సేతుపతి గారు ప్రస్తుతం చాలా బిజీ షెడ్యూల్‌లో ఉన్నారు. మేము ఇంకా పరిశ్రమలో స్థిరపడిన తర్వాత కథ చెప్తే బాగుంటుందని వెయిట్ చేస్తున్నాం.

**మీకు ఎలాంటి కథలు ఇష్టం?**


నాకు లవ్ స్టోరీస్ అంటే ఇష్టం. ప్రస్తుత సమస్యలను అందరికీ కనెక్ట్ అయ్యేలా చెప్పే కథలు ఇష్టం. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఒక ఫుల్‌లెంగ్త్ ఎంటర్టైనర్. ఫ్యూచరిస్టిక్ జానర్ ఆడియన్స్‌కు కొత్త అనుభూతి ఇస్తుంది.

# 'ఎం4ఎం' 5 భాషల్లో రిలీజ్



ప్రపంచవ్యాప్తంగా 5 భాషల్లో రిలీజ్. దర్శకుడు మోహన్ వడ్లపట్ల స్వీయ నిర్మాణం పాన్ ఇండియా థ్రిల్లర్‌గా ఎం4ఎం ఉత్కంఠ భరిత హత్యా కథాంశంతో తెరకెక్కిన సస్పెన్స్ థ్రిల్లర్ ఎం4ఎం (M4M Ð Motive for Murder)e చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు కాబోతోంది. అమెరికన్ నటి జో శర్మా, సాంబీత్ ఆచార్య ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం M4M (Motive for Murder)పాన్ ఇండియా సినిమాగా ఐదు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని దర్శకుడు మోహన్ వడ్లపట్ల స్వీయ నిర్మాణంలో మోహన్ మీడియా క్రియేషన్స్ బ్యానర్‌పై, McWin Group USA సహకారంతో రూపొందించారు. భారతదేశంలో ఈ చిత్రాన్ని PVR Inox Pictures సంస్థ తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మల యాళ భాషల్లో విడుదల చేయ నుంది. అమెరికాలో విడుదల బాధ్యతలను TekFlix Entertainment, ఉత్తర భారత విడుదలను JVEL Entertainment సంస్థలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో"లీ4లీ" చిత్రం పాన్‌ఇండియా స్థాయిలో భారీ అంచనాలు రేకెత్తిస్తోంది. థియేటర్లలో విడుదలకు ముందే ఈ చిత్రం అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందింది. ప్రముఖ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా Palais C Theatre లో ప్రైవేట్ స్క్రీనింగ్ నిర్వహించగా, ముంబైలోని IMPPA Preview Theatre లో ప్రత్యేక ప్రదర్శన జరిగింది.

# అల్లరి నరేష్ హీరోగా 'కనక దుర్గ'



తమిళ సినీ ఇండస్ట్రీలో విజయ వంతమైన ప్రముఖ కంటెంట్ స్టూడియో అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అందులో భాగంగా టెంపుల్ టౌన్ పిక్చర్స్‌తో కలిసి చేయబోతున్న సినిమా 'కనక దుర్గ'ను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. భారతీయ దేవతల ఆధారంగా ఒక దివ్యమైన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ఈ సినిమా భక్తి, యాక్షన్, భావోద్వేగాలు, సంగీతం ఇలా అన్ని అంశాలతో ప్రేక్షకులకు ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించనుంది. ఘనంగా జరిగిన కార్యక్రమంలో సురేఖ కొణిదెలతో పాటుగా Spotify నిర్మాతలు అల్లు అరవింద్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, హరీష్ శంకర్, మిక్కిలినేని సుధాకర్, కోన వెంకట్, ప్రశాంత్ వర్మ, మధుర శ్రీధర్, స్వప్నాదత్, సుప్రియ, విద్యా కొప్పినీడు, పద్మ కస్తూరిరంగన్, అనురాధ గూడూరు, దివ్యవిజయ్, హన్షిత రెడ్డి, జాన్వీ నారంగ్, స్రవంతి చొక్కారపు, వైఘారెడ్డి, విరుప తదితరులు అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లుఅరవింద్ క్లాప్ కొట్టగా, సురేఖ కొణిదెల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్వప్నదత్ గౌరవ దర్శకత్వం వహించారు. శ్యామ్ ప్రసాద్ రెడ్డి స్క్రిప్ట్‌ను అందించారు. టెంపుల్ టౌన్ పిక్చర్స్ నిర్మాతలు అజిత్ ఠాకూర్, బి.వి.ఎస్. రవి మాట్లాడుతూ కనక దుర్గ కథ తెలుగు నేలకు సంబంధించిన ఆధ్యాత్మికత, సంస్కృతిలో బలంగా నాటుకుపోయింది. దీంతో మా ప్రయాణం ప్రారంభం కావటం ఎంతో ప్రత్యేకం. మా బ్యానర్‌లో రూపొందుతోన్న తొలి తెలుగు సినిమా ఇది. మంచి కథతో పాటు మంచి భాగ స్వామ్యంలో సినిమా చేస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం. దర్శకుడు ప్రదీప్ మద్దాలి మాట్లాడుతూ 'కనక దుర్గ' సినిమా నాకు చాలా ప్రత్యేకం. దర్శకుడిగా మాత్రమే కాదు, ఆ అమ్మవారిపై నాకు ఉన్న భక్తి కూడా దీనికి కారణం. శ్రీదేవి విజయ్‌కుమార్ మాట్లాడుతూ: "బ్యాడ్ బాయ్ కార్తీక్" సినిమా ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదల అవుతుంది.

# 'బ్యాడ్ బాయ్ కార్తీక్' ప్రేక్షకులకు నచ్చుతుంది: నాగశౌర్య



నాగశౌర్య, రామ్ దేశినా, శ్రీనివాస రావు చింతలపూడి, శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ వారి 'బ్యాడ్ బాయ్ కార్తీక్' యాక్షన్‌ప్యాక్డ్ ట్రైలర్ లాంచ్ హీరో నాగశౌర్య, రామ్ దేశినా (రమేష్) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఇంటెన్స్ యాక్షన్ డ్రామా 'బ్యాడ్ బాయ్ కార్తీక్' చిత్రంతో మాస్ అవతార్‌తో రాబోతున్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్ పై శ్రీనివాసరావు చింతల పూడి నిర్మించిన ఈ చిత్రం, సూపర్ హిట్ పాటలు, శౌర్యను మునుపెన్నడూ ఇంటెన్స్‌గా చూపించిన పవర్‌ప్యాక్డ్ టీజర్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ నెల 17వ తేదీన విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా మేకర్స్ ఈరోజు థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. నరేష్ వీకే పాత్ర దేవుడిని ప్రార్థిస్తూ.. ప్రమాదకరమైన వ్యక్తుల అణచివేతలో ఇబ్బందులు పడుతున్న నేపథ్యాన్ని ప్రజెంట్ చేస్తుంది. ఆ సమయంలో 'బ్యాడ్ బాయ్ కార్తిక్' అనే రగ్డ్, తన రూల్స్‌తో జీవించే పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఎంట్రీ అదిరిపోతుంది. విలన్‌పై అతను ఎలా పోరాడుతాడు, అమాయకులని ఎలా కాపాడుతాడు అన్నదే కథలో ప్రధానాంశం.నాగ శౌర్య ఫుల్ మాస్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. యాక్షన్ సన్నివేశాలతో పాటు, తనలోని వేరియేషన్స్ అద్భుతంగా వున్నాయి. ముఖ్యంగా సాయి కుమార్‌తో వచ్చే ఫన్ సీన్స్‌లో అతని కామిక్ టైమింగ్ ఆకట్టుకుంటుంది. హీరోయిన్‌గా విధి తన చార్మ్‌తో ఆకట్టుకోగా, విలన్ పాత్రలో సముద్రఖని పవర్ ఫుల్‌గా కనిపించారు. ఇక నరేష్ వీకే ఎమోషనల్ పెర్ఫార్మెన్స్‌తో మంచి ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. సినిమా మాస్ యాక్షన్, డ్రామా, రొమాన్స్, కామెడీ అన్నీ కలిపిన పూర్తి ఎంటర్టైనర్‌గా రానుందని ట్రైలర్ ప్రామిస్ చేస్తోంది. దర్శకుడు రమేష్ ఈ సినిమాను కమర్షియల్ ప్యాకేజీగా మలిచాబు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నాగశౌర్య చాలా రోజుల తర్వాత మిమ్మల్ని కలవడం చాలా హ్యాపీగా ఉంది. మా ప్రొడ్యూసర్ గారు ఈ సినిమా జరగాలని ఎంతో పట్టుదలతో ముందు కు తీసుకొచ్చారు. ఆయనకి హ్యాట్సాఫ్.

# వరల్డ్ కప్ హీరో ఐపిఎల్ జీరో



సూపర్-8లో వెస్టిండీస్‌పై 97 రన్స్
సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై 89 రన్స్
ఫైనల్లో న్యూజిలాండ్‌పై 89 రన్స్

రాజస్థాన్ రాయల్స్‌పై 6 రన్స్
పంజాబ్ కింగ్స్‌పై 7 రన్స్
రాయల్ ఛాలెంజర్స్‌పై 9 రన్స్

ఆట

**ఐపీఎల్‌కు ముందు సీఎస్‌కేది హాట్ ఫేవరేట్ హోదా. సంజూ శామ్సన్‌ది టీ20 ప్రపంచకప్ హీరో ఇమేజ్. నాకౌట్ మొదలు సెమీఫైనల్, ఫైనల్లో ధూంధాం ఇన్నింగ్స్‌తో సంజూ ఒంటిచేత్తో టీమిండియాకు ప్రపంచకప్ అందించాడు. అభిషేక్ వైఫల్యం ఈ కేరళ ఓపెనర్‌కు కలిసివచ్చింది. మూడే మూడు ఇన్నింగ్స్‌లతో హీరోగా మారిపోయాడు. ఇపుడు ఆ మూడే మూడు ఇన్నింగ్స్‌లతో జీరోగా మారాడు. సంజూ శామ్సన్ జట్టులో ఉండడంతో సీఎస్‌కే ఫ్యాన్స్ అయితే తమ జట్టు ఆరో ఐపీఎల్ ట్రోఫీ గెలిచేస్తోంది అన్నంతగా హల్‌చల్ చేశారు. తీరా ఐపీఎల్ మొదలయ్యాక సీన్ రివర్స్ అయింది. సీఎస్‌కేకు సంజూ అదృష్టమనుకుంటే భారంగా మారాడు. వరుస వైఫల్యాలతో జీరో అవుతున్నాడు.**

(వార్త క్రీడా విభాగం)

9, 7, 6.. ఇవి ప్లేయర్స్ జెర్సీ నెంబర్లు అనుకుంటే పొరపాటే. వరల్డ్ కప్ హీరో... ఐపీఎల్‌లో చేసిన స్కోర్లు. మూడు మ్యాచ్‌ల్లో 22 పరుగులు మాత్రమే. ఆడిన మూడు ఇన్నింగ్స్‌ల్లోనూ సింగిల్ డిజిట్ దాటలేకపోయాడు. సీఎస్‌కే తరపున వరుసగా విఫలమవుతూ ఆ జట్టు అభిమానులను తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. తన పాత బలహీనతలతో వికెట్లు పారేసుకుంటూ విమర్శల పాలవుతున్నాడు. సంజూ శామ్సన్ వైఫల్యం సీఎస్‌కే విజయావకాశాలను దారుణంగా దెబ్బతీస్తున్నాయి. మూడు మ్యాచ్‌లాడినా ఇప్పటికీ గెలుప బోణీ కొట్టలేకపోయింది. ఐపీఎల్‌కు ముందు హాట్ ఫేవరేట్ హోదా కాస్తా ఇపుడు కనీసం లీగ్ స్టేజ్ అయినా దాటుతుందా అన్న డౌట్స్ అభిమానుల్లో ఆందోళన రేపుతోంది.

### అపుడు ధనాధన్ ఇనింగ్స్

సొంతగడ్డపై జరిగిన టీ20ప్రపంచకప్‌లో సంజూ ఎంట్రీనే అదృష్టం. డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ వరుస వైఫల్యాలు సంజూకు తుది జట్టులో చోటుకు కలిసొచ్చింది. ఆకాశమే హద్దుగా చెలరేగాడు. గెలిస్తేనే నిలిచే సూపర్8 మ్యాచ్‌లో విండీస్‌పై అజేయంగా 97 రన్స్ సాధించి... టీమిండియాను సెమీస్‌కు చేర్చాడు. ఇక సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై 89 రన్స్, ఫైనల్లో న్యూజిలాండ్‌పై మరో89రన్స్ తో టీమిండియాకు కప్ అందించడంలో కీలక భూమిక పోషించాడు. ఏకంగా ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు.

### ఇపుడు తుస్‌తుస్

రాజస్థాన్ రాయల్స్ నుండి చెన్నై సూపర్ కింగ్స్ కు మారిన తర్వాత...కొత్త టీమ్‌కు సంజూ మ్యాజిక్ చేస్తాడని అభిమానులు ఆశించారు. సంజూపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. చెపాక్ స్టేడియంలో సంజూ..సంజూ అంటూ హోరెత్తించాడు. కానీ, ఐపీఎల్ మొదలైన పది రోజుల్లోనే సీన్ రివర్స్ అయింది. సీఎస్‌కే తరపున ఆడిన మొదటి మూడుఇన్నింగ్స్‌ల్లో సంజూ వరుసగా 6, 7, 9పరుగులు మాత్రమే చేశాడు. అంటే మూడు మ్యాచ్‌ల్లో కలిపి 22 పరుగులు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి పవర్ ప్లేలో సంజూ మెరుపులు మెరిపిస్తాడనుకుంటే, అనవసరమైన షాట్లకు ప్రయత్నిస్తూ వికెట్ పారేసుకుంటున్నాడు. కేవలం బ్యాటింగ్‌లోనే కాదు, వికెట్ కీపింగ్‌లో కూడా సంజూ తడబడుతున్నాడు. ధోనీ గైర్హాజరీలో కీపింగ్ బాధ్యతలు చేపట్టిన శాంసన్ వికెట్ల వెనకా ఇబ్బంది పడుతున్నాడు. తన సహజ సిద్ధమైన ఆటను మరిచిపోయి, అంచనాల భారంతో సతమతమవుతున్నట్లు స్పష్టమవుతోంది.

### సంజూపై అదే నమ్మకం

సంజూ శామ్సన్ ఫామ్ కోల్పోయినప్పటికీ, సీఎస్‌కే మేనేజ్మెంట్ మాత్రం అతడికి పూర్తి మద్దతుగా నిలుస్తోంది. కొత్త టీమ్‌లోకి వచ్చినపుడు ఇలాంటి ఇబ్బందులు సహజం అంటూ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్... సంజూ శామ్సన్‌ను వెనకేసుకొస్తున్నాడు. సంజూ సీఎస్‌కే జట్టులో బాగా కలిసిపోయాడని, పరుగులు చేయాలనే కసి అతడిలో ఉందని, త్వరలోనే మళ్ళీ ఫామ్‌లోకి వస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కోచ్ ఫ్లెమింగ్ నమ్మకాన్ని నిలబెట్టేలా రాబోయే మ్యాచ్‌ల్లో సంజూ శామ్సన్ ఆటతీరు గాడిన పడితే సీఎస్‌కే కష్టాలు తీరుతాయి.

# ఫైనల్లో 8మంది భారత్ బాక్సర్లు



**ఉలన్‌బతర్:** మంగోలియాలో జరుగుతున్న ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు జోరు కొనసాగుతోంది. ఏకంగా ఎనిమిది మంది భారత బాక్సర్లు ఫైనల్లో ప్రవేశించారు. మహిళల విభాగంలో ఆరుమంది, పురుషుల విభాగంలో ఇద్దరు పసిడి పతకం కోసం పోటీపడతారు. మహిళల 48కిలోల విభాగంలో మీనాక్షి 4-1తో థాయిలాండ్ ప్రత్యర్థి తిప్పచపై విజయంతో, 57 కిలోల విభాగంలో జాస్మిన్ 3-2పాయిట్ల తేడాతో నిగిన ఉత్కమోవా(ఉజ్బెకిస్థాన్)పై నెగ్గి ఫైనల్ చేరారు. పసిడి పతకం కోసం మీనాక్షి.. మంగోలియా బాక్సర్ అమ్గలాన్‌తో, జాస్మిన్.. థాయిలాండ్‌కు చెందిన పున్రవితో తలపడనుంది.

ఇక పరుషుల 50 కిలోల విభాగంలో విశ్వనాథ్ సురేష్ డామినేట్ చేశాడు. సెమీఫైనల్లో జోర్డాన్ బాక్సర్ హుథాయ్‌ఫాపై పిడిగుద్దులతో విరుచుకుపడి ఏకపక్షంగా ముగించాడు. 60కిలోల విభాగంలో సచిన్ 4-1 పాయింట్ల తేడాతో థాయిలాండ్ బాక్సర్ సక్దాపై నెగ్గి ఫైనల్ చేరాడు. ఇప్పటికే ఫైనల్ చేరిన ప్రీతి 54 కిలోల విభాగం ఫైనల్లో చైనీస్ తైఫీ బాక్సర్ హ్యూంగ్ వెన్‌తో... ప్రియ 60 కిలోల విభాగం ఫైనల్లో కొరియా బాక్సర్ యున్ యాంగ్‌తో... అరుంధతి చౌదరి 70 కిలోల విభాగం ఫైనల్లో కజకిస్థాన్‌కు చెందిన సీదెష్‌తో తలపడనుంది. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా 8 మంది భారత బాక్సర్లు ఫైనల్ చేరడం ఇదే మొదటిసారి.



## భారత్ జట్టులో హృతిక్

**హైదరాబాద్:** ఆసియా ఓసియానియా జూనియర్ డేవిస్‌కప్ ఫైనల్ క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనే భారత టెన్నిస్ జట్టును ప్రకటించారు. ముగ్గురు సభ్యులతో కూడిన భారత జట్టులో హైదరాబాద్‌కు చెందిన 15 ఏళ్ల హృతిక్ కటకం చోటు సంపాదించాడు. న్యూఢిల్లీలో జరిగిన సెలెక్షన్ ట్రయల్స్‌లో హృతిక్ ఆడిన 4మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది అగ్రస్థానంలో నిలిచాడు. జాతీయ బాలుర సింగిల్స్‌లో మూడో ర్యాంక్‌లో ఉన్న హృతిక్..ట్రినిటీస్ చాలెంజర్స్ అకాడమీలో కోచ్ హెన్రీ ప్రవీణ్ వద్దశిక్షణ తీసుకుంటున్నాడు.

# ఢిల్లీ జోరుకు గుజరాత్ బ్రేకులు వేసేనా?




**ఢిల్లీ:** ఐపీఎల్‌లో జోరుమీదున్న ఢిల్లీ క్యాపిటల్స్... సొంతగడ్డపై మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. నేడు గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. అక్షర్ పటేల్ నేతృత్వంలోని ఢిల్లీ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందగా, గుజరాత్ రెండింటిలోనూ ఓటమితో ఉంది. ఢిల్లీ జట్టులో ఇఫాక్ట్ ప్లేయర్ సమీర్ రిజ్వీ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. రిజ్వీ 47 బంతుల్లో 70 పరుగులు సాధించి తొలి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై గెలుపందించాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ ఓ దశలో 7 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఢిల్లీని ఆదుకున్నాడు. 51 బంతుల్లో 90 పరుగులతో చెలరేగి విజయాన్ని ఖాయం చేశాడు. ట్రిస్టన్ స్టబ్స్ కూడా చక్కని ఫామ్‌లో ఉన్నాడు. రాహుల్, నిస్సాంక, నితీస్ పరుగుల ట్రాక్‌లో పడితే ఢిల్లీకి తిరుగుండదు. మ్యాచ్ ఫినిషర్ మిల్లర్, అక్షర్ పటేల్ అండ ఉంది. ఎన్గిడి, కుల్దీప్ యాదవ్ రూపంలో పేస్, స్పిన్ కాంబినేషన్ కలిగిఉంది.

ఇక శుబ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ అంచనా మేర రాణించలేకపోతోంది. సొంత గడ్డ అహ్మదాబాద్‌లోనూ ఓటమే ఎదురైంది. శుభ్‌మన్ గిల్ జట్టులోకి తిరిగిరావడంతో గుజరాత్ బ్యాటింగ్ పటిష్టమైంది. సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీతో జోరు మీదికొచ్చాడు. జోస్ బట్లర్, గ్లేన్ ఫిలిప్స్, రాహుల్ తెవాటియా, వాషింగ్టన్ సుందర్ బ్యాటింగ్‌లో రాణించాల్సి ఉంది. చక్కని ఓపెనింగ్ భాగస్వామ్యాలు లభిస్తున్నా, మిడిల్ ఆర్డర్ వైఫల్యం గుజరాత్‌ను వెంటాడుతోంది. నితీష్ రాణా, విప్రాజ్ నిగమ్‌లకు మరో ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్‌ను బలోపేతం చేయడానికి జేసన్ హోల్డర్‌ను జట్టులోకి తీసుకురావడానికి మొగ్గు చూపవచ్చు. ఇక ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్‌ఖాన్, సిరాజ్ రూపంలో చక్కని బౌలింగ్ స్ట్రెంత్ ఉంది.

### ఇరు జట్ల ఫైనల్ ఎలెవన్(అంచనా)

**ఢిల్లీ క్యాపిటల్స్:** కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), పాతుమ్ నిస్సాంక, నితీష్ రాణా, సమీర్ రిజ్వీ, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, అక్షర్ పటేల్ (కెప్టెన్), విప్రజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్, లుంగ్గి ఎంగిడి, నటరాజన్; ఇంఫాక్ట్ ప్లేయర్: ముకేష్ కుమార్; **గుజరాత్ టైటాన్స్:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, గ్లెన్ ఫిలిప్స్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, కగిసో రబడ, జాసన్ హోల్డర్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇంఫాక్ట్ ప్లేయర్: అశోక్ శర్మ




## చెస్ వండర్ కిడ్ కొండా శ్రేయాన్ష్ రికార్డు

**హైదరాబాద్:** అత్యంత పిన్న వయస్సులోనే చదరంగంలో ప్రపంచ రికార్డు సాధించిన బాలుడిగా కొండా శ్రేయాన్ష్ మురళీ కృష్ణ పటేల్ నిలిచాడు. రెండు సంవత్సరాల 11 నెలల వయసులో ఈ ఘనత సాధించాడు. రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెండు అసాధారణ రికార్డులను నెలకొల్పి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ల్లో కెక్కాడు. 15 నిమిషాల 52 సెకండ్స్‌లలో 93 బ్యాక్ ర్యాంక్ చెక్ మేట్స్‌ను పరిష్కరించడంతో పాటు, 1 గంట 9 నిమిషాల 9 సెకండ్స్ లలో 21 చెస్ బోర్డ్‌లను అమర్చి రెండు ప్రపంచ రికార్డులను సాధించి చరిత్ర సృష్టించాడు. శ్రేయాన్ష్‌కు ట్రోఫీలు, సర్టిఫికెట్ లను మంత్రులు వాకిటి శ్రీహరి, కొండా సురేఖ ప్రదానం చేశారు. త్వరలో బ్రిటిష్ పార్లమెంట్లో సత్కారంతో పాటు సర్టిఫికెట్‌ను శ్రేయాన్ష్ పొందనున్నాడు.

# సెన్సెక్స్ నిఫ్టీలకు ఐటి, మెటల్ రంగాల మద్దతు

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబయి, ఏప్రిల్ 7:** ఐటి, మెటల్‌రంగాల్లో స్టాక్స్‌లో కొనుగోళ్ల ర్యాలీ తీయడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే ముగిసాయి. నిఫ్టీ 50 కాంట్రాక్టులు కాలపరిమిత ఇముగియడం కూడా కొంతమేర అనిశ్చితిని కొన్ని రంగాలను తాకింది. అలాగే పశ్చిమాసియా ఉద్రిక్తతలు కూడా ఎంపికచేసిన రంగాలపై ఎఫెక్ట్ చూపించాయి. అమెరికా ఇరాన్‌లు ఒక డీల్‌కు రావచ్చన్న ప్రచారంతో మార్కెట్లు కొంతవరకూ ర్యాలీ తీసాయనే చెప్పాలి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 509.73 పాయింట్లుపెరిగి 74,616.58 పాయింట్లవద్దకు చేరింది. నిఫ్టీ 50 సూచీ కూడా 155.40 పాయింట్లుపెరిగి 23,123.65 పాయింట్లుపెరిగింద.

వరుసగా నాలుగు సెషన్లలోసెన్సెక్స్ 3.70శాతం, నిఫ్టీ 3.54 శాతం పెరిగాయి. ఇన్ఫోసిస్ 2.59, భారతి ఎయిర్‌టెల్ 2.13, ఐసిఐసి బ్యాంకు 1.39శాతం చొప్పున పెరిగాయి. బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.03శాతం, 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.16 శాతం పెరిగాయి. మార్కెట్లలో బిఎస్‌ఇలో 2671 షేర్లుపెరిగితే 1555 షేర్లు క్షీణించాయి. మొత్తంగా 18 కంపెనీలషేర్లు యధాతథంగా కొనసాగాయి. ఇక విదేశ ఈకరెన్సీ మార్పిడి మార్కెట్‌లో డాలరుతోరూపాయి మారకం విలువలు 93 వద్ద కొనసాగింది. ముందురోజు 92.90 నుంచి కొంతమేర బలపడిందనే చెప్పాలి.

ఎంసిఎక్స్‌లో గోల్డ్‌ఫ్యూచర్స్ జూన్ ఐదునాటి ధరలు రూ.1,50,390గా మారాయి. అమెరికా పదేళ్ల బాండ్ల రాబడులు కూడా 0.16శాతం క్షీణించి 4.327గానే కొనసాగింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జూన్ సెటిల్‌మెంట్లకు సంబంధించి 89 సెంట్లు క్షీణించి 108.88 డాలర్లుగా కొనసాగింది. నిఫ్టీలో ఐటిసూచీ 2.50శాతంపెరిగింది. ఎంఫసిస్ 4.21, విప్రో 3.71, ఎల్అండ్‌టి మైండ్‌ట్రీ 3.42, టిసిఎస్ 2.81, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 2.65, ఇన్ఫోసిస్ 2.59, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 2.55శాతం, టెక్ మహీంద్ర 1.66శాతం, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 1.24శాతం, కాఫోర్జ్1.05శాతం చొప్పున పెరిగాయి. జూబిలియంట్ ఫుడ్ వర్క్స్ 10.54శాతం క్షీణించింది. డైనాకాన్స్ సిస్టమ్స్ అండ్‌సొల్యూషన్స్ 3.81శాంపెరిగింది. టిటాఘర్ రైల్ సిస్టమ్స్ 8.84శాతం, గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ 2.58శాతం, క్రెడిట్ యాక్సెస్4.92శాతం చొప్పున పెరిగాయి. శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ 3.58శాతం, లోధా డెవలపర్స్ 0.89శాతం చొప్పున పెరిగాయి. ఇక కల్యాణ్ జ్యూయెలర్స్1.46శాతం క్షీణించింది. అలెంబిక్ ఫార్మా 5.22, ఐఆర్ ఎఫ్‌సి 0.18, ఫినో పేమెంట్స్ బ్యాంకు 2.10శాతం, ఆర్టెక్ సోలోనిక్స్ 7.32శాతం చొప్పున పెరిగాయి.

### ఐపిఒకు వచ్చే కంపెనీలకు

# సెబీ సడలింపులు



## ఐపిఒకి 144 కంపెనీలు

## 1.75 లక్షల కోట్ల సమీకరణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7**

ఐపిఒలకు వస్తునన కంపెనీలకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కొన్ని అప్‌డేట్లు విడుదలచేసింది. మార్కెట్లలో ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెంచేందుకు ఇప్పటికే కొన్ని సవరణలు తెచ్చిన సెబీ పారదర్శకతను మరింత పెంపొందింపచేసేందుకుగాను కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పైనా, ఐపిఒ నిబంధనల పైనా సడలింపులు ఇచ్చింది.

ప్రస్తుత నిబంధనలప్రకారం ఐపిఒకు వస్తున్న కంపెనీలకు వచ్చిన పరిశీలన లేఖలు గడువు 12 నెలలు మాత్రమే. ఆ గడువు పూర్తి కాగానే కంపెనీలు మళ్లీ ముసాయిదాలు సమర్పించాల్సి ఉంటుంది. రహస్య ఐపిఒకు దాఖలు చేసిన సందర్భాల్లో ఐపిఒ ప్రారంభానికి కంపెనీలకు 18నెలల గడువు ఇచ్చింది.

భౌగోళిక ఉద్రిక్తతలు, మార్కెట్లలో అనిశ్చితి, ఇన్వెస్టర్ల భాగస్వామ్యం తగ్గడం వంటి పరిస్థితులతో సెబీ ఒకసారి సడలింపులు ఇస్తున్నట్లు సెబీ ప్రకటించింది. పరిశీలన లేఖలు గడువు సెప్టెంబరు వరకూ పొడిగించినట్లు సర్క్యులర్‌లో వెల్లడించింది. మార్కెట్లలో తీవ్రస్థాయి అనిశ్చిత పరిస్థితులు ఎదురైనప్పటికీ 2026లో ఇప్పటివరకూ 1.78 లక్షలకోట్లు ఐపిఒలద్వారా వచ్చింది. మొత్తం 112 మెయిన్‌బోర్డు ఐపిఒలు గత ఏడాది 78 కంపెనీలు సేకరించిన 1.62 లక్షలకోట్లను అధిగమించి ఎక్కువ నిధులు సేకరగించగలిగినట్లు ప్రైమ్‌డేటాబేస్ గణాంకాలు చెపుతున్నాయి.

ప్రస్తుతం 144 కంపెనీలు రూ.1.75 లక్షలకోట్లు సమీకరించేందుకు సెబీ ఆమోదం పొందాయి. మార్కెట్లలో లాంచ్ అయ్యేందుకు వేచి ఉన్నాయి. మరో 63 కంపెనీలు రూ.1.37 లక్షలకోట్లు సమీకరించేందుకు సెబీ క్లియరెన్స్‌కోసం వేచి ఉన్నాయి. 22 కోట్లతో 18 కంపెనీలు దాఖలుచేసి ఆమోదం పొందినా మురిగిపోయాయి. అలాగే మరో 15కంపెనీలు 9200కోట్లు సమీకరించాలని దరఖాస్తుచేసి ఆతర్వాత విత్‌డ్రా చేసుకున్నాయి.

# డాలర్ వర్సెస్ రూపాయి 93.05



**ముంబయి, ఏప్రిల్ 7:** డాలరుతో రూపాయి విలువలు రోజురోజుకూ మారుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధప్రభావం వల్లో ఏమో కానీ చమురు ధరలు పెరగడం డాలర్ చెల్లింపులు పెరగడంతో డాలర్‌కు ఎక్కడలేని డిమాండ్ వచ్చింది. దీనితో భారత్‌రూపాయి కనిష్టంగా పడిపోతోంది. యుద్ధ విరమణ ప్రతిపాదనలు మళ్లీ తెరపైకి రావడంతో రూపాయి క్రమేపీ బలపడుతోంది. ముందురోజు 33 పైసలు బలపడిన రూపాయి మంగళవారం మళ్లీ 17 పైసలు క్షీణించింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజి మార్కెట్‌లో రూపాయి 93.05 వద్ద ప్రారంభం అయి ట్రేడింగ్‌ముగిసేనాటికి 93.07 వద్ద స్థిరపడింది. ముందురోజుకంటే 17 పైలు క్షీణించింది. ఇంట్రాడేలో 92.86వరకూ వెళ్లిన రూపాయి తదనంతరం క్షీణిస్తూ వచ్చింది. రిజర్వుబ్యాంకు తన మూడురోజులపాటు నిర్వహించేఎంపిసి సమీక్షలో మారకం విలువలు కూడా తెరపైకి వచ్చినట్లు సమాచారం.

ఆరుగురుసభ్యుల ఎంపిసి కమిటీ బుధవారం తన సమీక్ష నిర్ణయాలను వెల్లడించనున్నది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ వివరాలు వెల్లడిస్తారు. బ్రెంట్ ముడిచమురు 1.97శాతం క్షీణించి బ్యారెల్‌కు 107.61వద్ద ట్రేడ్ అయింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.8167.17 కోట్లు మార్కెట్ల నుంచి విత్‌డ్రాచేసుకున్నారు. ఈపరిణామాలన్నీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌పై ప్రభావం చూపించాయి.

# 633 మిలియన్లకు క్యూఆర్ కోడ్ చెల్లింపులు

UPI
UNIFIED PAYMENTS INTERFACE

**ముంబయి, ఏప్రిల్ 7:** యుపిఐ క్యూఆర్ కోడ్‌లద్వారా జరిగే చెల్లింపులు 2025సంవత్సరంలో 15శాతం పెరిగాయి. గత ఏడాది 633.44 మిలియన్లుగా ఉన్న క్యూఆర్ లావాదేవీల ఈ ఏడాది 731.38 మిలియన్లకు పెరిగినట్లు వరల్డ్‌లైన్ నివేదిక వెల్లడించింది. యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ క్విక్ రెస్పాన్స్ కోడ్‌ల ద్వారా చెల్లింపులు శరవేగంగా జరుగుతున్నట్లు తేలింది. లావాదేవీలు కూడా 33శాతంపెరిగాయి. 172.2 బిలియన్ లావాదేవీలనుంచి 228.5 బిలియన్ లావాదేవీలకు పెరిగాయి. పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్ల లావాదేవీలు కూడా 15శాతంపెరిగి 11.48 మిలియన్లకు పెరిగినట్లు తేలింది. 2025లో గణనీయంగా క్యూఆర్, పిఒఎస్ లావాదేవీలు అత్యధికంగా ఉన్నాయి. సగటు చెల్లిండులు యుపిఐ క్యూఆర్ కోడ్ సాయంతో రూ.1314గా ఉంది.

అంతకుముందు ఏడాది 1437గా ఉంది. క్రెడిట్‌కార్డులు, డెబిట్‌కార్డులతో సగటు చెల్లింపులు రూ.4150గాను, రూ. 3360గాను ఉన్నట్లు అంచనా. డిజిటల్ చెల్లింపులకు అత్యధిక ప్రాధాన్యతను కూడా ఇపుడు ఇస్తున్నాయి. బ్యాంకులు, వ్యాపార సంస్థలు, ఎక్కడ అయినా సరే తినుబండారాల స్టాల్స్‌నుంచి అన్నీ కూడా క్యూఆర్ కోడ్‌లే ఏర్పాటు చేసుకుంటున్నాయి. దీనివల్ల ఇపుడు ప్రపంచ వ్యాప్తంగా కూడా క్యూఆర్ చెల్లింపులు పెరుగుతున్నట్లు వరల్డ్‌లైన్ సర్వేలో తేలింది.

# జెప్టో ఐపిఒకు సెబీ గ్రీన్‌సిగ్నల్




**ముంబయి, ఏప్రిల్ 7:** క్విక్‌కామర్స్ స్టార్టప్ జెప్టో ఐపిఒకు స్టాక్ ఎక్స్ఛేంజిల నియంత్రణ సంస్థ సెబీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. సంస్థాగత ఇన్వెస్టర్లనుంచి కూడా సంసిద్ధత వ్యక్తం అయ్యేందుకువీలుగా కంపెనీ ప్రస్తుతం కసరత్తులు చేస్తోంది. ఐపిఒకు వచ్చేముందు సంస్థాగత అభిప్రాయసేకరణ జరిపి తుదికసరత్తులుచేస్తోంది. అందువల్లనే జెప్టో ఇన్వెస్టర్లతో చర్చలు జరుపుతోంది. కంపెనీ మార్కెట్ విలువలు, ఎంతమేర ఐపిఒకు రావాలి, ఒఎఫ్‌ఎస్‌కింద ఎంతమొత్తం సమీకరించాలి అన్న అంశాలపై తుది చర్చలు జరుపుతున్నట్లు అంచనా. ఐపిఒద్వారా మొత్తం 1.2 బిలియన్ డాలర్లు సమీకరించాలనినిర్ణయించారు. ఐపిఒకోసం ఇపట్టఇకే జెప్టో వాటాదారులనుంచి ఆమోదం పొందింది.

గత ఏడాది డిసెంబరు లోనిర్వహించిన సర్వప్రతినిధి సమావేశంలోనే జెప్టో ఐపిఒకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. కంపెనీ మోర్గాన్ స్టాన్లీ, యాక్సిస్ కేపిటల్, హెచ్‌ఎస్‌బిసి, గోల్డ్‌మాన్ శాక్స్, జెఎం ఫైనాన్షియల్, ఐఐఎఫ్‌ఎల్ సెక్యూరి టీస్, మోతీలాల్ ఓస్వాల్ సంస్థలను బ్యాంకర్లుగా నియమించుకుంది. జెప్టో తన కార్యకలాపాలన్నింటినీ సింగపూర్‌నుంచి భారత్‌కు జనవరిలోనే మార్చేసుకుంది.

# ఎయిరిండియా సిఇఒ క్యాంప్‌బెల్ రిజైన్




**ముంబయి, ఏప్రిల్ 7:** ఎయిరిండియా సిఇఒ కాంప్‌బెల్ విల్సన్ తన పదవినుంచి వైదొలిగారని, కొత్త సిఇఒ వచ్చేంతవరకు మాత్రమే ఆయన సిఇఒగా కొనసాగుతారన్న వార్తలు ఎయిర్‌లైన్స్ రంగంలో సంచలనం కలిగించాయి. ఎయిర్‌లైన్స్ అనేక సవాళ్లను ఒకేసారి ఎదుర్కొనాల్సి రావడం, ఆర్థికంగా నష్టాలు, అనేక అంతరాయాలు, భౌగోళిక ఉద్రిక్తతలతో సర్వీసులు నడపలేకపోవడం వంటి అంశాలు సిఇఒ వైదొలగడానికి కారణం అయినట్లు సమాచారం. అత్యధికంగా ఆర్థిక సవాళ్లే కారణమని తెలుస్తోంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ రెండు కలిపి సుమారు 98బిలియన్ రూపాయలు నష్టం చవిచూసాయని అంచనా. సర్వీసులను ఆధునీకరించడం, టాటా ఏవియేషన్ గ్రూప్‌లో విలీనంచేయడం వంటివి వ్యయాలను కొంతమేర క్రమబద్ధీకరించుకోవాల్సి వచ్చింది. ఎయిరిండియా ప్రస్తుతం 191 విమానాలు నడుపుతోంది. మరో 500విమానాలకు ఆర్డర్లు ఇచ్చింది. ఇటీవలే డిజిసిఎ స్క్రూటినీని కూడా ఎదుర్కొంది. అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత ఎయిర్‌లైన్స్‌పై కస్టమర్లకు విశ్వాసం సన్నగిల్లుతోంది. దీనికితోడు పశ్చిమాసియా యుద్ధంతో ఎయిరిండియాతోపాటే ఇతర ఎయిర్‌లైన్స్ కూడా భారీ నష్టాలు చవిచూసాయి. సుమారుగా 2500 కోట్ల రాబడులు నష్టపోయాయన్న అంచనా కూడా ఉంది. వాటిలో ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులకే ఎక్కువ వాటా ఉంది.

యుద్ధం మరింతగా కొనసాగితే ఇరాన్, పాకిస్థాన్‌లపై గగనతలం మీదుగా వెళ్లేందుకు వీలు ఉండదు. దీనివల్లప్రయాణదూరం మరింతపెరిగి నిర్వహణ భారం మరింతపెరుగుతుంది. ఆసియా దేశాలకు ఇరాన్‌యుద్ధం కారణంగా 2500 విమానసర్వీసులు రద్దుచేయాల్సి వచ్చిందని సిఇఒ స్వయంగా సిబ్బందికి ఈమెయిల్స్ ఇచ్చారు. కేవలం 30శాతం మాత్రమే ఇపుడు సర్వీసులు నడుస్తున్నాయి. యూకె, యూరోప్; ఉత్తర అమెరికాలకు వెళ్లాలంటే సుదూర రూట్లను ఎంచుకోవాల్సి వస్తోంది. దీనివల్ల వ్యయం మరింత పెరుగుతోంది. ఈపరిణామాలన్నింటి దృష్ట్యా సిఇఒ ఎయిరిండియానుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.